www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 3-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 289

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి సా. 5.22 తదుపరి నవమి; నక్షత్రం: విశాఖ పూర్తి; వర్జ్యం: ఉ.11.53-1.35; దుర్ముహూర్తం: ఉ.6.51-8.21; అమృతఘడియలు: రా.10.03-11.44; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.08

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## పార్లమెంటులో 'వేర్పాటు' సెగ

దక్షిణాదిని ప్రత్యేక దేశం చేయాలన్న కాంగ్రెస్ ఎంపీ వ్యాఖ్యలపై రగడ

డీకే సురేశ్, కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని రాజ్యసభలో బీజేపీ డిమాండ్

విభజన కోరే వ్యక్తి ఏ పార్టీ వాడైనా సహించబోమన్న మల్లికార్జున ఖర్గే

తమ ఎంపీ వ్యాఖ్యలను వక్రీకరించారని కాంగ్రెస్ అధ్యక్షుడి వివరణ

లోక్‌సభనూ కుదిపేసిన వివాదం..కాంగ్రెస్, డీఎంకే వాకౌట్

మోదీ సర్కారుపై దక్షిణాదిన అపోహలెక్కువ!: కేంద్ర మంత్రి నిర్మల

2



డీకే సురేశ్



మోదీ, కేడీ కలిసి కాంగ్రెస్‌ను అడ్డుకోవాలని చూస్తున్నారు. నిలువు దోపిడీ చేసిన కేసీఆర్ మళ్లీ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. 6-7 సీట్లను గెలిపించుకుని మోదీకి అమ్ముకునే పథకం వేశారు. ఇండియా కూటమిలోకి కేసీఆర్‌ను రానివ్వబోం. బీఆర్ఎస్ ఇంటి మీది పిట్ట కాంగ్రెస్ ఇంటిపై వాలినా కాల్చిపడేస్తాం.

\- సీఎం రేవంత్

# ఎవడ్రా కూల్చేది

## ప్రజా ప్రభుత్వాన్ని పడగొడితే ప్రజలు ఊరుకుంటారా!?

తెలంగాణ ఎవరి చేతుల్లో భద్రమో ఆలోచించండి

త్వరలోనే ప్రియాంక సమక్షంలో 500కు సిలిండర్

తెల్లకార్డుదారులందరికీ 200 యూనిట్ల కరెంటు

15 రోజుల్లో 15 వేల కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ

కేసీఆర్ జీవితంలో మళ్లీ ఎప్పటికీ సీఎం కాలేడు

నిత్యానందలాగా దీవికి రాజుగా ప్రకటించుకోండి

ఆయనకు ఎంపీ సీట్లిస్తే మోదీకి అమ్ముకుంటాడు

7 లక్షల కోట్ల అప్పుతో ఆదిలాబాద్‌కేమిచ్చాడు?

ఇంద్రవెల్లి సభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేస్తే రాష్ట్ర ప్రజలు ఊరుకోరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విపక్షాలను హెచ్చరించారు. అలాంటి ఆలోచన చేసిన వాళ్లను వేప చెట్లకు కట్టేసి, కొట్టి లాగుల్లో తొండలు వదలాలని యువతకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తామని, మరో ఆర్నెల్లలో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతాడని కొంతమంది నేతలు ప్రగల్భాలు పలుకుతున్నారని ప్రస్తావిస్తూ, "ఎవడ్రా ప్రభుత్వాన్ని పడగొట్టేది? ఇది ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం.. ప్రజలు ఆశీర్వదించిన ప్రభుత్వం.. ప్రజల కోసం పని చేస్తున్న ప్రభుత్వం... ప్రభుత్వాన్ని పడగొడితే యువత చూస్తూ ఊరుకుంటారా?" అని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో నిర్వహించిన తెలంగాణ పునర్నిర్మాణ సభలో పాల్గొన్నారు. సభకు ముందు కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడారు. ఇంద్రవెల్లి అమరవీరులకు నివాళులు అర్పించి, స్మృతి వనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇంద్రవెల్లి అమర వీరుల స్థూపం సాక్షిగా

మిగతా 13వ పేజీలో...

**నాగోబా ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు**

ఇంద్రవెల్లి సభకు హాజరైన ప్రజలు; గంట కొట్టి పార్లమెంటు ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తున్న సీఎం రేవంత్

## 8 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు!

రేపు క్యాబినెట్.. పలు అంశాల చర్చ

ఓటాన్ అకౌంట్ బడ్జెట్, గ్రూప్-1 పోస్టుల భర్తీ, మరో 2 గ్యారెంటీల అమలుపై చర్చించే అవకాశం 13



వాటా తేలే దాకా ప్రాజెక్టులను

# అప్పగించలేం

అప్పటిదాకా 50:50 నిష్పత్తిలో నీటిని పంచాలి

సర్కారు అనుమతి లేకుండా ప్రాజెక్టులను ఇవ్వలేం

కృష్ణా బోర్డు భేటీలో తేల్చి చెప్పిన తెలంగాణ ఈఎన్‌సీ

తెలంగాణ ఇస్తేనే మా ప్రాజెక్టులు ఇస్తాం: ఏపీ ఈఎన్‌సీ

సాగర్, శ్రీశైలం సహా 15 కాంపోనెంట్లనూ అప్పగించాలి

ఆ తర్వాత ఉద్యోగుల వివరాలివ్వాలి: కృష్ణా బోర్డు

గురువారం నాటి సమావేశం మినిట్స్ విడుదల

నీటిపారుదల శాఖ శ్వేతపత్రంలో విజిలెన్స్ నివేదిక

అసెంబ్లీ సమావేశాలకు ముందే శ్వేతపత్రం విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కృష్ణాజలాలపై ట్రైబ్యునల్ తీర్పు వెలువడే దాకా, 50:50 నిష్పత్తిలో నీటిని పంచాలని తెలంగాణ ఈఎన్‌సీ కోరినట్లు కృష్ణా బోర్డు తెలిపింది. సాగర్, శ్రీశైలం ఆపరేషనల్ ప్రొటోకాల్ ఖరారు అయితేనే ప్రాజెక్టుల అప్పగింతపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసినట్లు పేర్కొంది. కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ అధ్యక్షతన గురువారం సమావేశం జరగ్గా... ప్రాజెక్టుల అప్పగింతపై తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా పరస్పర విరుద్ధ

మిగతా 12వ పేజీలో...

## మేడిగడ్డ దర్యాప్తు సంగతి ఏమైంది?

2 వారాల్లో జవాబు ఇవ్వండి

సర్కారుకు హైకోర్టు ఆదేశాలు

## కృష్ణా జలాలను కాపాడేది బీఆర్ఎస్సే

తెలంగాణ హక్కులు మోదీకి

రేవంత్ తాకట్టు: కేటీఆర్

12

# నీకూ మీ నాన్న గతే!

షర్మిల, వైఎస్ విజయలక్ష్మినీ వదలబోమంటున్నారు

సోషల్ మీడియాలో బెదిరిస్తున్నారు.. 'లేపేయ్ అన్నాయ్' అంటూ పోస్టులు

హైదరాబాద్ పోలీసులకు వైఎస్ వివేకా కూతురు సునీతారెడ్డి ఫిర్యాదు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో తనపై అసభ్యకర, బెదిరింపు పోస్టులు పెడుతున్నారంటూ పులివెందులకు చెందిన వర్రా రవీంద్ర రెడ్డిపై వివేకానంద రెడ్డి కుమార్తె సునీతా రెడ్డి సైబరాబాద్ సైబర్ క్రైం పోలీస్‌లకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఫేస్‌బుక్, ట్విట్టర్ (ఎక్స్), ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అసభ్యకర, బెదిరింపు పోస్టులు ఎక్కువైందని... తనకు ప్రాణహాని ఉందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తనతోపాటు షర్మిల, విజయమ్మనూ లక్ష్యంగా చేసుకుని బెదిరిస్తున్నారని తెలిపారు. "బాబాయ్‌కి (వివేకా) పట్టిన గతే నీకూ పడుతుంది. అవసరమైతే షర్మిల, విజయమ్మనూ వదలం. షర్మిల వాళ్ల నాన్నకు పుట్టలేదు"... ఇలా అసభ్య పదజాలంతో పలు పోస్టులు పెట్టారని ఫిర్యాదులో తెలిపారు. ఇటీవల తాను షర్మిలను ఇడుపులపాయలో కలిసిన ఫొటోను పోస్ట్ చేసి... "అందుకే పెద్దలన్నారు శత్రు శేషం ఉంచకూడదని! లేపేయ్ అన్నాయ్ ఇద్దర్నీ. ఈ ఎన్నికలకు పనికొస్తారు" అంటూ మరో పోస్టు పెట్టారని చెప్పారు. 'షర్మిల మీద జాలిపడాల్సిన అవసరం లేదు. గట్టిగా వినండి. గేరు మార్చండి..అన్న జోలికొస్తే ఎవడినీ వదలం... సోషల్ మీడియా దెబ్బ రుచిరూపిస్తాం... ఇంత జరుగుతున్నా పెద్దావిడ నోరు

మిగతా 3వ పేజీలో...

3



### జగనన్నా.. నీకు బాధ్యత లేదా?

తల్లినీ, చెల్లెళ్లను తిడుతున్నా చేతులు దులుపుకొంటావా?

కాలకేయుల్లా సోషల్ మీడియా

షర్మిల వాళ్ల నాన్నకు పుట్టలేదనీ పోస్టులు పెడుతున్నారు..!

వివేకా కుమార్తె సునీత ఆవేదన



## ఏపీలో బీజేపీ రాజ్యం

ఆ పార్టీకి ఒక్క సీటూ ఇవ్వకున్నా రాష్ట్రాన్ని బానిస చేశారు

పదేళ్లు హోదా ఇస్తామన్న మోదీ హీనంగా చూస్తున్నారు

31 మంది ఎంపీలు ఉండి కూడా హోదాపై నోరెత్తరేం

షర్మిల ధ్వజం.. ఢిల్లీ ఏపీ భవన్‌లో ప్రత్యేక హోదాపై ధర్నా

'ఝార్ఖండ్ క్యాంపు'

# తెలంగాణలో!



39 మంది జేఎంఎం కూటమి ఎమ్మెల్యేల రాక

రెండు విమానాల్లో బేగంపేట ఎయిర్‌పోర్టుకు

శామీర్‌పేట్‌లోని రిసార్టులో 3 రోజులు మకాం

పార్టీ నేతలకు ఎమ్మెల్యేల బాధ్యతల అప్పగింత

పర్యవేక్షించిన దీపాదాస్, పొన్నం, సంపత్

హైదరాబాద్/ శామీర్‌పేట/ మేడ్చల్ టౌన్/ బేగంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ రాజకీయం తెలంగాణకు చేరింది. ఆ రాష్ట్ర కొత్త సీఎం చంపయీ సోరెన్ నేతృత్వంలో ఏర్పాటైన ప్రభుత్వం సోమవారం శాసనసభలో విశ్వాస పరీక్షను ఎదుర్కోనున్న నేపథ్యంలో, ఎమ్మెల్యేలెవరూ చేజారకుండా ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కూటమి ఎమ్మెల్యేలను శుక్రవారం హైదరాబాద్‌కు తరలించారు. జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీలకు చెందిన 39 మంది ఎమ్మెల్యేలు రాంచీలోని బిర్సా ముండా ఎయిర్‌పోర్ట్ నుంచి రెండు ప్రత్యేక విమానాల్లో బయల్దేరి హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడ వారిని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కలిశారు. ఎమ్మెల్యేలను విమానాశ్రయం నుంచి రెండు ప్రైవేటు బస్సుల్లో అత్యంత భద్రతా ఏర్పాట్ల మధ్య శామీర్‌పేటలోని

మిగతా 2వ పేజీలో...



### ఝార్ఖండ్ సీఎంగా చంపయీ ప్రమాణం

శాసనసభలో ఈ నెల 5న విశ్వాసపరీక్ష

హైకోర్టుకు వెళ్లండి.. అరెస్టుపై మేం జోక్యం చేసుకోం

సుప్రీంలో హేమంత్‌కు ఎదురుదెబ్బ.. 5 రోజుల కస్టడీకి

2



14

## డబ్బులొస్తాయంటే వీడియోలకు లైకులు కొట్టా

సైబర్ మోసం నుంచి త్రుటిలో తప్పించుకున్నా

కర్ణాటక మాజీ డీజీపీ కూడా బాధితుడే

అప్రమత్తతతోనే అడ్డుకట్ట: డీజీపీ రవిగుప్తా

## లాకర్లలో బంగారం!

రెరా కార్యాలయం బీరువా బద్దలుకొట్టిన ఏసీబీ

భూముల పత్రాలు, పాస్ పుస్తకాలు స్వాధీనం

హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ కేసు

3వ రోజు విచారణలో కీలక విషయాల వెల్లడి

త్వరలో మరిన్ని అరెస్టులు 13

## నెలలోనే ఆరుగురు

గడిచిన వారం రోజుల్లో ముగ్గురు

అమెరికాలో భారతీయ విద్యార్థుల మరణాలు

2018నుంచి విదేశాల్లో 403మంది మృతి

కెనడాలో 91, అగ్రరాజ్యంలో 36 మంది..

లోక్‌సభలో ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

భారత విద్యార్థుల భద్రతకే తొలి ప్రాధాన్యం

విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ వెల్లడి

ఒహాయోలో మరో భారతీయ విద్యార్థి మృతి

అనుమానాస్పద స్థితిలో శ్రేయాస్‌రెడ్డి మరణం

2

## హైస్పీడ్ రైళ్ల ప్రాజెక్టుల్లో వేగం

మార్గంలోగా కారిడార్ల సర్వే

వేగం గంటకు 220 కి.మీ

బడ్జెట్‌లో రైల్వే ప్రాజెక్టులకు పెరిగిన కేటాయింపులు

దక్షిణమధ్యరైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ వెల్లడి

ఎంఎంటీఎస్ రెండోదశ కొనసాగింపు ఇప్పట్లో లేనట్లే!

12





# మహిళలూ జరభద్రం

## దేశంలో నానాటికీ పెరుగుతున్న సర్వైకల్ క్యాన్సర్ ముప్పు



14

భారత్‌లో ఏటా 80 వేల కేసులు, 35వేల మరణాలు

సర్వైకల్ క్యాన్సర్ కట్టడికి కేంద్ర ప్రభుత్వం చర్యలు

సెప్టెంబరు నుంచి వ్యాక్సినేషన్‌కు సన్నాహాలు

టీకాలు, పరీక్షలతో చాలావరకూ తగ్గే ముప్పు

రేపు ప్రపంచ క్యాన్సర్ దినం



*భారత్‌లో ఏటా దాదాపు 80 వేల మంది గర్భాశయ క్యాన్సర్ బారిన పడుతున్నారు. 35 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా 1% మంది మహిళలు మాత్రమే గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం 9-14 ఏళ్ల బాలికలకు టీకా ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నట్టు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ఆ మర్నాడే ప్రముఖ మోడల్, నటి పూనమ్ పాండే గర్భాశయ క్యాన్సర్‌తో మృతిచెందారు. దీంతో సర్వైకల్ క్యాన్సర్ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో అసలు గర్భాశయ క్యాన్సర్ అంటే ఏమిటి..? ఎలా సంక్రమిస్తుంది..? లక్షణాలేమిటి..? నివారణకు మార్గాలున్నాయా? ప్రభుత్వం ఏం చేస్తోంది..? సవివర కథనం*

## భారత్‌లో విజృంభణ

స్త్రీలలో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అధికం

2022లో 14 లక్షల కేసులు.. 9 లక్షల మరణాలు

పురుషుల్లో నోటి, లంగ్ క్యాన్సర్లు: డబ్ల్యూహెచ్‌వో

నిరుడు 3.4లక్షల సర్వైకల్ కేసులు: కేంద్రం

తెలంగాణలో ఏటా 15 వేల సర్వైకల్ క్యాన్సర్లు?

ఎంఎన్‌జే ఆస్పత్రిలో 13% కేసులు అవే 14

## పూనమ్ పాండే మృతి

32 ఏళ్లకే బలితీసుకున్న గర్భాశయ కేన్సర్



## తమిళగ వెట్రి కళగం

హీరో విజయ్ కొత్త పార్టీ.. రాజకీయాల్లోకి రాక

పార్లమెంటు ఎన్నికలకు దూరం.. అసెంబ్లీ లక్ష్యం

2026లో అధికారం తమదేనని ధీమా

# ఒక్క నెలలోనే ఆరుగురు

## అమెరికాలో ఆందోళనకరంగా భారతీయ విద్యార్థుల మరణాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: అమెరికాలో గడిచిన వారం రోజుల్లో ముగ్గురు భారతీయ విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. జనవరి ప్రారంభం నుంచి చూస్తే ఆరుగురు చనిపోయారు. వీరిలో ఇద్దరు అనుమానాస్పద స్థితిలో మరణించగా, డ్రగ్స్‌కు బానిసైన ఓ వ్యక్తి హరియాణాకు చెందిన మరో విద్యార్థిని దారుణంగా సుత్తితో కొట్టి హత్య చేశారు. మరొకరు హైపోథెర్మియాతో చనియాడు. ఇద్దరు తెలుగు విద్యార్థులు జనవరి 15న అనుమానాస్పద స్థితిలోనే మరణించగా.. వారి మరణానికి ఇంట్లోని గ్యాస్ లీకేజీనే కారణం అని తర్వాత తేలింది. ఈ వరుస మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

1 ఇండియానా రాష్ట్రంలోని పర్డ్యూ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ చదువుతున్న నీల్ ఆచార్య శవమై కనిపించాడు. గత నెల 28న ఆచార్య అదృశ్యమైనట్లు అతని తల్లి గౌరీ ఆచార్య ఫిర్యాదు చేసిన కొన్ని గంటల్లోనే వర్సిటీ క్యాంపస్‌లో అతడి మృతదేహం లభ్యమైంది.

1 జనవరి 16న జార్జియాలో జులియన్ ఫాల్క్‌నర్(25) అనే వ్యక్తి హరియాణాకు చెందిన ఎంబీఏ విద్యార్థి వివేక్ సైనీ(25)ని 50సార్లు సుత్తితో కొట్టి చంపాడు.

1 మరో భారతీయ విద్యార్థి అకుల్ ధావన్(18) జనవరి మొదట్లో యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్ అర్బానా-షాంపెయిన్ వెలుపల శవమై కనిపించాడు. శవపరీక్షలో అతను హైపోథెర్మియాతో మరణించినట్లు గుర్తించారు.

1 జనవరి 15న కనెక్టికట్ వసతి గృహంలో ఇద్దరు తెలుగు విద్యార్థులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన నికేశ్ (21), తెలంగాణలో వనపర్తికి చెందిన దినేశ్ (22) ఉన్నత చదువుల కోసం అంతకుముందు నెల రోజుల క్రితమే అమెరికా వెళ్లారు. వారి మరణానికి గల కారణమేంటో ఇప్పటికీ తెలియరాలేదు.

### 2018 నుంచి 36 మంది: కేంద్రం

2018 నుంచి ఇప్పటి వరకూ విదేశాల్లో చదువుతున్న 403 మంది భారతీయ విద్యార్థులు వేర్వేరు కారణాలతో మరణించినట్లు లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. కెనడాలో అత్యధికంగా 91మంది మరణించారు. ఆ తర్వాత బ్రిటన్‌లో 48మంది, రష్యాలో 40మంది, అమెరికాలో 36మంది, ఆస్ట్రేలియాలో 35 మంది, ఉక్రెయిన్‌లో 21 మంది, జర్మనీలో 20 మంది మృతిచెందినట్లు వివరించింది. వీటిలో సాధారణ మరణాలతో పాటు ప్రమాదాలు, వైద్య సంబంధిత కారణాలు తదితరాలు ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది. విదేశాల్లో చదువుతున్న భారత విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని ఓ ప్రశ్నకు సమాధానంగా విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. కాగా, అమెరికాలో భారతీయ విద్యార్థులు తమ భద్రతపై తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని ఆ దేశానికే చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సర్వేలో వెల్లడైంది. ఈ కారణంగా విద్యార్థులు ఇతర దేశాలకు తరలిపోయే ప్రమాదముందని ఐఐఈ హెచ్చరించింది. యువ భారతీయ-అమెరికన్లు జాతి వివక్షను ఎదుర్కొంటున్నారని మరో సర్వే తెలిపింది.

### ఒహియోలో మరో భారతీయ విద్యార్థి మృతి



ఒహియో రాష్ట్రం సిన్సినాటిలోని లిండర్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో చదువుతున్న భారతీయ విద్యార్థి శ్రేయాస్ రెడ్డి బెనిగేరి(19) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. శ్రేయాస్ మరణానికి దారితీసిన పరిస్థితులపై ప్రస్తుతం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, ఇందులో తమకు ఎలాంటి అనుమానాలు లేవని న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ ధ్రువీకరించారు. శ్రేయాస్‌రెడ్డి మృతిపట్ల కాన్సులేట్ సంతాపం వ్యక్తం చేసింది.




## యూపీఐతో ఈఫిల్ టవర్ టికెట్లు కొనొచ్చు

ముంబై, ఫిబ్రవరి 2: పారిస్‌లోని ఈఫిల్ టవర్‌ను సందర్శించే భారతీయ పర్యాటకులు ఇకపై భారత యూపీఐని వినియోగించి టికెట్లను కొనుగోలు చేయవచ్చని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) శుక్రవారం వెల్లడించింది. ఇందుకు సంబంధించి ఫ్రెంచ్ ఈ-కామర్స్, ప్రాక్సిమిటీ పేమెంట్స్ లైరాతో ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్‌తో జట్టుకట్టిందని పేర్కొంది. ఈఫిల్ టవర్‌ను సందర్శిస్తున్న అంతర్జాతీయ పర్యాటకుల్లో భారత పర్యాటకులు రెండో స్థానంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో యూపీఐ ద్వారా చెల్లింపుల సదుపాయం తీసుకురావడం ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. ఫ్రాన్స్‌లో యూపీఐ చెల్లింపులను అందిస్తున్న తొలి మర్చంట్ ఈఫిల్ టవర్.

## కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా, ఫిబ్రవరి 2: రాజస్థాన్‌లోని కోటా ప్రాంతంలో మరో విద్యార్థి నూర్ మహ్మద్ బుధవారం తన హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మహ్మద్.. చెన్నైలోని ఎస్ఆర్ఎం వర్సిటీలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. కోటాలోని విజ్ఞాన్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో పెయింగ్ గెస్ట్‌గా ఉంటూ ఆన్‌లైన్ క్లాసులకు హాజరవుతున్నాడు. గురువారం అతని గది బయట ఉన్న టిఫిన్ బాక్స్‌ను చూసి మెస్ బాయ్ పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు వచ్చి చూడగా అతడు చనిపోయి ఉన్నాడు. కోటాలో గత రెండు వారాల్లో ఇది మూడో ఆత్మహత్య.

## డ్రైవర్ల కోసం హైవేల్లో వెయ్యి విశ్రాంతి కేంద్రాలు

ఢిల్లీ, ఫిబ్రవరి 2: టాక్సీ ట్రక్కు డ్రైవర్ల కోసం హైవేల్లో విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. తొలి దశలో పలు జాతీయ హైవేల్లో 1000 కేంద్రాలను నిర్మించనున్నట్లు తెలిపారు. వీటిలో మరుగుదొడ్లతోపాటు మంచినీటి సదుపాయం కూడా కల్పించనున్నారు. న్యూఢిల్లీలోని భారత్‌మండపంలో జరిగిన 'భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో'లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొబిలిటీ సెక్టార్‌లో డ్రైవర్లది కీలకపాత్ర అని, సుదీర్ఘంగా ట్రక్కులు నడిపే వారికి విశ్రాంతి తీసుకునేందుకు వీలు లేకపోవడం వల్లే ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని చెప్పారు.

## సొమ్ము డిపాజిట్ చేస్తేనే నిందితులకు బెయిల్

» ప్రజా ఆస్తుల ధ్వంసంపై లా కమిషన్ సిఫారసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ప్రజల ఆస్తులను ధ్వంసం చేసే వారి నుంచే నష్ట పరిహారం వసూలు చేసేలా చట్టాన్ని సవరించాలంటూ లా కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. జరిగిన నష్టాన్ని అంచనా వేసి, అంత మొత్తాన్ని డిపాజిట్ చేశాకే నిందితులకు బెయిల్ మంజూరు చేయాలని కూడా సూచించింది. ఆందోళనలు జరిగినప్పుడు ఎవరూ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయకుండా ఉండడం కోసం ఈ నిబంధన ఉండాలని ప్రతిపాదించింది. ప్రస్తుతం ఉన్న పబ్లిక్ ఆస్తుల విధ్వంస నిరోధక చట్టంలో ఉన్న నిబంధనలు సరిపోనందున ఈ సిఫారసులను పొందుపరుస్తూ ప్రత్యేకంగా చట్టాన్ని రూపొందించాలని లేదంటే భారతీయ న్యాయ సంహితలో తగిన సవరణలు చేయాలని సూచించింది.

## హక్కుల ఉద్యమకారుడు హర్ష్ మాందెర్‌పై కేసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: మానవ హక్కుల ఉద్యమకారుడు, మాజీ ఐఏఎస్ అధికారి హర్ష్ మాందెర్ నివాసం, కార్యాలయాల్లో శుక్రవారం సీబీఐ సోదాలు చేసి ఆయనపై కేసు నమోదు చేసింది. విదేశీ విరాళాల నియంత్రణ చట్టాన్ని (ఎఫ్‌సీఆర్ఏ) ఉల్లంఘించినట్లు ఆరోపించింది. ఆయనపై కేంద్ర హోం శాఖ నుంచి వచ్చిన ఫిర్యాదుపై ప్రాథమిక దర్యాప్తు జరిపి కేసు నమోదు చేసినట్టు తెలిపింది. ఢిల్లీలో ఆయన నడుపుతున్న స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ ఈక్విటీ స్టడీస్ (సీఈఎస్)పైనా కేసు పెట్టింది. విదేశీ విరాళాల నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయంటూ కేంద్ర హోం శాఖ చేసిన ఫిర్యాదు మేరకు సీఈఎస్‌తోపాటు అమన్ బిరాదరి ట్రస్ట్, ఆక్స్‌ఫాం ఇండియా, యాక్షన్ ఎయిడ్ అసోసియేషన్లపై గతేడాది ఏప్రిల్ 13న సీబీఐ కేసు నమోదు చేసింది.

## మాల్దీవుల్లో భారత్ సైన్యం ఉపసంహరణకు ఓకే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: మాల్దీవుల్లో విధులు నిర్వర్తిస్తున్న సైనికులను ఉపసంహరించుకునేందుకు భారత్ అంగీకరించింది. అక్కడ 3 విమానయాన ప్లాట్‌ఫారంల వద్ద విధులు నిర్వర్తిస్తున్న మిలటరీ సిబ్బందిని మే10లోగా వాపసు తీసుకురానుంది. ఆ దేశానికి వైద్య సేవలందించేందుకు భారత్ ఇచ్చిన విమానం, హెలికాప్టర్ల నిర్వహణకు ప్రస్తుతం అక్కడ 80 మంది మిలటరీ సిబ్బంది ఉన్నారు. మార్చి 15లోగా వారిని ఉపసంహరించాలని మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు కోరడంతో భారత్ ఈ చర్య తీసుకోనుంది.

## ఆరు హైకోర్టులకు కొత్త సీజేలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: దేశంలోని ఆరు హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులు (సీజేలు) నియమితులయ్యారు. ఈ మేరకు వారి నియామకాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ఆమోదం తెలపగా, తదనుగుణంగా కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు రాజస్థాన్, అలహాబాద్ (యూపీ), గువాహటి (అస్సాం), ఉత్తరాఖండ్, ఒడిశా, మేఘాలయ హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను నియమించారు.

# ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి

» సీఎంకు నివేదిక అందజేసిన కమిటీ

» ఎల్లుండి అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

డెహ్రాడూన్, ఫిబ్రవరి 2: ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫారం సివిల్ కోడ్-యూసీసీ) అమలుకు రంగం సిద్ధమవుతోంది. దీనిపై అధ్యయనం చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ శుక్రవారం సీఎం పుష్కర్ సింగ్ ధామీకి నివేదిక అందజేసింది. దీనిపై చర్చించి, బిల్లును ఆమోదించేందుకు రాష్ట్ర అసెంబ్లీ సోమవారం ప్రత్యేకంగా సమావేశంకానుంది. 4 రోజులు ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. శనివారం మంత్రివర్గ సమావేశంలో ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. రాష్ట్రంలోని గిరిజనులకు ప్రత్యేక హోదా ఉన్నందున వారిని ఉమ్మడి పౌర స్మృతి నుంచి మినహాయింపు ఇస్తూ సిఫార్సులు చేసింది. ఈ నివేదిక అమలైతే ముస్లిం పర్సనల్ లా ప్రకారం వివాహం, విడాకుల కోసం ఉద్దేశించిన హలాలా, ఇద్దత్, ముమ్మారు తలాక్‌లను శిక్షార్హమైన నేరాలుగా పరిగణించనున్నారు. బహుభార్యత్వాన్ని నిషేధించనున్నారు. మొదటి భార్య ఉండగా రెండో వివాహం చేసుకోవడానికి వీల్లేదు. సహజీవనాన్ని తప్పనిసరిగా వెల్లడించాలన్న నిబంధన తీసుకురానున్నారు. వివాహాలను తప్పనిసరిగా రిజిస్టర్ చేయాల్సి ఉంటుంది. వారసత్వ ఆస్తి పొందడంలో బాలికలకు బాలురతో సమాన హక్కులుంటాయి. విడాకుల విషయంలో భార్యాభర్తలకు ఒకే తరహా కారణాలు వర్తిస్తాయి. సీఎం ధామీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయి నేతృత్వంలో అధ్యయన కమిటీని నియమించామని, ప్రజలనుంచి 2.3లక్షల అభిప్రాయాలు స్వీకరించామన్నారు.

# పార్లమెంటులో వేర్పాటు సెగ

## దక్షిణాదిని ప్రత్యేక దేశం చేయాలన్న కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ వ్యాఖ్యలపై తీవ్ర రగడ

» క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్

» విచ్ఛిన్న మనఃస్థితికి నిదర్శనం: గోయల్

» విభజన కోరే వ్యక్తి ఏ పార్టీ వాడైనా సహించబోమన్న ఖర్గే



డీకే సురేశ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 : దక్షిణ భారతదేశాన్ని ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయాలంటూ కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ చేసిన వ్యాఖ్యలు శుక్రవారం పార్లమెంటును కుదిపేశాయి. కాంగ్రెస్ పార్టీ, సోనియాగాంధీ తక్షణం దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అధికార బీజేపీ, ఎన్డీయే సభ్యులు ఉభయ సభల్లో డిమాండ్ చేశారు. దీనిపై రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఒక ప్రకటన చేశారు. దేశాన్ని విభజించాలని ఎవరు కోరినా, వారు ఏ పార్టీకి చెందిన వారైనా సహించేది లేదని స్పష్టం చేశారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు దేశమంతా ఒక్కటిగానే ఉండి తీరుతుందని తెలిపారు. అయినా, రాజ్యసభలో పరిస్థితి సద్దుమణగలేదు. తనకు ఉన్న విచ్ఛిన్న స్వభావాన్ని కాంగ్రెస్ మరోసారి బయటపెట్టుకున్నదని రాజ్యసభలో కేంద్రమంత్రి గోయల్ ఆగ్రహించారు. సురేశ్ వ్యాఖ్యలను సభ తేలిగ్గా తీసుకోరాదని డిమాండ్ చేశారు. అయితే, రాజ్యసభ సభ్యుడు కాని సురేశ్‌పై ఇక్కడ చర్చించలేమని ఖర్గే అనగా.. దీనిపై లోక్‌సభలోనే చర్చ జరపాలన్న తన ఆదేశాన్ని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ గుర్తుచేశారు. మీడియాలో వచ్చినట్టు తాను మాట్లాడలేదని సురేశ్ టీవీల ఎదుటే ప్రకటించారని, ఆయన ఏమైనా మాట్లాడి ఉంటే స్పందించడానికి సభా హక్కుల సంఘం ఉందని ఖర్గే అన్నారు. సురేశ్ అనని మాటలను పదే పదే సభలో ప్రస్తావించడం సరికాదన్నారు. ఈ సమయంలో కన్నడలో సురేశ్ చేసిన వ్యాఖ్యల ఇంగ్లిష్ అనువాదాన్ని పీయూష్ చదివి వినిపించారు. డీకే సురేశ్ కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు, ఎంపీ. గురువారం కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయన స్పందించారు. "పన్నుల ఆదాయంలోంచి తమ వాటాను దక్షిణాది రాష్ట్రాలు పొందలేకపోతున్నాయి. ఇక్కడ వసూలు చేసిన పన్నుల సంపద అంతా ఉత్తరాదిలోనే పంపిణీ అవుతోంది. ఈ అన్యాయాన్ని సరిదిద్దకపోతే.. దక్షిణాది రాష్ట్రాలు ప్రత్యేక దేశంగా వేర్పడక తప్పని పరిస్థితి నెలకొంటుంది" అని సురేశ్ అన్నారు. కాగా, లోక్‌సభను కూడా ఈ అంశం కుదిపేసింది. అధికార బీజేపీ, ఎన్డీయే సభ్యులు.. కాంగ్రెస్, సోనియాగాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై వారికి, కాంగ్రెస్, డీఎంకే సభ్యులకు మధ్య వాగ్వాదం నడిచింది. చివరకు ఇండియా కూటమిలోని ఆ రెండు పార్టీలు సభ నుంచి వాకౌట్ చేశాయి. శుక్రవారం సభలో జీరో అవర్‌లో ఈ అంశాన్ని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి లేవనెత్తారు.

### దక్షిణాదిన మాపై అపోహలెక్కువ!



మోదీ ప్రభుత్వ పనితీరుపై దక్షిణ భారతంలో నిజాల కంటే అపోహలే ఎక్కువగా ఉన్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆమె శుక్రవారం ఓ ఆంగ్ల చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. దక్షిణాదిన బీజేపీ పెద్దగా ఎదగకపోవడంపై అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ పలు అంశాలు ప్రస్తావించారు. దక్షిణాదిన ఇప్పటికే అభివృద్ధి ప్రేరక జీవావరణ వ్యవస్థ నెలకొని ఉందని.. దీని నిర్మాణంలో కేంద్ర రాష్ట్రాలు కీలక పాత్ర పోషించాయన్నారు. 'విద్య, నైపుణ్యం, ఉపాధి అవకాశాలు అక్కడ(దక్షిణాదిలో) ఉన్నాయి. విదేశాలకు వలస వెళ్లేవారి సంఖ్య కూడా ఆ ప్రాంతంలో చాలా ఎక్కువ. ప్రైవేటు పెట్టుబడులు అత్యధికం. మానవ వనరుల పాత్ర కూడా చాలా ఉంది. ఇందువల్లే దక్షిణాదిన ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. జీడీపీలో వారి వాటా కూడా అధికంగా ఉంది' అని తెలిపారు. ఆ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఆర్థిక సహకారం అందిస్తామని నిర్మల హామీ ఇచ్చారు.

## రూ.29కే కిలో బియ్యం!

» వచ్చే వారం నుంచి 'భారత్ రైస్'

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సామాన్యులకు కేంద్రం శుభవార్త చెప్పింది. భారత్ రైస్ పేరుతో రూ.29కే కిలో బియ్యం విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా వచ్చే వారం నుంచి అమ్మకాలు ప్రారంభమవుతాయని కేంద్ర ఆహార శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఇందు కోసం మొదటి దశలో 5 లక్షల టన్నుల బియ్యాన్ని కేటాయించామని తెలిపారు. బియ్యం ఎగుమతులపై నిషేధం కొనసాగుతున్నప్పటికీ ఏడాది కాలంలో ధరలు 15 శాతం మేర పెరిగాయన్నారు. 5 కిలోలు, 10 కిలోల బస్తాల్లో భారత్ రైస్ బియ్యం అందుబాటులో ఉంటాయని.. నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్ రిటైల్ కేంద్రాల్లో బియ్యం అమ్మకాలు జరుపుతామని వివరించారు. ఇప్పటికే భారత్ గోధుమ పిండి కిలో రూ.27.50, భారత్ దాల్ (శనగ పప్పు) కిలో రూ.60 చొప్పున విక్రయిస్తున్నట్లు గుర్తుచేశారు. బియ్యం ఎగుమతులపై ఆంక్షలు ఎత్తేస్తారంటూ వస్తున్న వార్తలను చోప్రా కొట్టిపారేశారు.

## ఇక బయోమెట్రిక్ ఇమిగ్రేషన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: అంతర్జాతీయ విమాన ప్రయాణికుల సౌకర్యార్థం ఇమిగ్రేషన్ విధానాన్ని వేగవంతం చేయాలని కేంద్రం భావిస్తోంది. అందులో భాగంగా విమానాశ్రయాల్లో బయోమెట్రిక్ ఆధారిత ఇమిగ్రేషన్, ఈ-గేట్ వ్యవస్థలను ఏర్పాటు చేయడానికి అన్ని చర్యలూ తీసుకుంటోంది. ఈ మేరకు శుక్రవారం పౌర విమానయాన శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. 'విమానాశ్రయం ఇంటీరియర్‌లో చేయాల్సిన మార్పులు, అంతర్జాతీయ ప్రయాణికుల ఇమిగ్రేషన్, సెక్యూరిటీ చెక్ ప్రక్రియలను వేగవంతం చేయడానికి అందుబాటులోకి తేవాల్సిన సాంకేతిక పరిజ్ఞానంపై మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సంబంధిత అధికారులతో చర్చించారు' అని ఆ ప్రకటన వివరించింది.

## తమిళ హీరో విజయ్ కొత్త పార్టీ

» పార్టీ పేరు 'తమిళగ వెట్రి కళగం'




చెన్నై, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తమిళనాట సినీరంగ నేపథ్యమున్న మరో రాజకీయ పార్టీకి బీజం పడింది. ఎంతోకాలంగా అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్న ప్రముఖ యువ హీరో విజయ్.. రాజకీయ పార్టీ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. తమిళగ వెట్రి కళగం(తమిళనాడు విజయం పార్టీ) పేరుతో పార్టీ ప్రారంభిస్తున్నానని తెలిపారు. అయితే, తన పార్టీ 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లోనే తలపడుతుందని, ఆ ఎన్నికలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికలకు దూరంగా ఉంటామని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. తన అభిమానుల సంఘాలు 'విజయ్ మక్కల్ ఇయక్కం'(విజయ్ ప్రజా సంస్థ) పేరుతో కొన్నేళ్లుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలను స్వచ్ఛందంగా చేపడుతున్నారని తెలిపారు. అయితే, సామాజిక, ఆర్థికపరమైన రాజకీయ సంస్కరణలు తెచ్చేందుకు స్వచ్ఛంద సంస్థకు సాధ్యం కాదన్నారు. అందుకే తమిళగ వెట్రి కళగం పేరుతో రాజకీయ పార్టీని ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘంలో పార్టీ పేరు నమోదు చేయించనున్నట్టు తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఏ కూటమికీ మద్దతు ఇచ్చే ప్రసక్తి లేదని చెప్పారు. 2026లో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ తప్పకుండా పోటీ చేసి అధికారంలోకి వస్తుందని విజయ్ ధీమా వ్యక్తం చేశారు. "పారదర్శకమైన జాతి, మత భేదాలకు తావులేని, అవినీతి రహిత సమాజ స్థాపన కోసం, రాజకీయ మార్పు కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారు. ఆ లోటును తీర్చేందుకే రాజకీయ పార్టీ ప్రారంభిస్తున్నాం" అని విజయ్ పేర్కొన్నారు. విజయ్ రాజకీయాల్లోకి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆయన అభిమానులు సంబరాలు జరుపుకొన్నారు.

# చంపయీ సోరెన్ ప్రమాణం

## 5న అసెంబ్లీలో విశ్వాస పరీక్ష

» సుప్రీంకోర్టులో హేమంత్‌కు ఎదురుదెబ్బ

» 5 రోజుల ఈడీ కస్టడీకి ఝార్ఖండ్ మాజీ సీఎం



రాంచీ, ఫిబ్రవరి 2: ఝార్ఖండ్ సీఎంగా చంపయీ సోరెన్ శుక్రవారం ప్రమాణం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆయన చేత ప్రమాణం చేయించారు. కాంగ్రెస్‌కు చెందిన ఆలంగిర్ ఆలమ్, ఆర్జేడీ నేత సత్యానంద్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రమాణం తర్వాత చంపయీ.. ఆదివాసీ యోధులు బిర్సా ముండా, సిధు కన్హోలకు నివాళి అర్పించారు. హేమంత్ సోరెన్ ప్రారంభించిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని, ఆదివాసీల కోసం జల్, జంగల్, జమీన్ (నీళ్లు, అడవి, భూమి) పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఆ తర్వాత చంపయీ తొలి క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 5-6 తేదీల్లో రెండురోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని, తొలిరోజే విశ్వాసపరీక్షను ఎదుర్కోవాలని క్యాబినెట్ భేటీలో నిర్ణయించారు.

### మేం జోక్యం చేసుకోం: సుప్రీంకోర్టు

హేమంత్ సోరెన్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తనను కుట్రపూరితంగా అరెస్టు చేశారని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తన ప్రభుత్వాన్ని కూల్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారని.. తన అరెస్టును చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని హేమంత్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, తాము ఈ అంశంలో జోక్యం చేసుకోబోమని, రాష్ట్ర హైకోర్టుకే వెళ్లాలని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, రాంచీలోని మనీలాండరింగ్ నిరోధక ప్రత్యేక కోర్టు శుక్రవారం హేమంత్‌ను ఐదు రోజులపాటు ఈడీ కస్టడీకి అప్పగించింది. మరోవైపు, ఝార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ రాజీనామా తర్వాత కొత్త సీఎం నియామకంపై రాష్ట్ర గవర్నర్ జాప్యం చేయటంపై రాజ్యసభలో విపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. ఇది రాజ్యాంగ ఉల్లంఘన అని ఖర్గే పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వం ఎల్లవేళలా కొనసాగాల్సిందేనని, సీఎంగా ఎవరుంటారన్నది ప్రధానం కాదని బీఆర్ఎస్ ఎంపీ కేశవరావు చెప్పారు.

## 'ఝార్ఖండ్ క్యాంపు' తెలంగాణలో!

(మొదటి పేజీ తరువాయి)

లియోనియో రిసార్టుకు తీసుకెళ్లారు. వారి వెంట పొన్నం ప్రభాకర్, సంపత్ కుమార్‌లతోపాటు కాంగ్రెస్ నేత అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు. శుక్రవారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి.. ఝార్ఖండ్ ఎమ్మెల్యేలతో సమావేశమవుతారని తొలుత కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నప్పటికీ, ఆ తర్వాత ఆ సమావేశం రద్దయినట్లు వెల్లడించాయి. ఝార్ఖండ్‌లో బల నిరూపణ జరిగే రోజున ఉదయం ఎమ్మెల్యేలు తిరిగి వెళ్లనున్నారు. అప్పటి వరకూ రిసార్ట్‌లో ఉండే ఎమ్మెల్యేల బాగోగులను ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, పార్టీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పార్టీ నేత రాంరెడ్డి చూసుకోనున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేలు లియోనియాలో బస చేసే విషయం ముందే బయటికి పొక్కకుండా కాంగ్రెస్ నేతలు పకడ్బందీగా వ్యవహరించారు. గురువారమే రిసార్టులోని 50 గదులను స్థానికంగా ఉన్న ఓ కాంగ్రెస్ నేత పేరు మీద బుక్ చేసినట్టు సమాచారం. ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో ఉన్నంత వరకు వారిని కంటికి రెప్పలా చూసుకునే విధంగా, ప్రతీ నలుగురు ఎమ్మెల్యేలకు ఒక కేర్ టేకర్ చొప్పున పార్టీ నేతలను నియమించినట్టు తెలిసింది. కాగా, రిసార్ట్‌లోకి ఉదయం నుంచి ఎవరినీ అనుమతించలేదు. ఎమ్మెల్యేల రాక విషయం తెలుసుకున్న మీడియా సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. పోలీసులు లియోనియా పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# జ్ఞానవాపీ మసీదు కమిటీకి చుక్కెదురు



జ్ఞానవాపీ మసీదు వద్ద భారీ సంఖ్యలో ముస్లింలు

ప్రయాగ్‌రాజ్, వారాణసి, ఢిల్లీ, ఫిబ్రవరి 2: వారాణసిలోని జ్ఞానవాపీ మసీదును నిర్వహిస్తున్న అంజుమన్ ఇంతెజామియా మసీద్ కమిటీకి శుక్రవారం అలహాబాద్ హైకోర్టులో ఎలాంటి తక్షణ ఊరట లభించలేదు. మసీదు దక్షిణ సెల్లారులోని వేద వ్యాస్ పీఠ్‌లో ఉన్న హిందూ దేవత విగ్రహాలకు పూజారి పూజలు జరుపుకోవచ్చంటూ బుధవారం వారాణసి జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆ కమిటీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ అప్పీలును పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ ఎలాంటి తక్షణ ఉత్తర్వులు ఇవ్వడానికి సుముఖత తెలుపలేదు. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. జిల్లా కోర్టు తీర్పును సవాలు చేస్తూ మసీదు కమిటీ గురువారం నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే ముందుగా హైకోర్టులో పిటిషన్ వేయాల్సి ఉంటుందని ప్రధాన న్యాయమూర్తి చెప్పడంతో కొద్ది గంటల వ్యవధిలోనే అలహాబాద్ హైకోర్టులో అప్పీలు సమర్పించింది. మసీదు కమిటీ తరఫున న్యాయవాది ఎస్.ఎఫ్.ఎ. నక్వీ వాదనలు వినిపిస్తూ జిల్లా కోర్టు చాలా హడావుడిగా నిర్ణయాన్ని వెలువరించిందని చెప్పారు. జిల్లా జడ్జి అజయ్ కృష్ణ విశ్వేశ రిటైరైన రోజునే తీర్పు ఇచ్చారని తెలిపారు. జనవరి 31 (బుధవారం)న ఆయన పదవీ విరమణ చేశారని, అదే రోజున ఆయన నిర్ణయాన్ని వెలువరించారని తెలిపారు. తాము సమర్పించిన పత్రాలను పరిగణనలోకి తీసుకోలేదని చెప్పారు. హిందూ పక్షం తరఫున విష్ణు శంకర్ జైన్ వాదిస్తూ నిజానికి ఆ ఆస్తిని స్వాధీనం చేసుకోవడానికి జిల్లా కలెక్టర్‌ను రిసీవర్‌గా నియమిస్తూ జనవరి 17నే జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. ఆ మేరకు ఆయన జనవరి 24న దానిని స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. జనవరి 17వ తేదీ ఉత్తర్వులకు కొనసాగింపుగా, తదుపరి చర్యగానే జనవరి 31న ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అదేమీ కొత్త ఉత్తర్వు కాదని చెప్పారు. జనవరి 17న ఇచ్చిన ఆదేశాలకు అభ్యంతరం చెప్పనందున ప్రస్తుతం చేసిన అప్పీలుకు విచారణార్హత లేదని తెలిపారు.

### మసీదు వద్ద భారీ బందోబస్తు

శుక్రవారం కావడంతో జ్ఞానవాపీ మసీదు వద్ద నమాజ్ చేయడానికి పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. కోర్టు తీర్పు నేపథ్యంలో గతంలోకన్నా రెట్టింపు సంఖ్యలో వచ్చారు. దాంతో ఇతర మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేయాలంటూ పోలీసులు వారిని తిప్పి పంపించారు. మరోవైపు మసీదు కమిటీ పిలుపు మేరకు వారాణసిలోని ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాల్లో బంద్ పాటించారు. షాపులను మూసివేయాలని, మహిళలు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదని ఆ కమిటీ కోరింది. శాంతి యుతంగా నమాజ్ చేయాలని హితవు చెప్పింది. అధికార యంత్రాంగం భారీ బందో బస్తు నిర్వహించడంతో అంతా ప్రశాంతంగా సాగింది.

# నచ్చని వాళ్లు వెళ్లిపోండి.. నేనేం బాధపడను



కోల్‌కతా, ఫిబ్రవరి 2: పదవులు అనుభవించిన నాయకులు ఒకరి వెంట ఒకరు వెళ్లిపోతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ భావజాలం నచ్చనివారు నిర్మొహమాటంగా బయటకు వెళ్లిపోవచ్చని.. దానికి తానేమీ బాధపడనని అన్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి వెళ్లిపోయిన అసోం సీఎం హిమంత విశ్వశర్మ, కేంద్ర మాజీ మంత్రి మిలింద్ దేవ్‌రా పేర్లను ప్రస్తావిస్తూ ఆయన మాట్లాడారు. హిమంత ఓ తరహా రాజకీయాలకు ప్రతినిధి అని.. అలాంటివి కాంగ్రెస్‌కు సరిపడవని పేర్కొన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఉన్న రాహుల్ గురువారం రాత్రి పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ డిజిటల్ మీడియా వారియర్స్‌తో సమావేశమయ్యారు. పార్టీ సిద్ధాంతాలను కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో టీఎంసీతో పొత్తు ఉంటుందని.. సీట్ల పంపకంపై చర్చలు నడుస్తున్నాయని, సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "మమతాజీ ఇండియా కూటమిలోనే ఉన్నారు" అని వ్యాఖ్యానించారు. అయితే, మమతా బెనర్జీ తాజాగా ఇండియా కూటమిలో విభేదాలు మరింత ముదిరేలా వ్యాఖ్యలు చేశారు. దమ్ముంటే వారాణసీలో బీజేపీని ఓడించాలని కాంగ్రెస్‌ను కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 40 సీట్లు గెలుస్తుందని కూడా తాను భావించడం లేదని, ఈ మాత్రానికే ఆ పార్టీకి అంత అహంకారం ఎందుకని వ్యాఖ్యానించారు.

### జోడో యాత్రకు కిలోమీటర్‌కు లక్షన్నర

రాహుల్ జోడో యాత్రకు కాంగ్రెస్ రూ.71 కోట్లు ఖర్చు పెట్టింది. ఎన్నికల ముందు సర్వేలకు మరో రూ.40 కోట్లు అయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పార్టీ ఆడిట్ నివేదికను కాంగ్రెస్ ఈసీకి సమర్పించి, మీడియాకు విడుదల చేసింది. అందులోని వివరాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో ఆ పార్టీ రూ.467 కోట్లు ఖర్చు పెట్టింది. అందులో ఆరో వంతు జోడో యాత్రకే ఖర్చయింది. 14 రాష్ట్రాల్లో యాత్ర సాగింది. రాహుల్ 4వేల కిలోమీటర్లు నడిచారు. అంటే యాత్రకు ఈ కిలోమీటర్‌కు సగటున రూ.1.59 లక్షలు అయ్యిందన్న మాట.



# ముత్తిరెడ్డి మమ్మల్ని మోసగించారు

- దళితబంధు పేరిట రూ.62 లక్షలు వసూలు
- ఆయన ఫామ్‌హౌస్ వద్ద బాధితుల ఆందోళన

నర్మెట, ఫిబ్రవరి 2: జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మరో వివాదంలో ఇరుక్కున్నారు. దళిత బంధు పథకం ఇప్పిస్తానని ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష చొప్పున రూ.62 లక్షలు వసూలు చేశారని మద్దూరు, దూళ్మిట్ట మండలాలకు చెందిన పలువురు ఆరోపించారు. దళితబంధు రాకపోవడం, అధికారం కోల్పోవడంతో తమ డబ్బు తిరిగి ఇవ్వమని అడుగుతుంటే ముఖం చాటేస్తున్నారని చెబుతున్నారు. తమ సొమ్ము ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బాధితులు ఆందోళనకు దిగారు. జనగామ జిల్లా నర్మెట మండలం హన్మంతాపూర్ శివారులో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి చెందిన ఫామ్‌హౌస్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అయితే, దళిత బంధుకు వసూళ్లు చేశారంటూ తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవాలని మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డే వసూళ్లకు పాల్పడ్డాడని, ఇదే విషయాన్ని గతంలో విలేకరుల సమావేశంలో వెల్లడించానని గుర్తు చేశారు. తనకు ఎంపీ టికెట్ ఇచ్చేందుకు అధిష్ఠానం సుముఖంగా ఉండడంతో తనపై కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని వివరించారు.





# జగనన్నా.. నీకు బాధ్యత లేదా?

**తల్లినీ, చెల్లెళ్లను తిడుతున్నప్పటికీ చేతులు దులుపుకొంటావా?.. షర్మిల వాళ్ల నాన్నకు పుట్టలేదంటూ పోస్టులు పెడుతున్నారు**

- కాలకేయుల్లా సోషల్ మీడియా సైన్యం
- చేసిన వాళ్లకంటే.. చేయించిన వాళ్లే ముఖ్యం..
- వివేకా కుమార్తె డాక్టర్ సునీత ఆవేదన

(కడప - ఆంధ్రజ్యోతి)

వైసీపీ సోషల్ మీడియా 'కాలకేయుల సైన్యం'లా మారిందని వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీతా రెడ్డి ఆగ్రహించారు. చెల్లెళ్లనూ, తల్లినీ నిందించేలా పోస్టులు పెడుతుంటే... ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏం చేస్తున్నారు, ఆయనకు బాధ్యత లేదా అని నిలదీశారు. 'చేస్తున్నది మా వాళ్లు కాదు' అని చేతులు దులుపుకొంటే సరిపోతుందా అని జగన్‌ను ప్రశ్నించారు. సోషల్ మీడియాలో ఇలాంటి ప్రచారాలు చేసే మూర్ఖులకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. చేసే వాళ్లకంటే చేయించే వాళ్ల బాధ్యతే ఎక్కువని... స్పష్టం చేశారు. చివరికి... వైఎస్ షర్మిల పుట్టుకనూ ప్రశ్నించేలా పోస్టింగులు పెట్టడమేమిటని ఆక్రోశించారు. "సోషల్ మీడియాలో తనతో పాటు షర్మిల, విజయలక్ష్మిపై జరుగుతున్న దాడి, దూషణలు, బెదిరింపులపై శుక్రవారం హైదరాబాద్‌లో ఆమె సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే అంశంపై సునీతా రెడ్డి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' చర్చలో పాల్గొన్నారు. సునీతా రెడ్డి ఆవేదన, ఆక్రోశం, ఆగ్రహం... ఆమె మాటల్లోనే!

### ఇంత దారుణమా...

నాపై గతంలోనూ సోషల్ మీడియాలో వేదికగా దాడి జరిగింది. ఇప్పుడు మరింత శ్రుతి మించింది. చంపేస్తాం అని కూడా బెదిరిస్తున్నారు. అన్యాయంపై ఎదిరించి ప్రశ్నిస్తే ఇంత అసభ్యంగా దాడి చేస్తారా? అసలు సోషల్ మీడియాకు బాధ్యత ఉండదా? దీనిని ఎంతమాత్రం సహించకూడదు. మనదాకా వచ్చాక కూడా మౌనంగా ఉండకూడదు. అందుకే... పోలీసులకు ఫిర్యాదు చేశాను.

### జగన్ ఏం చేస్తున్నట్లు?

ఇదంతా ఎవరు చేయిస్తున్నారో నాకు తెలియదు. కానీ... చేస్తున్నది ఎవరో గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. చివరికి... 'షర్మిల వాళ్ల నాన్నకు పుట్టలేదు' అని కూడా పోస్టులు పెట్టారు. ఇది తెలిసి కూడా కుమారుడు (జగన్) ఏం చేస్తున్నారు? ఆయన కూడా ఒక నాయకుడే కదా? ఇదేనా మనం నేర్చుకున్న సంస్కారం! ఒక లీడర్‌గా ఆయన బాధ్యత ఏంటి? మన పిల్లలకు మనం ఏం నేర్పిస్తున్నాం? ఆడవాళ్లను గౌరవించాలి. కనీసం సాటి మనుషులుగా అయినా చూడాలి కదా! షర్మిలకూ, నాకే ఇలా జరుగుతుంటే ఇక ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన వారి పరిస్థితి ఏమిటి?

### పులివెందుల ఎమ్మెల్యే ఎవరు?

(ఫేస్‌బుక్ అకౌంట్‌లో జగన్ భార్య భారతి పీఏ పేరుపైనే షర్మిలను దూషించే పోస్టులు వచ్చాయన్నప్పుడు...)

ఆ ఫేస్‌బుక్‌లో అకౌంట్ పేరున్న వ్యక్తి పులివెందులలో పోలీసులకు ఫిర్యాదు చేశారట! ఆ పోస్టులతో తనకు సంబంధం లేదని చెప్పారట! పులివెందులలో కేసు పెడితే ఏమవుతుంది? పులివెందుల ఎమ్మెల్యే ఎవరు? ఆ ఎమ్మెల్యేకు బాధ్యత ఉండదా? తల్లి, తండ్రి, కొడుకు, బంధుత్వం సంగతి వదిలేయండి! ఒక లీడర్‌గా, ఎమ్మెల్యేగా బాధ్యత ఉంటుంది కదా? మీ వాళ్లా, మా వాళ్లా నాకు అనవసరం. ఒక క్రైం జరిగింది, ఒక తప్పు జరిగింది! అది ఎవరు చేశారో కనుక్కోవాల్సిన బాధ్యత మీకు ఉంది కదా! మన ఇంట్లో వాళ్లకే మనం రక్షణ ఇవ్వలేకపోతే ఇక ప్రజల గురించి ఏం మాట్లాడతాం! ఇంకెక్కడా ఇలాంటి పరిస్థితి లేదు. ఏపీలోనే చూస్తున్నాం!

### షర్మిల కులం అప్పుడు గుర్తులేదా?

(షర్మిల 'రెడ్డి' కాదు, ఆమె కులం వేరు అంటూ పెడుతున్న పోస్టులపై స్పందిస్తూ)

జగన్ జైల్లో ఉన్నప్పుడు షర్మిల పాదయాత్ర చేసింది. ఆమె పేరు, ఎవరిని పెళ్లి చేసుకున్నారో వీళ్లకు తెలియదా? పెళ్లిచేసుకున్నంత మాత్రాన పేరు మార్చుకోవాలా? షర్మిల రాజ్యాంగ పరిధిలో రాజకీయ పోరాటం చేస్తోంది. నేను న్యాయపోరాటం చేస్తున్నా. మా ఇద్దరి పోరాటాలు, లక్ష్యాలు వేర్వేరు. షర్మిల నాకు మద్దతు ఇచ్చింది. ఇపుడు షర్మిల చేస్తున్న పోరాటానికి నేను సంఘీభావం ప్రకటిస్తున్నా.

### నాకు సామర్థ్యం లేదా?

(తమ వెనుక చంద్రబాబు ఉండి కుట్రలు చేయిస్తున్నారంటూ జగన్ రోత పత్రికలో వచ్చిన కథనంపై స్పందిస్తూ)

ఒకరు చెబితే చేస్తున్నానని అనడం ఏమిటి? ఇది నా సామర్థ్యాన్ని, మేధస్సును అవమానించడమే! నా కుటుంబం నా వెనుకే ఉంది. నాకు బయటివారు సపోర్ట్ అవసరం లేదు. అదృష్టమో, దురదృష్టమో... జగన్ నాకు అన్నే! 'జగనన్న' అనే అంటాను. అయితే... తప్పు ఎవరు చేసినా చెప్పాలి. కుటుంబ సభ్యులు చేస్తే ఇంకా కచ్చితంగా చెప్పాలి. ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు, ప్రతి అవ్వకు అంటుంటావే! ఇపుడు ఏమైంది? 'వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనే నేను' అని ఐదేళ్ల కిందట జగన్ సీఎంగా ప్రమాణం చేశారు. కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా న్యాయం చేస్తానన్నారు. ఇప్పుడు... ఈ తప్పు జరుగుతోంది. 'మా వాళ్లు చేయలేదు' అని చేతులు కడిగేసుకుంటే సరిపోతుందా? సాకులు చెప్పడం, ఇతరులపై నెపం నెట్టడం ముఖ్యమంత్రి దగ్గరైనా ఆగిపోవాలి!



### ఫోన్లున్నాయిగా.. ఇడుపులపాయకే పోవాలా?

(ఇటీవల ఇడుపులపాయలో షర్మిలను కలిసి రాజకీయాంశాలపై చర్చించారా... అని అడిగినప్పుడు)

షర్మిలతో రాజకీయాల గురించి మాట్లాడేందుకు ఇడుపులపాయకే వెళ్లాలా? ఫోన్లు లేవా? హైదరాబాద్‌లో కలిసి మాట్లాడుకోలేమా? ఇంకా... నాకు ఇంకెవరో సలహాలు ఇస్తున్నారని, వెనుక ఉండి నడిపిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

పులివెందులలో హత్యా రాజకీయాలు జరగకూడదు. అక్కడి పరిస్థితులు మెరుగుపడాలి. కడప అంటే బాంబులు అనే అభిప్రాయం పోవాలి. అందుకు నేనేం చేయాలో అది చేస్తాను. న్యాయ పోరాటంలో నా త్యాగం వృథా కాదు! సోషల్ మీడియాలో అసభ్యత పోవాలి. ఇలా చేస్తున్న వాళ్లను ప్రజలు తిరస్కరించాలి. తగిన బుద్ధి చెప్పాలి. ఇందుకు... ఎన్నికల రూపంలో ప్రజలకు మంచి అవకాశం వస్తోంది.

## నీకూ.. మీ నాన్న గతే!

(మొదటి పేజీ తరువాయి)

మెదపడంలేదంటే చూస్తుంటే ఇదంతా తల్లీ కూతుళ్లు కలిసి చేస్తున్న కుట్రలాగా కనిపిస్తోంది" అని వర్ర రవీంద్ర రెడ్డి చేసిన పోస్ట్‌తోపాటు తనకు వచ్చిన ఇతర బెదిరింపు, అసభ్య పోస్టులన్నింటి వివరాల్ని సునీతా రెడ్డి సైబర్ క్రైం పోలీస్‌లకు అందించారు. దీనిపై పోలీసులు ఐటీ యాక్ట్‌లోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. విచారణ అనంతరం చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సైబర్ క్రైం డీసీపీ శిల్పవల్లి తెలిపారు.

# ఏపీలో బీజేపీ రాజ్యం

- రాష్ట్రాన్ని మోదీ హీనంగా చూస్తున్నారు: షర్మిల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ప్రజలు ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటు ఇవ్వకపోయినా రాష్ట్రంలో బీజేపీ రాజ్యం చేస్తోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. రాష్ట్రాన్ని ప్రధాని మోదీ హీనంగా చూస్తున్నారని తెలిపారు. 25 మంది ఎంపీలు బీజేపీకి గులాంగిరి చేస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్, చంద్రబాబు బీజేపీకి గులాంగిరీ చేస్తూ ఏపీని మోదీకి బానిసగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, ఏపీలోని వైసీపీ, టీడీపీ ద్రోహం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తూ వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం ఏపీసీసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏపీ భవన్‌లో ధర్నా నిర్వహించారు. ప్రత్యేక హోదా ఐదేళ్లు అయితే సరిపోదని, పదేళ్లు ఇస్తామని తిరుపతి సభలో ఆంధ్రులకు ప్రధాని మోదీ వాగ్దానం చేశారని షర్మిల గుర్తు చేశారు. "పోలవరాన్ని పూర్తి చేస్తామన్నారు. సీమాంధ్రను స్వర్ణాంధ్ర చేస్తామని మోదీ చెప్పారు. విభజన హామీలను నెరవేరుస్తామని, రాజధాని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ, రాజధాని అని చెప్పుకోవడానికి ప్రజలకు ఏమీ లేకుండా పోయింది. విశాఖలో రైల్వే జోన్, కడపలో స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నంలో పోర్టు, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇస్తామని విభజన చట్టంలో చెప్పారు. రాష్ట్రవిభజనకు బీజేపీ మద్దతు పలికింది. రాష్ట్రవిభజన సమయంలో ఏపీకి ఐదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది. కానీ, బీజేపీ తన 2014 మేనిఫెస్టోలో పదేళ్లు ఇస్తామని హామీ ఇచ్చింది. వైజాగ్- చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి చేస్తామని తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది" అని షర్మిల అన్నారు. రాష్ట్రంలో 25 మంది ఎంపీలున్నారని, అందరూ రాజీనామాలు చేసి ఉంటే ఏపీకి ప్రత్యేకహోదా వచ్చేదని వ్యాఖ్యానించారు. "ఏపీలో వైసీపీ, టీడీపీ నేతలు ఒకసారైనా నిజమైన ఉద్యమం చేశారా? ప్రజల కోసం కొట్లాడారా? ఒకసారైనా మోదీని నిలదీసే దమ్ము లేకపోయింది" అంటూ చంద్రబాబు, జగన్ గతంలో హోదా అంశంపై మాట్లాడిన వీడియోలను ప్రదర్శించారు. హోదాపై మాట తప్పితే ఏపీ ప్రజలకు ద్రోహం చేసిన వారు కారా అని ప్రశ్నించారు. ప్రత్యేకహోదా ఏపీకి సంజీవని అని నాడు అన్నారని, హోదా కోసం పెద్ద పెద్ద మీటింగ్‌లు పెట్టి దంచి దంచి చెప్పారని ఎద్దేవా చేశారు. "అమరావతి రైల్వే లైన్‌కు రూ.వెయ్యి కేటాయించారు. ఏపీ ఎంపీలందరూ కలిసి తలా రూ.33 చొప్పున తీసుకువచ్చారు" అని షర్మిల ధ్వజమెత్తారు.

పింఛన్ డబ్బులు ఇవ్వకపోవడమే చేయూతనా? అంటూ మాజీ మంత్రి హరీశ్ నిలదీశారు. ఫిబ్రవరి నడుస్తున్నా ఇప్పటికీ జనవరి పింఛన్ డబ్బులను ఖాతాల్లో ఎందుకు జమ చేయలేదని ప్రశ్నించారు. పింఛన్లు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

## చంద్రబాబు కేసులో తీర్పు మేరకే వీవీపాట్‌లు

- ఎన్నికల్లో పారదర్శకత కోసమే అమలు: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కేసుకు సంబంధించి 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగానే ఓటర్ వెరిఫెయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్స్(వీవీపాట్) ప్రవేశ పెట్టినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వీటివల్ల ఎన్నికల్లో పారదర్శకతకు వీలవుతుందని పేర్కొంది. దేశవ్యాప్తంగా ప్రతి పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొన్ని ఎంపిక చేసిన కేంద్రాల్లో వీటిని ప్రవేశ పెట్టినట్టు వివరించింది. ఈ మేరకు వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు, బీఆర్ఎస్ ఎంపీ మన్నె శ్రీనివాసరెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ శుక్రవారం లోక్‌సభలో వివరణ ఇచ్చారు.

## కాంగ్రెస్ సర్కార్‌కు దినదినగండం: సంజయ్

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దినదిన గండంగా సాగుతోందని ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఎప్పుడు ఏమవుతుందో అర్థంకాని పరిస్థితిలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వాలను కూల్చే చరిత్ర కాంగ్రెస్‌దేనని స్పష్టం చేశారు. అభయ హస్తం మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా గ్రూప్-1 నోటిఫికేషన్ ఏమైందని రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఫిబ్రవరి 1న ఈ నోటిఫికేషన్ ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ డీఎన్ఏలోనే మోసం ఉందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలు రానున్న నేపథ్యంలో గ్రూప్-1, గ్రూప్-2 నియమకాలకు వెంటనే నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# పాకిస్థాన్‌లో అదే కథ

పాకిస్తాన్ రాజకీయంలో ఎప్పుడూ సైన్యమే గెలుస్తుంది. ఆ సంగతి జైల్లో ఉన్న ఇమ్రాన్‌ఖాన్‌కు మరింత తెలుసు. శుక్రవారం ఆయన ట్విట్టర్‌లో ఓ సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. తాను గనుక అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేసి ఉండకపోతే, దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీజోక్యాన్ని నిలువరించే ధైర్యం భవిష్యత్తులో ఏ ప్రధానికీ ఉండేది కాదన్నారు. తనమీద పెట్టిన కేసులు, పడిన శిక్షలు, వెనుక కుట్రల గురించి లోతుగా వివరిస్తూ, ఓటు అనే శక్తిమంతమైన ఆయుధంతో దుష్టశక్తులను తరిమికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చాడు. ఆయన పార్టీ గుర్తు బ్యాట్‌ను ఎన్నికల సంఘం ఇప్పటికే రద్దుచేసింది, పార్టీ అభ్యర్థులంతా ఇండిపెండెంట్లుగానే గెలవాలి. కూరగాయలు, కుర్చీలు, మంచాలు ఇత్యాది గుర్తులతో బరిలో ఉన్నవీరిని ప్రజలు పెద్దపెట్టున గెలిపించడం సాధ్యమేనా?

ఎన్నికలు వారం ఉన్నాయనగా, రెండురోజుల తేడాలో రెండు ప్రధాన కేసుల్లో తీర్పులు ఎందుకంత వేగంగా వెలువడ్డాయో అందరికీ తెలుసు. తాను పదవీచ్యుతుడు కావడం వెనుక అమెరికా కుట్ర ఉన్నదని నిరూపించే ఆధారాలను ఇమ్రాన్ ఓ బహిరంగసభలో ప్రజలకు తెలియచెప్పి, ఆ కాగితాలను ఊపి హీరో అయినమాట నిజం. కానీ, రహస్యపత్రాలను లీక్ చేసిన కేసులో ఇప్పుడు ఆయనకు పదేళ్ళ జైలు శిక్షపడింది. ప్రధానిగా తాను అందుకున్న కానుకలను అమ్మిసొమ్ముచేసుకున్నాడన్న తోషాఖానా కేసులో ఆయనతోపాటు భార్యకు కూడా పద్నాలుగేళ్ళ జైలుశిక్షపడింది. ఈ తీర్పుల్లో వేగం, శిక్షల తీవ్రత చూసినప్పుడు ఇప్పటికే మూడేళ్ళ జైలుశిక్ష అనుభవిస్తున్న ఆయనను ఇప్పట్లో బయటకు రాకుండా చేయడమన్న లక్ష్యం కనిపిస్తూనే ఉంది. పదేళ్ళపాటు ప్రభుత్వ పదవులు అనుభవించడానికి అర్హత కోల్పోయిన ఆయన, రాజకీయంగా తిరిగితేరుకోకుండా తుదముట్టించే కుట్ర ఇది అని ఆయన పార్టీ వాదన. అధికశాతం ప్రజలు ఈ కేసులు అక్రమమైనవేనని నమ్ముతున్నారు. ఇమ్రాన్‌ను రక్షించుకోవాలని వివిధ రంగాల ప్రముఖులు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇమ్రాన్ నీతిపరుడన్న భ్రమలు వీరికి ఉండకపోవచ్చు. కానీ, ప్రధాన రాజకీయపక్షాలను తోలుబొమ్మల్లాగా ముందుపెట్టి సైన్యం వెనుక నుంచి చక్రం తిప్పుతున్న సంగతి ప్రజలకు తెలుసు. దశాబ్దాలుగా సాగుతున్న నాటకమే అయినా, సైన్యంతో ఇమ్రాన్ బహిరంగయుద్ధం చేయడంతో ఇది మరీ స్పష్టంగా తెలిసొచ్చింది. ఆర్మీ, నిఘావ్యవస్థ పెద్దల నియామకం విషయంలో రేగిన ఘర్షణతోనే ఇమ్రాన్ పదవిపోయిన విషయం బహిరంగ రహస్యం. సైన్యంతో పోరాటంలో ఆయన పార్టీ ఓడిపోయింది. వేలాదిమంది కార్యకర్తలు జైళ్ళకు పోయారు, నాయకులు పార్టీ వదిలేశారు, దేశాలు పట్టిపోయారు, కొందరు కనిపించకుండా పోయారు. సైనికస్థావరాలమీద ఇమ్రాన్‌పార్టీ కార్యకర్తలు, అభిమానులు దాడులు చేసి, వాటికి నిప్పుపెట్టిన ఘటనలతో పాటు ఆయన పార్టీ దుంపనాశనం కావడంలో సైన్యం పాత్ర కూడా ప్రజలకు తెలుసు.

చరిత్ర పునరావృతమవుతుంది అన్నమాట పాకిస్థాన్‌కు చక్కగా అతుకుతుంది. అవినీతి ఆరోపణలతో నవాజ్ షరీఫ్‌ను పదవీచ్యుతుడిని చేసి, సైన్యం అండతో అధికారంలోకివచ్చిన ఇమ్రాన్‌ఖాన్ షరీఫ్‌ను వేధించుకుతిన్నారు. చివరకు కొనప్రాణంతో ఉన్న భార్యను కూడా చూడనివ్వకుండా చేశారు. పదేళ్ళజైలుశిక్షపడిన నవాజ్‌షరీఫ్ దేశం విడిచిపోతానన్న ఒప్పందంతో బెయిల్ దక్కించుకొని లండన్‌లో ప్రవాసజీవితం గడిపారు. ఆ తరువాత సైన్యానికి ఇమ్రాన్ మీద విరక్తి కలగడంతో భుట్టోలూ షరీఫ్‌లూ చేయికలిపారు, తమ్ముడు షరీఫ్ ప్రధాని అయ్యాడు, ఆ తరువాత అన్నరాకకు రాజమార్గం ఏర్పడింది. నవాజ్ షరీఫ్ దేశంలో కాలూనగానే ఆయన జైలుశిక్షరద్దయింది, జీవితకాల రాజకీయ నిషేధమూ తొలగిపోయింది. మూడుసార్లు గద్దెదింపిన సైన్యమే ఇప్పుడు ఆయనను ఆలింగనం చేసుకొని, నాలుగోసారి కూచోబెట్టేందుకు శ్రమిస్తోంది.

దశాబ్దాల సైనికరాజకీయంతో విరక్తిచెందిన ప్రజలు ఇమ్రాన్‌కు అండగా నిలుస్తారా, సైన్యంతో పెట్టుకున్న ఈ క్రీడాకారుడిని మోయడంవల్ల ప్రయోజనం లేదని షరీఫ్, భుట్టోల పక్షాన ఉంటారా అన్నది 8వతేదీన తేలుతుంది. స్వతంత్ర అభ్యర్థులుగా ఎంతమంది గెలిచినా, వారు ఒత్తిళ్ళకు, ప్రలోభాలకు లొంగకుండా ఇమ్రాన్‌కు విధేయంగా ఉంటారన్న నమ్మకం లేదు. ఎంత భయంకరమైన శిక్షలు పడినా ఇమ్రాన్ తెరవెనుక ఒప్పందాలు చేసుకోడు అంటూ ఆయన పార్టీ నాయకుడు చేసిన వ్యాఖ్య నవాజ్ షరీఫ్ లాగానే దేశం వదిలిపోవ-

# పరిపూర్ణ వెలుగునిచ్చే జీవితం

**1940,** 50 దశాబ్దాలు ఉత్సాహం, చైతన్యం, కార్యదీక్ష, అంకితభావం, సృజనాత్మకతలతో నిండినవి. ఒకవైపు జాతీయోద్యమ ఉధృతి. మరోవైపు రెండవ ప్రపంచయుద్ధపు సంక్షోభం, సమసమాజపు కలల నందించిన సోవియట్ యూనియన్ ప్రభావం, వీటితో తెలుగు ప్రజలు, ముఖ్యంగా యువతీ యువకులు, విద్యార్థులు ఉద్యమాలలో భాగమైన కాలమది. ఫాసిస్టు వ్యతిరేకత ఆంధ్రదేశంలో ఉధృతంగా ప్రచారమైన రోజులవి. గ్రామగ్రామాన కమ్యూనిస్టు నినాదాలు మారుమోగిన కాలమది. ఆ కాలంలోని చైతన్యాన్నంతా తనలో ఆవహింపజేసుకుని, విద్యార్థినిగా, గాయనిగా, కార్యకర్తగా సాంస్కృతిక దళ సభ్యురాలిగా, నటిగా తనలోని సమస్త శక్తులనూ సమాజానికి అంకితం చేయాలని నిర్ణయించుకున్న ఒకనొక బాలిక నంబూరి పరిపూర్ణ. కుటుంబ నేపథ్యమూ సహకరించింది. అన్నయ్య నంబూరి శ్రీనివాసరావు మాటలు, మార్గదర్శకత్వం వెన్నుతట్టి పిలిచాయి. మద్రాసు, విజయవాడ వంటి నగరాలు, పట్టణాలే కాదు గ్రామాలు కూడా మూడు అడుగుల పరిపూర్ణ, సన్నగా చిన్నగా ఉన్న పరిపూర్ణ, స్టేజీ ఎక్కి తన కంఠంతో, నాట్యంతో, నటనతో ప్రజల మనసులలో అగ్ని పుట్టించేది. నిర్భీతి, సాహసం, నమ్మిన విలువల పట్ల అంకితభావం, ఆత్మగౌరవం, సంగీత సాహిత్యాలతో సున్నితమైన మనసు నిండా సహజ స్వభావసిద్ధమైన భావుకత— వీటితో నంబూరి పరిపూర్ణ ఆనాటి విద్యార్థి, యువజనోద్యమాలలో ప్రకాశించింది.



నంబూరి పరిపూర్ణ
1931–2024

ప్రేమించటమంటే గౌరవించటమని పరిపూర్ణ విశ్వాసం. ప్రతి సంబంధంలోనూ 'రెస్పెక్ట్' ముఖ్యమని ఆమె అనేకసార్లు చెప్పారు. ఇంట్లోనే కాదు ఆమె ఆఫీసుని, తన ఉద్యోగాన్ని నిర్వహించిన తీరు కూడా ఆమె విలువలను ప్రతిబింబిస్తుంది. మామూలుగా స్నేహాలు వ్యక్తుల మధ్య ఏర్పడి అక్కడే ఆగుతాయి. పరిపూర్ణ స్నేహం అక్కడ ఆగదు. ఆమె పిల్లలతో మంచి స్నేహం కలుస్తుంది. అంతటితో కూడా ఆగదు. మనవరాలు, మేనకోడలు... ఇలా ఎందరితోనో అల్లుకుపోగల చనువుని ఇస్తుంది. మూడు తరాలను ప్రభావితం చేసిన పరిపూర్ణ జీవితం ఆమెది.

ఆనాడు, ఈనాడు కూడా ఉద్యమం స్త్రీల సృజనాత్మకతనూ, నాయకత్వ లక్షణాలనూ తనలో ఇముడ్చుకోలేకపోయింది. వివాహం, నాయకుడైన భర్తను ప్రశ్నించక అనుసరించటమే ఉద్యమాలలోని స్త్రీల కర్తవ్యం, గమ్యం అయింది. దాసరి నాగభూషణం గారనే ఒక కమ్యూనిస్టు నాయకుడితో వివాహం పరిపూర్ణ పాలిట వరమా శాపమా అంటే శాపమే. కానీ శాపాన్ని వరంగా మార్చుకోగలిగిన జీవితాన్ని దిద్దుకోగలిగిన తనను తన స్వంత అస్తిత్వంతో ఆవిష్కరించుకోగలిగిన సృజనశీలి పరిపూర్ణ. అగ్రవర్ణానికి, ఆధిపత్య భావజాలానికి ఎదురుతిరిగి నిలబడి బతుకు పోరాటంలో నిలిచి, గెలిచింది. పరిపూర్ణ మానవిగా మార్గదర్శకురాలయింది పరిపూర్ణ.

బీదరికం, ఉద్యమం నుంచి దూరం కావటం, భర్త నుంచి దూరం కావటం, ముగ్గురు పిల్లల పోషణ భారం మీద పడటం ఇవేమీ ఆమెను కుంగదీయలేదు. స్వయం ప్రకాశితగా నిలబెట్టాయి. తనను తాను కాపాడుకుంటూ, ఇతరులకు స్ఫూర్తిగా నిలబడటం ఎలాగో కష్టపడి నేర్చుకుంది. కానీ ఆమె జీవితాన్ని చూసి ఉద్యమ నాయకత్వం ఏమీ నేర్చుకోలేదు. అది చారిత్రక విషాదం. స్త్రీల పట్లా, దళితుల పట్లా, వామపక్ష ఉద్యమాలలో మార్పు రావాల్సిన అవసరాన్ని డా. కొమర్రాజు అచ్చమాంబ నుంచి నంబూరి పరిపూర్ణగారి వరకూ ఎందరో స్త్రీలు ప్రత్యక్షంగా, పరోక్షంగా తమ జీవితాలనే పాఠాలుగా చేసి నేర్పాలని ప్రయత్నించారు. అవి విఫలయత్నాలే అయ్యాయి. కానీ వారి జీవితాలు, జీవిత గమనంలో వారు వేసిన దారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మందికి తమ గమ్యాన్ని చూపించాయి. నడక నేర్పించాయి. అందువల్లే చరిత్రలో నంబూరి పరిపూర్ణ నిలబడిపోతారు. ఆధిపత్య వ్యక్తుల పేర్లు వినపడవు. కాలగమనంలో వారు తిరోగామి శక్తులుగా గుర్తింపబడతారు.

పరిపూర్ణకీ నాకూ 1985 నుంచి స్నేహం. వారింటికి వెడితే, ఇంటిని ఎలా కళాత్మకంగా, పరిశుభ్రంగా, మాననీయంగా, ప్రేమాదరణలతో తీర్చిదిద్దుకోవాలో అర్థమైంది. ఉద్యమ జీవితం నుంచి దూరమైనా ఉద్యమ విలువలనూ, ఉద్యమాలు అసలెందుకు మొదలవుతాయో ఆ ఆదర్శాలనూ, ఆశయాలను జీవితంలో నిలుపుకోవడమెలాగో అర్థమైంది. అసలైన విషయం అది అని తెలిసింది.

పరిపూర్ణ హాయిగా నవ్వటం చూశాను. ఆనందంగా బతకటం చూశాను. కోపంతో, చిరాకుతో, విసుగుతో కూడా ఆమెను చూశాను. కానీ దిగులు, దుఃఖం, కుంగిపోవటం— వీటితో ఆమెను ఎన్నడూ చూడలేదు. నేనే కాదు— నా స్నేహం చాలదు అవి చూసేందుకు. కానీ ఆమె పిల్లలతో సహా, ఆత్మీయ బంధువులతో సహా, ప్రాణ మిత్రులతో సహా ఎవరూ ఆమెనలా చూసి ఉండరని నాకు నమ్మకంగా తెలుసు. ఆమె ఆ విధంగా కూడా నాకు మార్గదర్శకురాలయింది.

1986లో దూరదర్శన్‌కు 'ఇద్దరూ ఒకటే' అనే చిన్న ఫిలింకి స్క్రిప్టు రాశాను. ఆడ, మగ పిల్లలిద్దరినీ వివక్ష చూపకుండా పెంచాలనేది ఆ కథ సారాంశం. అందులో పరిపూర్ణకు కోడలుగా నేను, కొడుకుగా అక్కినేని కుటుంబరావు నటించాం. అప్పుడప్పుడూ నవ్వుతూ నా అత్తగారు మీరు అంటే.. మా అబ్బాయి వీరు అని కుటుంబరావుని అభిమానించేవారు. చిన్నవాళ్లమనే కారణంతో గౌరవం తగ్గించే ప్రసక్తే లేదు ఆమె వద్ద. ప్రేమించటమంటే గౌరవించటమని ఆమె విశ్వాసం. ప్రతి సంబంధంలోనూ 'రెస్పెక్ట్' ముఖ్యమని ఆమె అనేకసార్లు చెప్పారు. ఇంట్లోనే కాదు ఆమె ఆఫీసుని, తన ఉద్యోగాన్ని నిర్వహించిన తీరు కూడా ఆమె విలువలను ప్రతిబింబిస్తుంది. మామూలుగా స్నేహాలు వ్యక్తుల మధ్య ఏర్పడి అక్కడే ఆగుతాయి. పరిపూర్ణ స్నేహం అక్కడ ఆగదు. ఆమె పిల్లలు దాసరి అమరేంద్ర, దాసరి శిరీష, దాసరి శైలేంద్రల వరకూ వెళ్తుంది. వారితో మంచి స్నేహం కలుస్తుంది. అంతటితో కూడా ఆగదు. మనవరాలు తోట అపర్ణ, మేనకోడలు నంబూరి మనోజ్ఞ ఇలా ఎందరితోనో అల్లుకుపోగల చనువుని ఇస్తుంది. మూడు తరాలను ప్రభావితం చేసిన పరిపూర్ణ జీవితం ఆమెది. ఆమె కథలు, నవలలు, వ్యాసాలు రాశారు. తన ఆత్మకథను 'వెలుగుదారులలో..' అనే పేరుతో రాశారు. ఆమె జీవితం గురించి ఎలాంటి దాపరికాలూ లేకుండా రాసిన ఆ పుస్తకం చదివితే ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఉద్యమాలు, రాజకీయాలు, కుల, లింగపరమైన వివక్షలు, వాటికి వ్యతిరేకంగా వ్యక్తులు చేసిన పోరాటాలు, అవి ఉద్యమాలకు ఇచ్చిన స్ఫూర్తి, వ్యక్తిగతం రాజకీయంగా మారే సందర్భాలు, ఇలా ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఆమె చేసింది కేవలం వ్యక్తిగత పోరాటం కాదనీ, రాజకీయమనీ అర్థమైతే ఇప్పటి తరాలకు ఎంతో మేలు జరుగుతుంది.

వెలుగుదారులలో.. పుస్తకం నంబూరి పరిపూర్ణని చిరంజీవిని చేసింది. ఆ పుస్తకం చదివితే ఆమెతో స్నేహం కలుస్తుంది. ఆమె వేసిన దారిలో నడవాలనిపిస్తుంది. జీవితాన్ని సృజనాత్మకంగా జీవించటం కూడా ఒక Intellectual లక్షణమని తెలుస్తుంది. పరిపూర్ణగారూ మీకు వీడ్కోలు లేదు. మీరు ప్రతి తరానికీ వెలుగుచూపే దారులేసి నడిపిస్తూనే ఉంటారు.

■ ఓల్గా

# సర్వత్రా నియమాలు, ఎల్లెడలా ఉల్లంఘనలు!

చట్టబద్ధ పాలన, చట్టంతో పాలన ఒకటి కాదు. రెండింటి మధ్య చాలా వ్యత్యాసమున్నది. చట్టబద్ధ పాలనలో చట్టమే అత్యున్నతమైనది. పాలకులు దానికి కట్టుబడి ఉంటారు. అలా ఉంటేనే వారి పాలన చట్టబద్ధ పాలన అవుతుంది. ప్రజలు కోరుకునే పాలన ఇది. ఇక చట్టంతో పాలనలో పాలకులే సర్వాధికారులు. చట్టం కేవలం వారికి ఒక సేవిక మాత్రమే. మరి సేవకులను ఎవరు ఏ క్షణాన అయినా మార్చుకోవచ్చు అందుకే ఇది ప్రజలు మెచ్చని, కోరుకోని పాలన. మన పూర్వీకులు అంటే చారిత్రక తొలి యుగాల మనుషులు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని సంఘ జీవితాన్ని అభివృద్ధిపరచుకోవడం ప్రారంభమైన నాటి నుంచీ మానవులు తమ సమష్టి జీవనం కొన్ని నిబంధనలకు అనుగుణంగా ఉండి తీరాలన్న వాస్తవాన్ని అంగీకరించారు. నియమ బద్ధంగా వ్యవహరించడం అలవరచుకున్నారు.





ఒక సరళ వ్యవహారాన్ని చాలా సంక్షిప్త రీతిలో వివరించాలనేది రాజకీయాల నియమాలలో ఒకటి. ఈ నియమంపై పూర్తి స్పష్టత కావాలన్నా, ఇతర రాజకీయ నియమాల గురించి మరింతగా తెలుసుకోవాలన్నా మీరు వెళ్లవలసిన, సంప్రదించి తీరాల్సిన మహానుభావుడు నితీశ్ కుమార్!

యుద్ధానికీ నియమాలు ఉన్నాయి. గత శతాబ్దిలో రెండు ప్రపంచ యుద్ధాల అనంతరం జెనీవాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులలో యుద్ధాల నిర్వహణ, యుద్ధ ఖైదీలను చూసుకునే విషయమై కొన్ని ఒప్పందాలను రూపొందించారు. ఆ ఒడంబడికలను ప్రపంచ వ్యాప్తంగా 196 దేశాలు ఆమోదించాయి. ఆ ఒప్పందాలను అంతర్జాతీయ మానవతావాద న్యాయసంహితగా పరిగణిస్తున్నారు. ఏ దేశమూ ఈ న్యాయ నిబంధనలను ఉల్లంఘించకూడదు. అది ప్రపంచ సంకల్పం. దేశాల ఆచరణ గురించి మరి చెప్పనవసరం లేదు.

ఆ ఒప్పంద నియమాలను సంక్షిప్తంగా పేర్కొంటాను: రోగగ్రస్తులు, గాయపడిన వారిని ఆదుకోవాలి, యుద్ధ సమయంలో యుద్ధ ప్రాంతాలలో ఉన్న వైద్య సిబ్బంది, మత సంబంధిత వ్యక్తులకు రక్షణ కల్పించాలి; గాయపడిన సైనికులు, నావికులను అన్ని విధాల ఆదుకోవాలి; యుద్ధ ఖైదీల పట్ల పరిపూర్ణ మానవతా దృక్పథంతో ప్రవర్తించాలి. ఆక్రమిత ప్రాంతాలలో ఉన్న వారితో సహా పౌరులు అందరికీ ఎటువంటి మినహాయింపు లేకుండా సంరక్షణ కల్పించాలి.

అయితే వియత్నాం, ఇరాక్, లిబియా యుద్ధాలలో ఈ నియమాలను నిర్భీకంగా ఉల్లంఘించడం జరిగింది. ఇప్పుడు కొనసాగుతోన్న యుద్ధాల (రష్యా— ఉక్రెయిన్ మధ్య, ఇజ్రాయెల్— హమాస్ మధ్య)లోనూ ఆ నియమాలను ఎవరూ పాటించడం లేదు. అత్యాచారాలు, దోపిడీ యథేచ్ఛగా జరిగిపోతున్నాయి ఉక్రెయిన్ ఆసుపత్రులు, విద్యాలయాలు, పౌర ప్రాంతాలపై రష్యా భీకరంగా క్షిపణి దాడులు చేస్తోంది. గత నెల 24న, 65 మంది ఉక్రేనియన్ యుద్ధ ఖైదీలను తీసుకువెళుతున్న ఒక రవాణా విమానాన్ని కూల్చివేశారు. ఖైదీలతో పాటు విమాన సిబ్బంది తొమ్మిది మంది కూడా ఆ ఘటనలో మరణించారు. ఉక్రెయిన్ ఉగ్రవాద చర్యకు పాల్పడిందని రష్యా ఆరోపించింది. ఆ విమానం కూల్చివేతతో తమకు సంబంధం లేదని ఉక్రెయిన్ ఖండించింది. ఇజ్రాయెల్—హమాస్ యుద్ధానికి వద్దాం. ఈ అమానుష ఘర్షణలను హమాస్ గత అక్టోబర్ 7న ప్రారంభించింది. గాజా నుంచి దక్షిణ ఇజ్రాయెల్‌పై హమాస్ హఠాత్తుగా జరిపిన క్షిపణి దాడుల్లో 1200 మంది మరణించారు. 240 మంది ఇజ్రాయిలీలు ఇప్పటికీ హమాస్ నిర్బంధంలో మగ్గుతున్నారు. ఇజ్రాయెల్ వెన్వెంటనే ప్రతీకార చర్యలకు ఉపక్రమించింది. గత నాలుగు నెలలుగా అవి అమానుషంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇజ్రాయెల్ సైన్యం చాలా కిరాతకంగా వ్యవహరిస్తోంది. గాజా [illegible]ను దిగ్బంధం చేసింది. ఇంతవరకు 25 వేల మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ సైన్యం హతమార్చింది.

అంతర్జాతీయ ఒడంబడికలు నిర్దేశించిన ప్రతి నియమమూ ఈ రెండు యుద్ధాల్లోనూ పూర్తిగా ఉల్లంఘనకు గురవుతోంది. యుద్ధ నియమాలను ఉల్లంఘించిన వ్యక్తులు, దేశాలపై ఐక్యరాజ్యసమితి న్యాయస్థానాలలో విచారణ జరుపుతారు. శిక్ష విధిస్తారు. జెనీవా ఒడంబడికను ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ ఇజ్రాయెల్‌ను దక్షిణాఫ్రికా 'ద హేగ్'లోని అంతర్జాతీయ న్యాయస్థానానికి ఈడ్చింది. ఆ న్యాయస్థానం ఇజ్రాయెల్‌పై అనేక ఆంక్షలు విధించింది. మరి ఆ యూదు దేశం వాటికి కట్టుబడి ఉంటుందా?

ప్రాచీన తమిళ సారస్వతంలోని ఒక ఉజ్వల అధ్యాయమైన సంగం సాహిత్యంలో ఒక పద్యం యుద్ధ నియమాలను వివరించింది: గోవులు, గౌరవప్రద బ్రాహ్మణులు, మహిళలు, రుజాగ్రస్తులు సంతానం లేనివారు తక్షణమే సురక్షిత ప్రదేశాలకు తరలివెళ్లాలి; ఇక్కడ ఒక యుద్ధం ప్రారంభమవనున్నది. ధర్మపథాన్ని నిర్దేశించిన తరువాత రాజు యుద్ధ రంగంలోకి ప్రవేశిస్తాడు'.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

రామాయణ మహాకవి కంబన్ (క్రీ.శ. 1180) రామ రావణ యుద్ధం గురించి చేసిన వర్ణనలో శ్రీరాముడు తన ప్రత్యర్థి రావణుడుతో ఇలా అంటాడు: 'నీవు నీ ఆయుధాలు అన్నిటినీ కోల్పోయి, నిరాయుధంగా నిస్సహాయంగా మిగిలిపోయావు. ఇటువంటి పరిస్థితిలో నేను నీతో పోరాడడం ధర్మం కాదు; ఈ రోజుకు పోరును విరమించి ఇంటికి వెళ్లు, రేపు ఉదయం యుద్ధానికి రా; అప్పుడు నేను నీతో పోరాడుతాను'.

యుద్ధం నుంచి ప్రేమకు వెళదాం. ప్రేమ గురించి, ప్రేమ నియమాల పైన సంఖ్యానేక పుస్తకాలు ఉన్నాయి. ఎన్ని ప్రేమ నియమాలు ఉన్నాయో అన్ని పుస్తకాలు ఉన్నాయి. ప్రేమికుల సంఖ్య మాత్రం తక్కువగా ఉంటుందా? ప్రేమ నియమాలు అనేది అనేక పుస్తకాల శీర్షిక. ప్రేమ నియమాలు అనే సాదా సీదా శీర్షిక నుంచి 8 రూల్స్ ఆఫ్ లవ్ నుంచి 40 రూల్స్ ఆఫ్ లవ్ .... ఇలా ఆకర్షణీయమైన శీర్షికలతో ఎన్నో పుస్తకాలు ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కదాన్నీ నేను చదవలేదుగానీ వాటికి అసంఖ్యాక పాఠకులు ఉన్నారని కచ్చితంగా చెప్పగలను.

నా గమనంలోకి వచ్చిన కొన్ని ఆలోచనాత్మకమైన ప్రేమ నియమాల గురించి ప్రస్తావిస్తాను: 'నీ ప్రేమకు విలువ ఇవ్వని వ్యక్తి పట్ల నీ ప్రేమను వృథా చేసుకోవద్దు' అని 'షేక్‌స్పియర్ మహాకవి అన్నారు. 'సదా ప్రేమలో ఉండాలి. అసలు ఎప్పటికీ వివాహం చేసుకోకపోవడానికి అదే కారణం' అని ఆస్కార్ వైల్డ్ అంటాడు. 'ఎవరైనా ఒకరు తన ప్రేమను తెలియజేయడానికి చేసిన పనులు, సాహసాల గురించి చదివిన తరువాత ఏమి చదవాలి? హత్యోదంతాల కాలమ్' అని బెర్నార్డ్ షా అంటాడు. 'ఒకసారి ప్రేమలో పడ్డ తరువాత మళ్లీ లేవడం అసాధ్యం' అని మహా వైజ్ఞానికుడు ఐన్‌స్టీన్ చమత్కరించారు. ప్రేమకు హాస్యయుతమైన భాష్యాలు చెప్పే ఉద్దేశంతో ఆ మహా మహులు ఆ వ్యాఖ్యలు చేసి ఉండకపోవచ్చు గానీ వాటిలో ప్రేమ నియమాలు మనకు స్పష్టమవుతాయి. పురాతన, మహోన్నత తమిళ తాత్త్విక —కావ్యం 'తిరుక్కురల్' (క్రీ.శ.500)లో ప్రేమపై 25 అధ్యాయాలు, 250 ద్విపదలు ఉన్నాయి. 'ప్రేమికుల మధ్య కళ్లు, కళ్లు కలిసినప్పుడు మాటల అవసరం లేదు' అని 'తిరుక్కురల్ స్రష్ట అంటాడు. ఒక ప్రేమ నియమాన్ని ఆయన అలా చక్కగా చెప్పాడు. ఇక రాజకీయాల నిబంధనలు చూద్దాం.

రాజకీయ వ్యవహారాల విషయంలో రాజకీయ నియమాలతో రాజకీయాలపై చట్టాన్ని ముడిపెట్టకూడదు. అలా చేయడం గందరగోళపడడమే అవుతుంది. చట్టం ఒక విషయం, అయితే నియమాలు — ఆట ఆడే తీరు తెన్నులు— మరొక విషయం. నిజానికి కొన్ని ఆటలను నిర్దేశిత నియమాలను అధిగమించే లక్ష్యంతో అప్రకటిత నిబంధనలతో ఆడడం జరుగుతుంది. ఉదాహరణకు పార్టీ ఫిరాయింపులను నిరోధించేందుకు ఉద్దేశించిన చట్టాన్నే తీసుకోండి. ఆ చట్టం అమలవుతున్న వైనాన్ని గమనిస్తే అది పార్టీ ఫిరాయింపులను మరింతగా ప్రోత్సహిస్తుందని అర్థమవుతుంది. రాజకీయాల నిబంధనల కింద అంపైర్ సైతం ఒక పక్షాన ఆడవచ్చు. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. పార్టీ ఫిరాయింపుల క్రీడలో స్పీకర్లే ఆటగాళ్లయిన ఉదంతాలు చాలా ఉన్నాయి. పైగా ఒక సరళ వ్యవహారాన్ని చాలా సంక్షిప్త రీతిలో వివరించాలనేది రాజకీయాల నియమాలలో ఒకటి. ఈ నియమంపై పూర్తి స్పష్టత కావాలంటే, రాజకీయాల ఇతర రాజకీయ నియమాల గురించి మరింతగా తెలుసుకోవాలన్నా మీరు వెళ్లవలసిన, సంప్రదించి తీరాల్సిన మహానుభావుడు నితీశ్ కుమార్ అనడంలో నాకే కాదు, ఎవరికీ సందేహం లేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

# సేవ్ ఎడ్యుకేషన్–సేవ్ ఇండియా

స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎసఎఫఐ)తో సహా పదహారు విద్యార్థి సంఘాలు ఇటీవల 'యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా' పేరుతో ఒక వేదికగా ఏర్పడినాయి. విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణను ఎదుర్కోవడమే ఈ విద్యార్థి సంఘాల లక్ష్యం. గత పదేళ్ల మోదీ పాలనలో ప్రభుత్వ విద్య పతన స్థితికి చేరింది. సైంటిఫిక్ టెంపర్ దెబ్బతిన్నది. తరగతి గది గోడల మధ్య దేశ భవిష్యత్తు నిర్మితమవుతుందని విద్యావేత్తలు చెబుతారు. మోదీ పాలనలో అదే నాలుగు గోడల మధ్య విద్యార్థులను మతాల పేరుతో విభజించారు. అందుకే జనవరి 10న ఈ ఐక్య వేదిక 'సేవ్ ఎడ్యుకేషన్, నూతన జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరించండి, సేవ్ ఇండియా, బీజేపీని వ్యతిరేకించండి' నినాదాలతో పార్లమెంట్ మార్చ్ నిర్వహించింది. పోలీసు నిర్బంధంతో కొన్ని ఆటంకాలు ఎదురైనా అది జయప్రదం అయ్యింది. 'యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా' ప్రధానంగా జాతీయ విద్యావిధానం 2020ని వ్యతిరేకిస్తుంది. ఈ విధానం సామాజిక న్యాయాన్ని విస్మరించింది. ఇది విద్యార్థులను పెద్ద పెద్ద కంపెనీలలో గుమస్తాలుగా తయారు చేసేందుకు నిర్దేశించింది. ఎన్ఆర్ఎఫ్ పేరుతో పరిశోధనలను నియంత్రిస్తున్నది. రిజర్వేషన్ల ప్రస్తావన ఎక్కడా చేయదు. కులవృత్తులను పెంచి పోషించి మనువాద ఎజెండాను అమలుపరచడమే కాదు, ఫెడరల్ వ్యవస్థను కూడా బలహీనపరుస్తున్నది. అందుకే బీజేపీయేతర రాష్ట్రాలు ఈ విద్యా విధానం అమలును వ్యతిరేకిస్తున్నాయి.

మోదీ పాలనలో ప్రభుత్వ విద్య పతనమైంది. గాంధీని పాఠ్యపుస్తకాల నుంచి తొలగించి, సావర్కర్‌ను జాతీయ హీరోగా కీర్తించారు. పాఠ్యపుస్తకాలలో శాస్త్రీయ భావజాలాలను తుడిచిపెట్టి జ్యోతిష్యం, భూతవైద్యాన్ని కోర్సులుగా పెడుతున్నారు. సంఘ్ పరివార్ మిత్రులను వైస్ ఛాన్సలర్లుగా నియమిస్తున్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు బడ్జెట్ కేటాయింపులు నిలిపివేస్తున్నారు. జాతీయ స్థాయి ఫెలోషిప్‌లను పూర్తిగా కుదించారు. వచ్చే అతికొద్ది ఫెలోషిప్‌లలో కూడా వాళ్ళకు అనుకూలమైన వారినే ఎంపిక చేస్తున్నారు. దీంతో పేద వర్గాలు పరిశోధన నుంచి దూరమవుతున్నాయి. ఉన్నత విద్యలో అణచివేతలు ప్రబలంగా ఉన్నాయి. వీటితోపాటు విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య పెరిగింది. 'మన్ కీ బాత్'లో గొప్పగా మాట్లాడే మోదీ ఉన్నత విద్యలో విద్యార్థుల ఆత్మహత్యలపై మౌనంగా ఉంటున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో భారతదేశ భవిష్యత్తు ప్రమాదంలో పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంది. విభజన రాజకీయాలను ప్రతిఘటించడం మన ప్రధాన కర్తవ్యం. ఆరెస్సెస్, బీజేపీల మనువాదపు ఆలోచనలను విద్యార్థిలోకం సంఘటితంగా ఎదుర్కోవాలి. 'యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా' తరఫున విద్యార్థులను సమీకృతం చేస్తూ, 'సేవ్ ఎడ్యుకేషన్, రిజెక్ట్ ఎన్ఇపి, సేవ్ ఇండియా, రిజెక్ట్ బీజేపీ' ప్రధాన లక్ష్యాలుగా ఐక్య ఉద్యమంతో ముందుకు సాగుదాం.

— **ఆర్.ఎల్. మూర్తి,** ఓయూ రీసెర్చ్ స్కాలర్

# కొత్త ప్రభుత్వమైనా ఉపకారవేతనాలు ఇస్తుందా?

నీళ్లు నిధులు నియామకాల కోసం దాదాపు 1200 మంది ప్రాణత్యాగాలు చేసి కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో రెండు పర్యాయాలు పాలించిన గత ప్రభుత్వం విద్యార్థులను, విద్యావ్యవస్థను పట్టించుకున్న పాపాన పోలేదు. దాదాపుగా 5,300 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాక పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు సొంతంగా ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది.

ఇంటర్ నుంచి ఇంజనీరింగ్, పీజీ, పీహెచ్‌డీ వరకు గత ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కళాశాలలకు వెడితే ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని కాలేజీ యజమాన్యాలు తేల్చి చెబుతున్నాయి. ప్రభుత్వం బకాయిలు చెల్లించిన తర్వాత విద్యార్థులు చెల్లించిన డబ్బులను తిరిగి ఇస్తామని హామీ ఇస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ ఫీజులు చెల్లించవలసిన పరిస్థితి ఏర్పడింది. 2020—21 విద్యా సంవత్సరానికి గాను దాదాపు రూ.3,350 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయి. అలాగే 2021—22కు సంబంధించి ఇంతవరకు కూడా బకాయిలు విడుదల చేయలేదు. 2022—23 విద్యా సంవత్సరానికి రూ.5,300 కోట్లు విడుదల కావలసి ఉంది. ప్రతీ సంవత్సరం దాదాపు 6.20 లక్షల మంది కొత్తగా ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. దాదాపు 8.10 లక్షల మంది రెన్యువల్ చేసుకుంటారు. సంవత్సరానికి రూ. మూడువేల కోట్లను రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంటుంది. నూతన కాంగ్రెస్ ప్రభుత్వమయినా వెంటనే బకాయిలు చెల్లించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలి.

— **సిలివేరు అశోక్**
ఏబీవీపీ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు

# లౌకికత్వమా, హిందుత్వమా... ఏది దారి?

రామ మందిర ప్రారంభోత్సవ సంరంభం ముగిసింది. త్రేతాయుగం మరోసారి ప్రారంభమైంది. సాక్షాత్తు విష్ణుమూర్తి కలియుగ అవతారంగా భక్తుల కీర్తి గానాల మధ్య నరేంద్ర మోదీ చేతుల మీదుగా రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠాపన జరిగింది. ఆయనే అభివర్ణించినట్టు ఇదొక సరికొత్త కాలచక్రానికి శుభారంభం. ఇక అంతా రామమయం అని అశేష హిందూ భారతం తన్మయంతో ఊగిపోయింది. అయ్యో ఇదేమి రాజకీయం అని కొందరు అవాక్కయ్యారు. మతం రాజకీయంగా, రాజకీయం మతంగా మారడం ఇప్పుడే ఏదో కొత్తగా చూస్తున్నట్టు గుండెలు బాదుకున్నారు. ఇప్పుడే కాదు ఎన్నో యుగాలుగా, ఇక్కడే కాదు ప్రపంచమంతా అప్రతిహతంగా కొనసాగుతున్న అనంత ధార్మిక మార్మిక తతంగమే కదా ఇదంతా. తరతరాల మత రాజకీయాల కొనసాగింపే ఈ రామ మందిర వివాదం.

1984 ముందు బీజేపీ, ఆరఎసఎస్, విశ్వహిందూ పరిషత్ లాంటి సంస్థల ఎజెండాలో రామ మందిరం లేనే లేదు. రెండు సీట్ల నుండి 300 సీట్ల దాకా బీజేపీ ఎదిగిన ప్రస్థానంలో రామ మందిర పాత్ర మనకు తెలిసిందే. ఇక్కడ నుంచి 400 సీట్ల దాకా పరిక్రమిస్తామని రామమందిర ప్రారంభోత్సవం నాడే మోదీ భక్తులు అత్యుత్సాహంగా చేసిన ప్రకటన కూడా ఈ వెలుగులోనే అర్థం చేసుకోవాలి. బీజేపీ వారి మాటల్లో చేతల్లో ఎలాంటి దాపరికమూ లేదు. "భారతదేశానికి రాముడే చేతన, రాముడే చింతన, రాముడే ఆస్థా, రాముడే ఆధారం, రాముడే సత్యం రాముడే నిత్యం" ఇత్యాది అత్యద్భుత భవ్య దివ్య పదజాలంతో మోదీ చేసిన ప్రసంగం దేశమంతా మారుమోగుతూనే ఉంది. బీజేపీ వారి ఉద్దేశం సుస్పష్టం. ఇందులో వారిని తప్పుపట్టే పనే లేదు. మరో వెయ్యేళ్లు ఇక్కడ అప్రతిహతంగా రాజ్యాధికారాన్ని చెలాయించాలంటే రాముడే ఆధారం అని వారికి అర్థమైంది. రానున్న ఎన్నికల పరమావధిగా ఈ రామ మందిర ఉద్ఘాటన మహోత్సవం సాగినట్టు అర్థమవుతూనే ఉంది.

మరి ప్రతిపక్షాలు ఏం చేయాలి? బీజేపీ వారు రాముని అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తున్నారని చెబుతూనే, ప్రతిపక్షాలు కూడా మరో రకంగా మరో రూపంలో అదే పని చేయడం ద్వారా ఈ దేశానికి వారు ఎలాంటి సందేశాలు ఇస్తున్నారు అన్నదే ఇక్కడ చర్చనీయాంశం. ఢిల్లీ ప్రధాని ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ ఢిల్లీలో ప్రతి నియోజక వర్గంలోనూ ప్రతి నెలా మొదటి మంగళవారం రామాయణ సుందరకాండ పఠనాన్ని, హనుమాన్ చాలీసా పఠనాన్ని ప్రారంభించారట. అలాగే ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ 100కోట్ల రూపాయలకు పైగా ఖర్చుతో జగన్నాథ కల్చరల్ హెరిటేజ్ కారిడార్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఇటీవలనే ముగిసిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ ఛత్తీస్‌గఢ్‌లో రామాయణ కల్చరల్ హెరిటేజ్ ఏర్పాటుకు వాగ్దానం చేశారు. మధ్యప్రదేశ్‌లో కమల్ నాథ్ ఆకాశమంత హనుమాన్ విగ్రహాన్ని, ఊరంత సీతా మందిరాన్ని ప్రజలకు వాగ్దానం చేశారు. ఇలా ప్రతిపక్షాలవారు కూడా తామూ హిందూ భక్తులమేనని నిరూపించుకోవడానికి తంటాలు పడుతున్నారు. వారు తమ మత విశ్వాసాలను ప్రకటించడానికి హక్కు ఉంది. కానీ టైమింగ్ ఎలాంటిది? అది కదా ముఖ్యం. దేశంలో ఒకపక్క రాజ్యాంగ మౌలిక సూత్రాలలో అతి ప్రధానమైన లౌకిక స్వప్నానికి భంగం వాటిల్లే మత రాజకీయ ప్రయత్నాలు బాహాటంగా కొనసాగుతున్న వేళ, దేశ ప్రయోజనాలు కాపాడడానికి నడుం కట్టుకున్నామన్న వారు ఏం చేయాలో, ఎలాంటి కార్యక్రమాన్ని తీసుకోవాలో అర్థం కాని అయోమయంలో పడిపోవడం ప్రజాస్వామిక వాదులకు పరమ విషాదం. హిందుత్వాన్ని హిందుత్వంతో జయించగలరా? మత రాజకీయాలను మత రాజకీయాలతో ఓడించగలరా? మోదీ దారిలోనే ప్రతిపక్షాలు కూడా నడిస్తే ప్రజలకు మోదీనే మెరుగైన ప్రత్యామ్నాయంగా కనిపిస్తే అది వారి తప్పేముంది?

బహుశా ఈ విషయాన్ని ప్రతిపక్ష పార్టీలన్నింటికంటే రాహుల్ గాంధీ బాగా అర్థం చేసుకున్నట్టు ఉన్నారు. ఎన్నికలు ఇంకా రెండు మూడు నెలల్లో ఉండగా ప్రతిపక్షాల ఐక్యతకు, ఉమ్మడి కార్యక్రమాల పోరాటాల రూపకల్పనకు సమయం కేటాయించాల్సిన కాంగ్రెస్ పార్టీ కీలక నేత, ఇలా దేశ యాత్రలు చేయడం ఏంటని కొన్ని విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో, రాహుల్ గాంధీ మరోసారి మరో నినాదంతో భారత్ జోడో న్యాయ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా యాత్రకు ముందు ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు మాత్రమే తన ఎజెండా కాదని, ఈ దేశంలో కేవలం ఎన్నికల రాజకీయాలతో బీజేపీని ఓడించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. తన పోరాటం పొలిటికల్, ఐడియలాజికల్ పోరాటమని, ఇది ఈ దేశంలో సమాంతరంగా సాగినప్పుడే ఎప్పటికైనా లౌకిక శక్తుల విజయం సాధ్యమవుతుందని రాహుల్ అభిప్రాయం. ఈ దేశంలో తరతరాలుగా సాగిన, ఇప్పుడు సాగించాల్సిన సాంస్కృతిక పోరాటం పట్ల ఆయన పరోక్షంగా తన అభిప్రాయాలు చెప్పడం ప్రతిపక్షాలకు ఒక గొప్ప మార్గ నిర్దేశం. కేవలం ప్రతిపక్షాలకే కాదు ఈ దేశంలో ఉన్న సమస్త లౌకిక ప్రజాతంత్ర శక్తులందరికీ ఇది ఒక గొప్ప సందేశమే.

ఇప్పటికైనా ప్రతిపక్షాలు బీజేపీ పన్నిన మతరాజకీయ వ్యూహంలో చిక్కుకుపోకుండా, తమ హిందూ భక్తి విశ్వాసాలను కాపాడుకుంటూనే, దేశమంతా ఒక లౌకిక ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం కోసం నడుం కట్టాలి. ఈ యుద్ధానికి, యుద్ధంలో విజయానికి ఎన్నేళ్ళు పట్టినా అనివార్యంగా ప్రతిపక్షాలు నడవాల్సిన దారి ఇదే.





జనవరి 22న అయోధ్యలో వన్ మ్యాన్ షో కొనసాగుతున్న సమయంలో మమతా బెనర్జీ బెంగాల్లో సర్వధర్మ సామూహిక ప్రార్థనలు కొనసాగించడంతో రాహుల్ గాంధీ అభిప్రాయాలకు కొంతైనా అర్థం పట్టినట్టు అయింది. ఇప్పటికైనా ప్రతిపక్షాలు బీజేపీ పన్నిన మతరాజకీయ వ్యూహంలో చిక్కుకుపోకుండా, తమ హిందూ భక్తి విశ్వాసాలను కాపాడుకుంటూనే, దేశమంతా ఒక లౌకిక ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం కోసం నడుం కట్టాలి. ఈ యుద్ధానికి, యుద్ధంలో విజయానికి ఎన్నేళ్ళు పట్టినా అనివార్యంగా ప్రతిపక్షాలు నడవాల్సిన దారి ఇదే.

దీనికి ఎన్నో త్యాగాలు కావాలి. సీట్ల సర్దుబాట్లకే సిగపట్లు పట్టే ఈ విపక్షాల వీరులు వందల ఏళ్ళు పోరాటం చేయాలంటే ఆ సత్యాన్ని జీర్ణించుకోగలరా? ఏది ఏమైనా యుద్ధాలు రక్తపాతాలు కుట్రలు కుతంత్రాలు కేంద్రంగా విస్తరించే రాజ్యాన్ని కూడా తన బోధనలతో బౌద్ధం ఎలా శాంతి మార్గం పట్టించిందో ఆ చరిత్ర గుర్తెరగాలి. మతాధార రాజ్యాన్ని సర్వజాతుల సర్వ వర్ణాల సామరస్యం వైపు మళ్లించడంలో బౌద్ధం సాధించిన విజయాలను తెలుసుకోవాలి. తర్వాత తర్వాత ఏ కుట్రలతో, తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఏ వర్గాలు బౌద్ధ భిక్షువుల్ని వేలాదిగా వధించి వారిని నెత్తుటి సముద్రాల్లో కలిపేశారో ఆ సత్యాన్ని అధ్యయనం చేయాలి. కులం పునాదుల మీద ఒక జాతిని, ఒక నీతిని నిర్మించలేరని బాబాసాహెబ్ అన్నమాట ఇప్పుడు కొంచెం మార్చుకోవాలి. వాస్తవానికి దీన్ని మతం పునాదుల మీద అని ఇప్పుడు చదువుకోవాలి. రానున్న ఇంత భయానక ప్రమాదాన్ని ఆయన ఆనాడే గుర్తించాడు. కనుక ఇక మనకు మరో ప్రత్యామ్నాయం లేదని బుద్ధం శరణం గచ్ఛామి అన్నాడు. ఇంత మహత్తర మార్గాన్ని ఆయన ఎందుకు ఎంచుకున్నాడో, ఈ దేశానికి ఆ మార్గమే శరణ్యమని ఆయన ఎందుకు చెప్పాడో కనీసం ఆయన అనుయాయులైనా అర్థం చేసుకున్నారో లేదో తెలియదు. అర్థం చేసుకున్నవారు ఆ మార్గంలో పయనించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మందిరాలు కూల్చి మసీదులు కట్టారని చేస్తున్న వాదనతో పాటు, బౌద్ధ ఆరామాలను ధ్వంసం చేసి ఆ శిథిలాల మీద హిందూ దేవాలయాలు నిర్మించారన్న వాదన కూడా ఉంది. అందుకే గుడులు తవ్వుకుంటూ వెళ్లడం కాదు, సత్యం కోసం మనల్ని మనం తవ్వుకుంటూ ముందుకు వెళ్లాలి. బౌద్ధ ధర్మమే ఈ దేశానికి అసలు సిసలు సాంస్కృతిక ప్రత్యామ్నాయ ధర్మం. బౌద్ధ తత్వమే అసలైన లౌకికత్వం. బౌద్ధం ఒక అత్యుత్తమ మానవ జీవనశైలి. దైవం చుట్టూ జరిగే మాయామర్మాలు ఇందులో లేవు కనుక దాన్ని మతంగా స్వీకరించినా తప్పు లేదు. కమ్యూనిజం చెప్పే భౌతికత, బుద్ధిజం చెప్పే నైతికతల విలువైన మానవీయ మేళవింపే లౌకికత. కమ్యూనిస్టులు, నాస్తిక హేతువాద విప్లవ సంఘాలవారు ఎవరైనా బౌద్ధాన్ని ఒక జీవన మార్గంగా మలచుకోవచ్చు. లౌకికత్వం ఒక పదం కాదు, అనేక యుగాలుగా అనేక త్యాగాలతో మన పెద్దలు నిర్మించిన పథం ఇది. ఇదే ఈ దేశానికి ఇప్పటికీ ఎప్పటికీ ఏకైక దారి దీపం.

• డా. ప్రసాదమూర్తి
కవి, జర్నలిస్టు



వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట విద్యార్థులతో కలిసి బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు

# జీవో 55 రద్దు కోరుతూ వ్యవసాయ వర్సిటీ బంద్

- ఆకస్మికంగా పిలుపునిచ్చిన విద్యార్థులు
- సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్
- కళాశాల గేటుకు తాళం
- అధ్యాపకులు, ఉద్యోగులను అడ్డుకున్న విద్యార్థులు
- కొద్దిసేపు ఫైనల్ ఇయర్ పరీక్షల అడ్డగింత

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆకస్మిక బంద్‌కు విద్యార్థులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయమే వ్యవసాయ కళాశాల గేటుకు తాళం వేసి అధ్యాపకులను, ఉద్యోగులను లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ద్వితీయ సంవత్సర ఫైనల్ ఇయర్ పరీక్షలను కొద్దిసేపు అడ్డుకున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన జీవవైవిధ్యం కలిగిన 100 ఎకరాలను హైకోర్టు నిర్మాణానికి కేటాయించొద్దని, జీవోనెంబర్ 55ను రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వర్సిటీలోని భూములను హైకోర్టుకు కేటాయించొద్దని డిమాండ్ చేస్తూ 25రోజులుగా విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారు. అయితే, శుక్రవారం

మిగతా 8వ పేజీలో..



## సందడే.. సందడి

నిఫ్ట్ వార్షిక వేడుక స్పెక్ట్రమ్‌లో విద్యార్థులు తమ క్రియేటివిటీతో అదరగొట్టారు. ట్రెజర్ హంట్, ఫేస్‌పెయింటింగ్, కల్చరల్ ప్రోగ్రామ్స్‌తో సందడిచేశారు. బాటిల్ ఆఫ్ రాక్ బ్యాండ్స్, డ్యాన్స్ పోటీలు వారిలో నూతనోత్సాహం తీసుకొచ్చాయి. శుక్రవారం మాదాపూర్‌లో జరిగిన కార్యక్రమం కోలాహలంగా సాగింది.

- హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) :

## ఛ్.. వాళ్లు కేటుగాళ్లా..?

- ఏసీబీ పేరు చెబితే.. డబ్బులిచ్చేసిన కొందరు అధికారులు
- అవి ఫేక్ కాల్స్ అని తెలుసుకుని నిట్టూర్పు

8

## మురుగు పరుగులు

- నిర్వహణ నిలిచిపోవడంతో సమస్యలు తాండవం
- అసోసియేషన్‌తో చర్చలు జరపని వాటర్‌బోర్డు
- ఇలా కొనసాగితే రోడ్లు, వీధులు మరింత అధ్వానం

8

# లే అవుట్ల ఖాళీ స్థలాలు మాయం

## గ్రేటర్‌లో యథేచ్ఛగా కబ్జాలు

- రూ.కోట్లాది విలువైన స్థలాలు అన్యాక్రాంతం
- పరిరక్షణలో అధికారుల ఉదాసీనత
- అప్రమత్తం చేసినా అదే నిర్లక్ష్యం
- అధికారిక లెక్కల ప్రకారం 3,300లకు పైగా ఓపెన్ స్పేస్‌లు
- క్షేత్రస్థాయిలో ఎన్ని ఉన్నాయో స్పష్టత కరువు

చదరపు గజం లక్షల్లో పలుకుతున్న మహానగరంలో సొంత స్థలాలను కాపాడుకోవడంలో జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. కోట్లాది రూపాయల విలువైన ఓపెన్ స్పేస్‌లు అధికారుల ఉదాసీనతతో పరాధీనమవుతున్నాయి. స్థానికులు ఫిర్యాదు చేసినా.. ఇతర ప్రభుత్వ విభాగాలు అప్రమత్తం చేసినా బల్దియా మొద్దునిద్ర వీడడం లేదు. అసలు సంస్థకు చెందిన ఓపెన్ స్పేస్‌లు ఎన్ని ఉన్నాయి..? అవి ఏయే ప్రాంతాల్లో ఉన్నాయి..? వాటి విస్తీర్ణం ఎంత.. తదితర వివరాలు బల్దియా వద్ద లేవు. వాస్తవంగా అందుబాటులో ఉన్నవెన్ని? కబ్జా అయినవెన్ని..? అన్నదీ జీహెచ్ఎంసీ వర్గాలు కచ్చితంగా చెప్పలేకపోతున్నాయి.



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో ఖాళీ జాగా కనిపిస్తే పాగా వేసే ఆక్రమణదారులు ప్రభుత్వ ఖాళీ స్థలాలపై గద్దల్లా వాలుతున్నారు. ఇప్పటికే వందలాది ప్రాంతాల్లోని ఓపెన్ స్పేస్‌లు కనుమరుగు కాగా.. ఇప్పటికీ అదే తంతు కొనసాగుతోంది. అయినా సంబంధిత జీహెచ్ఎంసీ అలవాటైన అలసత్వం చూపుతోంది.

జీహెచ్ఎంసీ అనుమతి ఇచ్చే లే అవుట్లలో పార్కులు, కమ్యూనిటీ అవసరాల కోసం నిర్దిష్ట విస్తీర్ణంలో స్థలాన్ని ఓపెన్ స్పేస్‌గా వదులుతుంటారు. దీనిని డెవలపర్లు బల్దియా పేరిట రిజిస్ట్రేషన్ చేస్తారు. అయితే, అధికారుల నిర్లక్ష్యంతో ఒక్కొక్కటిగా జీహెచ్ఎంసీకి చెందిన ఖాళీ స్థలాలు కనుమరుగవుతున్నాయి. చాలా లే అవుట్లలో ఓపెన్ స్పేస్‌లను డెవలపర్లు, కొందరు కాలనీ పెద్దలు ప్లాట్లుగా విభజించారు. వీటిని కొందరు విక్రయిస్తే.. ఇంకొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. నకిలీ లే అవుట్ మ్యాప్ సృష్టించి.. ఓపెన్ స్పేస్‌ను ప్లాట్లుగా చూపుతూ అక్రమాలు కొనసాగించారు. ఈ క్రమంలోనే నగరంలోని చాలా ప్రాంతాల్లో పార్కులు, కమ్యూనిటీ హాళ్లు మాయమయ్యాయి. కొన్నిచోట్ల ఉన్నా.. ఆక్రమణ పోను మిగిలిన స్థలాల్లో నిర్మించినవే.

### ఆక్రమణదారులకు అధికారుల అండ

నగరంలో భూముల ధరలు భారీగా పెరగడంతో దశాబ్దాల క్రితం నుంచే

మిగతా 6వ పేజీలో..

| 2016లో సర్వే ప్రకారం... | |
|---|---|
| మొత్తం ఓపెన్ స్పేస్‌లు | 3356 |
| కాంపౌండ్ వాల్ ఉన్నవి | 2906 |
| నిర్మించాల్సినవి | 447 |

### పూర్తికాని డిజిటలైజేషన్

ఓపెన్ స్పేస్‌ల వివరాలు డిజిటలైజ్ చేయాలని గతంలో నిర్ణయించినా.. పాత రికార్డులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ప్రక్రియను పాక్షికంగానే పూర్తి చేశారు. ఓపెన్ స్పేస్‌లతో తమకు సంబంధం లేదని ఎస్టేట్ విభాగం అధికారులు చెబుతుంటే.. ఎనిమిదేళ్ల క్రితం చేసిన సర్వే వివరాలు తప్ప.. మా వద్ద ఎలాంటి సమాచారం లేదని పట్టణ ప్రణాళికా విభాగం వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో కాగితాల్లో ఉన్న మేర అయినా క్షేత్రస్థాయిలో ఖాళీ స్థలాలున్నాయా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

## నావికాదళ రాడార్ స్టేషన్‌తో జీవ వైవిధ్యానికి ముప్పు

- పర్యావరణ వేత్తల ఆందోళన

పంజాగుట్ట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దామగుండంలో నావికా దళ రాడార్ స్టేషన్ ఏర్పాటు చేస్తే జీవ వైవిధ్యం దెబ్బతింటుందని, ఐదు నదులపై ప్రభావం చూపుతుందని పర్యావరణవేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. సముద్ర తీరంలో ఏర్పాటు చేయాల్సిన రాడార్ కేంద్రాన్ని దూరంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రం ఏర్పాటుకు 12 రాష్ట్రాలు ముందుకొచ్చాయంటూ రాజకీయ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని వారు ఆరోపించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, పబ్లిక్ పాలసీ నిపుణుడు దొంతి నర్సింహారెడ్డి, క్లైమేట్ చేంజ్ నిపుణుడు బీవీ సుబ్బారావులు మాట్లాడారు. అనంతగిరి హిల్స్ ప్రజల ఉమ్మడి ఆస్తి అని, గత ప్రభుత్వం అన్నింటినీ ధ్వంసం చేస్తే ఈ ప్రభుత్వం కూడా అదే విధాన్ని అనుసరిస్తోందన్నారు.దామగుండంలో నావికాదళం రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే వేల ఎకరాల్లో జీవ వైవిధ్యం దెబ్బతింటుందని, ఎన్నో లక్షల వనమూలికలు, ఆయుర్వేద వృక్షాలు, జంతువులు, పక్షులు, అక్కడే పుట్టి ప్రవహిస్తున్న అయిదు నదులు, కుంటలు కనుమరుగవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భజలాలు అడుగంటుతాయని, ప్రకృతికి ఎంతో ప్రమాదం పొంచి ఉందదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గడిచిన నాలుగేళ్లలో పలుమార్లు వికారాబాద్, దామగుండం పరిసర ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించామని, రాడార్ కేంద్రం వద్దని వివిధ రూపాల్లో ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహించామన్నారు. ప్రభుత్వం ఎలాంటి స్టడీ చేయకుండా, ఎవరితో చర్చించకుండా, నిపుణుల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## అక్రమ బ్లడ్‌దందా గుట్టురట్టు

- రక్తం యూనిట్ల బ్యాగ్‌లు, బాటిల్స్ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఔషధ నియంత్రణ అధికారులు అక్రమ బ్లడ్ దందాను గుట్టురట్టు చేశారు. భారీ ఎత్తున రక్తం యూనిట్ల బ్యాగ్‌లు, బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం బ్లడ్‌బ్యాంక్ నిల్వల కేంద్రంపై ఔషధ నియంత్రణ అధికారులు దాడులు చేశారు. ల్యాబొరేటరీస్‌లో అక్రమంగా నిల్వ చేసిన హ్యూమన్ ప్లాస్మా, హోల్ హ్యూమన్ బ్లడ్, హ్యూమన్ సీరోమ్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఔషధ నియంత్రణ సంస్థ అధికారులకు అందిన సమాచారం మేరకు మూసాపేటలోని హేమో సర్వీస్ ల్యాబొరేటరీస్ కంపెనీపై దాడి చేశారు. ఫ్రీజర్స్‌లో నిల్వ చేసిన బ్లడ్ ప్యాకెట్లు, బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రాఘవేంద్రరావు నాయక్ అనే వ్యక్తి గత 8 ఏళ్లుగా అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తేల్చారు. మదీనాగూడలోని శ్రీకర ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్, దారుల్‌షిఫాలోని న్యూలైఫ్ బ్లడ్ సెంటర్, కర్నూల్‌లోని ఆర్‌ఆర్ బ్లడ్

మిగతా 6వ పేజీలో..

తప్పతాగి..అమ్మాయిల కోసం అడిగి..
వృద్ధుడిని ఉరేసి చంపిన ఆటో డ్రైవర్ 6




## పూల వనం

పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన నర్సరీ మేళాలో రంగురంగుల పూలమొక్కలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. కుటుంబాల సమేతంగా వచ్చిన కొందరు వాటిని కొనుగోలు చేస్తుండగా.. మరికొందరు ఇలా ఫొటోలు దిగుతూ తమ అనుభూతులను పదిలపరుచుకొంటున్నారు. ఎన్నో రకాల ఔషధ మొక్కలతో కూడిన స్టాళ్ల వద్ద సందడి కనిపిస్తోంది. రూ.20 నుంచి రూ.16లక్షల వరకు ఖరీదైన మొక్కలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. - ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి

## జవహర్‌నగర్ మేయర్‌పై అవిశ్వాసానికి గ్రీన్‌సిగ్నల్

- 19వ తేదీని ఖరారుచేసిన కలెక్టర్

జవహర్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి కలెక్టర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. బల నిరూపణకు గాను ఈనెల 19వ తేదీని ఖరారు చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. మేయర్ కావ్యపై అవిశ్వాసం వ్యక్తం చేస్తూ 18మంది కార్పొరేటర్లు జనవరి 24న కలెక్టర్‌కు తీర్మాన ప్రతిని అందజేశారు. ఆ తర్వాత అసమ్మతి కార్పొరేటర్లు ఆంధ్రప్రదేశ్‌లోని రహస్యప్రాంతంలో క్యాంపునకు వెళ్లారు. మరోవైపు మేయర్ వర్గం అవిశ్వాసం వీగేలా ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

### సోషల్ మీడియాలో ట్రోల్స్..

ఒకవైపు కార్పొరేటర్లు అవిశ్వాసం పేరుతో క్యాంపులో ఉండడంతో స్థానికులు దుమ్మెత్తిపోస్తున్నారు. కార్పొరేటర్లు కనిపించడం లేదంటూ స్థానికులు సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తుండడం హాట్ టాపిక్‌గా మారింది.



ప్రదర్శనలో సారవంతనేల గురించి వివరిస్తున్న విద్యార్థిని

## భూ కిడ్నీలుగా చిత్తడి నేలలు

- చిత్తడినేల దినోత్సవంలో మంత్రి కొండా సురేఖ

నార్సింగ్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రవహించే నీటిలో కాలుష్య కారకాలను ఫిల్టర్ చేయగల అధిక, దీర్ఘకాలిక సామర్థ్యం చిత్తడి నేలలకు ఉంటుందని పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. అందుకే వీటిని భూ కిడ్నీలుగా కూడా పిలుస్తారని అన్నారు. రాష్ట్ర జీవవైవిధ్య బోర్డు, ధ్రువాన్ష్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నెక్నాంపూర్ చెరువు వద్ద శుక్రవారం ప్రపంచ చిత్తడి నేల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సురేఖ మాట్లాడుతూ వ్యర్థాలు, ప్లాస్టిక్‌లను డ్రైనేజీల్లో వేయకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా నెక్నాంపూర్ పాఠశాల విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ విభాగం ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణీ ప్రసాద్, డైరెక్టర్ కాళీచరణ్, ధ్రువాన్ష్ సంస్థ ప్రతినిధి మధులికా చౌదరి పాల్గొన్నారు.

# కమిటీ లేదు.. మీటింగ్ నిర్వహించరు!




- జీహెచ్ఎంసీలో స్టాండింగ్ కమిటీ ఎన్నిక.. కౌన్సిల్ నిర్వహణపై సందిగ్ధత
- వేచి చూసే ధోరణిలో కమిషనర్
- జాప్యంపై బీజేపీ కార్పొరేటర్ల మండిపాటు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్టాండింగ్ కమిటీ గడువు ముగిసి మూడు నెలలు.. కౌన్సిల్ మీటింగ్ నిర్వహించి ఆరు మాసాలు.. అయినా కమిటీ సభ్యుల ఎన్నిక ఏది..? సర్వసభ్య సమావేశం నిర్వహించేది ఎప్పుడు అంటే అధికార వర్గాలు స్పష్టమైన సమాధానం చెప్పడం లేదు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం మారిన పరిణామాలే ఈ సందిగ్ధతకు కారణంగా చెబుతున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నిక, కౌన్సిల్ నిర్వహణ విషయంలో కమిషనర్ రోనాల్డ్‌రోస్ వేచిచూసే ధోరణి ప్రదర్శిస్తున్నారని తెలిసింది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆయా విషయాలకు సంబంధించి ఉన్నతస్థాయి అభిప్రాయం తీసుకునే ఆలోచనలో కమిషనర్ ఉన్నట్టు సమాచారం. దీంతో ప్రతిపక్ష బీజేపీ కార్పొరేటర్లు మండిపడుతున్నారు. ప్రజాసమస్యలపై చర్చించేందుకు ఉద్దేశించిన కౌన్సిల్ సమావేశం నిర్వహణలో జాప్యమెందుకని ప్రశ్నిస్తున్నారు. సమావేశం నిర్వహించకపోవడంపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించినా కమిషనర్ మీటింగ్ నిర్వహించడం లేదని బీఆర్ఎస్ కార్పొరేటర్ గద్దం మహాలక్ష్మిగౌడ్(ఈమె బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు) వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది.

### భయంతోనే మీటింగ్ పెట్టడం లేదు..

మల్కాజ్‌గిరి కార్పొరేటర్ శ్రవణ్ (బీజేపీ).. సొంతపార్టీకి చెందిన కార్పొరేటర్లు కొప్పుల నరసింహారెడ్డి, ఆకుల శ్రీవాణి, మహాలక్ష్మిగౌడ్‌లతో కలిసి శుక్రవారం కమిషనర్‌ను కలిశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. రోడ్ల నిర్మాణం, నాలాల పూడికతీత, పారిశుధ్య, నిర్మాణ రంగ వ్యర్థాల నిర్వహణ పేరిట జీహెచ్ఎంసీలో అంతులేని అవినీతి జరుగుతున్నదని ఆరోపించారు. అన్నీ బయటపడతాయనే భయంతోనే సమావేశం నిర్వహించడం లేదని ఆరోపించారు. గత స్టాండింగ్ కమిటీ కాలపరిమితి నవంబర్‌తో ముగిసింది. అనంతరం ఎన్నికలు నిర్వహించి

మిగతా 8వ పేజీలో..

## ఉద్యోగులకు నిరుత్సాహకర బడ్జెట్

### పాత పెన్షన్ పథకంపై ప్రస్తావన లేకపోవడం బాధాకరం: అంజయ్య

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** పాత పెన్షన్ పథకంపై కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం ఉద్యోగులకు అత్యంత బాధాకరమని విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.అంజయ్య అన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం దృష్ట్యా ప్రత్యక్ష పన్ను రూట్లలో ఏలాంటి మార్పు లేకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్ ఉద్యోగులకు తీవ్ర నిరాశ కలిగించిందని తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.రత్నాకర్‌రావు, పి.సదానందంలు తెలిపారు. ప్రత్యక్ష పన్ను రేట్లలో మార్పు లేకపోవడంతో ఉపాధి కల్పనదారులను నిరాశకు గురిచేసిందన్నారు. 80సీ పరిమితి, స్టాండర్డ్ డిడక్షన్‌లో మార్పు లేదని, ఆశించిన స్థాయిలో పెరుగుదల లేదన్నారు. పాత పింఛను పునరుద్ధరణపై ఆర్థిక మంత్రి నోరు మెదపకపోవడం నిరాశకు గురిచేస్తుందన్నారు.

## తప్ప తాగి... అమ్మాయిల కోసం అడిగి...

- వృద్ధుడిని ఉరేసి చంపిన ఆటో డ్రైవర్
- మునగనూర్ కేసును ఛేదించిన పోలీసులు

**హయత్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** తాగిన మైకంలో ఓ వృద్ధుడిని అమ్మాయిలు కావాలని అడిగాడో ఆటో డ్రైవర్. ఆగ్రహించిన ఆ వృద్ధుడు ఆటో డ్రైవర్‌ను నానా దుర్భాషలాడాడు. కోపోద్రిక్తుడైన ఆటో డ్రైవర్ వృద్ధుడిని నిర్జన ప్రదేశంలోకి తీసుకువెళ్లి టవల్‌తో ఉరి వేశాడు. బండరాయితో తలపై మోదీ దారుణంగా హత్య చేశాడు. ఎవరూ గుర్తు పట్టకుండా శవంపై లుంగి కప్పి దానిపైన చెత్తను వేసి కాల్చివేశాడు. గత సోమవారం హయత్‌నగర్ శ్మశాన వాటిక సమీపంలో జరిగిన వృద్ధుడి హత్య కేసును హయత్‌నగర్ పోలీసులు ఛేదించారు. నిందితుడైన ఆటో డ్రైవరు రాజును శుక్రవారం ఉదయం హయత్‌నగర్ జీ స్కూల్ సమీపంలో పట్టుకున్నారు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు, వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, సీఐ నిరంజన్ నిందితుడి వివరాలను వెల్లడించారు. దేవరకొండ కట్టకొమ్ము తండాకు చెందిన నేనావత్ రాజు(25) 10వ తరగతి వరకు చదువుకున్నాడు. కొంత కాలంగా హయత్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో ఆటో నడిపిస్తున్నాడు. గత సోమవారం రాత్రి 12.30 గంటలకు హయత్‌నగర్‌లోని ఇన్ఫర్‌మేషన్ కాలనీలో ఉన్న వైను షాపు వద్దకు చేరుకున్నాడు. ఇదిలా ఉండగా మునగనూర్‌లో శివ సాయిరాంనగర్ కాలనీలో నివాసం ఉంటూ ఓ భవనం వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్న నందిపాటి నరసయ్య మద్యం తాగి వైను షాపు వద్ద ఉన్నాడు. ఆటో రాగానే అందులోకూర్చుని మరింత మద్యం తాగాడు. ఇది గమనించిన ఆటో డ్రైవర్ రాజు నా ఆటోలో ఎక్కి ఎందుకు తాగుతున్నావని మందలించాడు. తనను ఇంటి వద్ద దింపాలని కోరాడు. దీంతో ఇద్దరు కలిసి బయలుదేరారు. నరసయ్య ఇంటి అడ్రసు గుర్తించక పోవడంతో బంజారాకాలనీ వైపునకు ఆటో తీసుకుపోయాడు రాజు. అక్కడే ఉన్న బెల్టు షాపు వద్ద రెండు బీర్లు తీసుకుని నరసయ్యకు ఒక్క బీరు ఇచ్చి తాగమని అడగడంతో వద్దని తిరస్కరించాడు. వెంటనే ఆటో డ్రైవర్ రాజు ఇక్కడ మీ ఏరియాలో అమ్మాయిలు దొరుకుతారా అని అడిగాడు. అది విన్న నరసయ్య.. రాజును దుర్భాషలాడాడు. మద్యం మత్తులో ఉన్న ఆటో డ్రైవర్ రాజు హయత్‌నగర్ శ్మశాన వాటికకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలానికి తీసుకుని వెళ్లి నరసయ్య మెడకు టవల్‌తోనే ఉరి వేశాడు. బండరాయితో తలపై మోదడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. శవాన్ని గుర్తు పట్టకుండా ఉండేందుకు శవంపై నరసయ్య లుంగీని కప్పి చెత్తవేసి దహనం చేశాడు. అనంతరం ఆటో డ్రైవర్ రాజు అక్కడి నుంచి పారిపోయాడు. కేసును నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను, సాంకేతిక నైపుణాన్ని ఉపయోగించి శుక్రవారం సాయంత్రం హయత్‌నగర్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## అక్రమ బ్లడ్‌దందా గుట్టురట్టు..

(5వ పేజీ తరువాయి)



స్వాధీనం చేసుకున్న రక్తం బాటిళ్లు, ప్లాస్మా ప్యాకెట్లు

బ్యాంక్‌ల నుంచి నిబంధనలకు విరుద్ధంగా సేకరించిన బ్లడ్ బాటిల్స్‌ను మూసాపేటలోని భవానీ నగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో నిల్వ చేస్తున్నారు. వాటిని మళ్లీ ప్యాక్ చేసి విశాఖపట్నంలోని అక్టిమస్ బయోసైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, బాలానగర్‌లోని క్యాయిన్స్ ల్యాబ్, పుణెలోని క్లినోవి రీసర్చ్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూర్‌లోని జీ7 సినర్జాన్ ప్రైవేట్ లిమిటిడెట్, మైక్రోల్యాబ్స్, నార్‌విచ్ క్లినికల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, బాలనగర్‌లోని క్యూపియస్ బయోసర్వ్ ప్రైవేట్ లిమిటెడ్, మల్లాపూర్‌లోని శిల్పా మెడికా లిమిటెడ్, మదినాగూడలోని జనరైజ్ క్లినికల్ రీసర్చ్ ప్రైవేట్ లిమిటెడ్, చర్లపల్లిలోని విమ్‌టా ల్యాబ్స్ లిమిటెడ్‌లకు విక్రయిస్తున్నాడు. రాఘవేంద్రనాయక్ ఇతర బ్లడ్ బ్యాంక్ నుంచి 150 ఎంఎల్ హ్యూమన్ ప్లాస్మా బ్యాగ్‌ను రూ.700కు కొనుగోలు చేసి, దానిని తిరిగి ప్యాకింగ్ చేసి ఇతర కంపెనీలకు రూ.3వేలకు విక్రయిస్తున్నాడు. 2016 నుంచి 6 వేల యూనిట్ల కంటే ఎక్కువ రక్తాన్ని సేకరించి, విక్రయించినట్టు అధికారులు గుర్తించారు. దాడుల్లో హెచ్ఐవీ, హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్ఏజీ, వీడీఆర్ఎల్, మలేరియా పారాసైట్, ఇన్‌విట్రో డయాగ్నోస్టిక్స్ కిట్స్ స్వాధీనం చేసుకున్నారు.


## లే అవుట్ల ఖాళీ స్థలాలు మాయం..

(5వ పేజీ తరువాయి)

జీహెచ్ఎంసీ ఓపెన్ స్పేస్‌లపై రాజకీయ నేతలు, కాలనీ సంఘాలు, అక్రమార్కులు కన్నేశారు. స్థానికంగా అధికారుల సహకారం ఉండడంతో కబ్జాకాండ యథేచ్ఛగా కొనసాగుతోంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ఈ తరహా కబ్జాలు ఎక్కువగా జరిగాయి. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి తదితర ప్రాంతాల్లోనూ పలు కాలనీల్లో ఓపెన్ స్పేస్‌లను ప్లాట్లుగా చేసి విక్రయించారు. జూబ్లీహిల్స్‌లోని ఓపెన్ స్పేస్‌ను ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించారని జీహెచ్ఎంసీ అధికారులను హెచ్ఎండీఏ అప్రమత్తం చేసింది. గతంలోనూ రెవెన్యూ విభాగం పలు ఓపెన్ స్పేస్‌ల కబ్జాలను బల్దియా దృష్టికి తీసుకొచ్చింది. పలు ప్రాంతాల్లో స్థానికులు అన్యాక్రాంతంపై ఫిర్యాదు చేస్తుంటారు. అయినా కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.


### కాంపౌండ్‌వాల్ ఉన్నా..

గ్రేటర్‌లోని ఓపెన్ స్పేస్‌లను కబ్జాదారుల నుంచి కాపాడేందుకు 2014-15లో చర్యలు చేపట్టారు. క్షేత్రస్థాయిలో స్థలాలు గుర్తించడంతో పాటు కాంపౌండ్ వాల్ నిర్మించాలని నిర్ణయించి పలు ప్రాంతాల్లో పూర్తి చేశారు. 2016లో ఓపెన్ స్పేస్‌ల గుర్తింపునకు క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి 3,356 స్థలాలున్నట్టు గుర్తించారు. వీటిలో 2,906 ఓపెన్ స్పేస్‌లకు కాంపౌండ్ వాల్స్ ఉన్నాయని, మరో 447 నిర్మించాల్సి ఉందని తేల్చారు. కాలగమనంలో కాంపౌండ్ వాల్స్ ఉన్న స్థలాలనూ కబ్జాదారులు చెరబట్టారు. నగరంలో ప్రస్తుతం ఏటా 12 - 15 లే అవుట్లకు అనుమతి ఇస్తున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ లేఅవుట్లలోని ఓపెన్ స్పేస్‌లను కలుపుకొంటే సంస్థకు చెందిన ఖాళీ స్థలాలు పెరగాలి. కానీ క్రమేణా తగ్గుతుండడం గమనార్హం. లెక్కల్లో 3 వేలకు పైగా ఉన్నట్టు చెబుతోన్నా.. క్షేత్రస్థాయిలో అందులో 30 శాతం వరకు కనిపించవని ఓ ఉన్నతాధికారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఓపెన్ స్పేస్‌ల్లో ఆక్రమణలు కూల్చివేసేందుకు గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ డిజాస్టర్ మెనేజ్‌మెంట్ (ఈవీడీఎం)లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా కొన్ని రోజులు హడావిడి చేసిన ప్రత్యేక బృందాలు.. ఆ తర్వాత మిన్నకుండిపోయాయి. 2 ఎకరాలకుపైగా స్థలాల్లో కబ్జాలను తొలగించి స్వాధీనం చేసుకున్నట్టు ఈవీడీఎం వర్గాలు పేర్కొన్నాయి. ఓపెన్ స్పేస్‌ల ఆక్రమణల పర్వానికి ఇదీ ఓ నిదర్శనం.






















మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/3DpV5bu లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

## నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** ఉప్పర్‌పల్లి 33/11 కేవీ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. పరమరెడ్డి హిల్స్, జన చైతన్య ఫేజ్-1, ఫేజ్-2, గోల్డెన్ హైట్స్, హ్యాపీ హోమ్స్ కాలనీ, జలాల్‌బాబానగర్, 9 నెంబర్, 24 నెంబర్, చింతల్‌మెట్ చౌరస్తా, హ్యాపీ హోమ్స్ ఫోర్చునా, హరినాథ్‌రెడ్డి కాలనీ పరిసర కాలనీల్లో కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అసౌకర్యానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

### పాతబస్తీలో..

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ, సీబీడీ మధుసూదన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జంగంమ్మెట్, ఫలక్‌నుమా, ఖాద్రిచమాన్, శివాజీనగర్, రాజన్న బౌలిలో కొమ్మల నరికివేత కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కరెంటు సరఫరా ఉండదన్నారు.

● గుంతల్ షా దర్గా, హబీబ్‌నగర్, రోషన్ కాలనీ, హ్యాండీ క్యాప్ కాలనీ, అంజదుల్లాబాగ్, రంజాన్ కాలనీలలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

● ఫలక్‌నుమా, మదీనా కాలనీ, బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయం, రైతు బజార్, బస్ డిపో, ఇంజన్‌బౌలి, జహనుమా, చస్మా చార్‌చమాన్, సర్వర్‌జంగ్ కాలనీ, వట్టిపల్లి, మిస్కిన్ హోటల్, అల్ మదీనా హోటల్, ఫలక్‌నుమా ప్యాలెస్, ఫరుఖ్‌నగర్, ఫాతిమా నగర్, అలియాబాద్, గౌలిపురా, రోషన్ కాలనీ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

## అంబేడ్కర్ యూనివర్సిటీ ఓల్డ్ బ్యాచ్ డిగ్రీ ఫలితాలు ప్రకటించాలి

**యాకుత్‌పుర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన డిగ్రీ ఓల్డ్ బ్యాచ్ విద్యార్థులకు ప్రాక్టికల్, థియరీ పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో రెండు రాష్ట్రాలకు చెందిన ఓల్డ్ బ్యాచ్ విద్యార్థులకు 2023 డిసెంబర్‌లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో గ్రూప్ పరీక్షలకు సంబంధించి నోటిఫికేషన్లు వెలువడనున్న నేపథ్యంలో డిగ్రీ ఓల్డ్ బ్యాచ్ విద్యార్థులకు ప్రాక్టికల్, థియరీ పరీక్షల ఫలితాలు వెంటనే విడుదల చేయాలని అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌ను విద్యార్థులు కోరుతున్నారు.



బీఎస్పీ రాజేంద్రనగర్ నియోజకవర్గం అధ్యక్షుడిగా నియామక పత్రాన్ని అందుకుంటున్న రవి కుమార్

## రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఎస్పీ అధ్యక్షుడిగా రవికుమార్

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షుడిగా రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లికి చెందిన ఆదిరాల రవికుమార్ నియమితులైనారు. ఈ మేరకు ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పానుగంటి ప్రవీణ్‌కుమార్ నియామకపత్రాన్ని అందజేశారు.




16న జరిగే దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించి శివరాంపల్లిలోని విజయ ఆయిల్ మిల్ మేనేజర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జె.రుద్రకుమార్, తదితరులు

- రాజేంద్రనగర్, ఆంధ్రజ్యోతి



రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న మహంకాళిమాతేశ్వరి భారతమాత, కోట మైసమ్మ దేవాలయ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.ఎస్ ఆనంద్‌రావు

- చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి



బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదిరి చంద్రశేఖర్

- చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి

# పాతబస్తీలో ఈ-కేవైసీ 70 శాతమే

**మదీన, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** పౌర సరఫరాల శాఖ సర్కిల్-2 పరిధిలో ఆహార భద్రతా కార్డుదారుల ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఆహార భద్రత కార్డులో పేర్లున్న ప్రతి ఒక్కరు రేషన్ దుకాణానికి వెళ్లి తమ బయోమెట్రిక్ నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. గత సెప్టెంబర్‌లో ప్రారంభమైన ఈ ప్రక్రియ గడువు జనవరి నెలాఖరు కొనసాగింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలనే ఆలోచనలో ఉంది. కాబట్టి పాత కార్డుదారులకు బయోమెట్రిక్ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తే కొత్తకార్డులు జారీ చేయడంతోపాటు, కొత్త సభ్యులను చేర్చే పని చేయవచ్చని ప్రభుత్వం భావిస్తుంది. కాబట్టి కేవైసీ నమోదు ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో ప్రభుత్వం ఫిబ్రవరి ఈనెలాఖరు వరకు పొడిగించింది.





కొన్ని ప్రాంతాల్లో డీలర్ల నిర్లక్ష్యం, బయోమెట్రిక్ నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండడంతో నత్తనడకన సాగుతోంది. పాతనగరంలో రేషన్ షాపుల ముందు రేషన్ తీసుకొనే లబ్ధిదారులు బారులు తీరి ఉంటారు. 22వ తేదీ తర్వాత షాపులు మూసివేస్తారు. దీంతో కేవైసీ నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. జనవరి నెలాఖరు వరకు చాలామంది తమ కేవైసీ చేయించుకోలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం గడువును ఫిబ్రవరి నెలాఖరు వరకు పొడిగించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

### ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నాం

కేవైసీ పూర్తి చేసుకోవాలని ప్రజలను కోరుతున్నాం. ఇప్పటివరకు 70 శాతం ప్రక్రియ పూర్తయింది. బయటి దేశాల్లో ఉన్నవారు, చనిపోయిన వారు, ముసలివారి, సాంకేతిక సమస్యలున్నవారి బయోమెట్రిక్ నమోదు మిగిలి ఉంది. అది కూడా త్వరగా పూర్తి చేస్తాం. డీలర్లు కూడా తమ దుకాణాలు తెరిచి ఉంచాలని చెప్పాం. ఈ విషయమై ప్రతిరోజు డీలర్లకు సూచనలిస్తున్నాం.

మా సిబ్బంది కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

-విజయ చాముండేశ్వరి,
ఏఎస్ఓ సర్కిల్-2



కేన్సర్ అవగాహన సైకిల్ ర్యాలీలో యువకులు

## సైకిల్ ట్రాక్‌పై కేన్సర్ అవగాహన ర్యాలీ

**నార్సింగ్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):** స్కాడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం కేన్సర్‌పై అవగాహన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్కాడ్ డెవలపర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈవో నాగనందిగాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈవో చేతులు మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ వ్యాధిని మొదటి దశలో గుర్తిస్తే ఆ వ్యాధి నియంత్రణ పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరికి సామాజిక బాధ్యత తప్పనిసరి అని, తమ వంతుగా కేన్సర్ రోగులకు మనో ధైర్యాన్ని కల్పించేందుకు ఈ సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. కేన్సర్ మొదటి దశలోనే ఉన్న సమయంలో పూర్తిగా నయం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు డాక్టర్లు చెబుతున్నారని, ప్రతీ ఒక్కరు కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటీ డైరెక్టర్స్ తేజేష్ కొలిపార, తరుణ్ అల్లబోయిన, వేదంత్ దోషి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ట్రాయ్ వానాకెన్

## అవగాహన లేకుండా విదేశాలకు వెళితే ఇబ్బందే


**హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి):** సరైన అవగాహన లేకుండా ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్తున్న విద్యార్థులు అక్కడ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఓరియంట్ స్పెక్ట్రా కన్సల్టింగ్ సంస్థ ఎండీ ఎస్.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎంతో మంది విద్యార్థులు ఆర్థిక సమస్యలతో ఫీజులు కట్టలేక చదువు మానుకొని ఎలాగో తిప్పలు పడి మళ్లీ ఇండియాకు తిరిగివస్తున్నారన్నారు. యూఎస్‌కు చెందిన ఎల్మ్‌హర్స్ట్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ ట్రాయ్ వానాకెన్‌తో విద్యార్థులకు శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని కార్యాలయంలో ఇంటరాక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. యూఎస్ రావాలనుకుంటే ముందుగా అక్కడ ఉన్న అవకాశాలు, ఆర్థిక పరిస్థితి, కోర్స్‌కు అయ్యే ఖర్చు, వసతి కోసం అయ్యే ఖర్చుపై ముందుగా ఒక కచ్చితమైన అవగాహన, అంచనా ఉండాలని ఆయన సూచించారు. తల్లిదండ్రుల ఆర్థిక స్తోమతను కూడా గుర్తుంచుకోవాలని, యూఎస్‌లో అడుగుపెట్టాగానే ఏదో ఒక పార్ట్ టైమ్ ఉద్యోగంలో చేరి ఖర్చులు సర్దుకోవాలంటే కుదరదని, యూఎస్‌కు వెళ్లిన తర్వాత ఆరు నెలల వరకు ఎలాంటి ఉద్యోగం చేసే అవకాశం విదేశీయులకు ఉండదని, విద్యార్థులు ఆరు నెలల పాటు అన్ని ఖర్చు భరించుకోవాల్సి వస్తుందని చెప్పారు. యూఎస్‌కు వచ్చే ఇండియన్స్‌లో తెలుగు వారే ఎక్కువగా ఉంటారని, ఇక్కడే పూర్తి సమాచారం తెలుసుకునే అవకాశం కూడా ఉందని ఆయన అన్నారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది

## పరుపుల తయారీ కార్ఖానాలో అగ్ని ప్రమాదం

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పరుపులు తయారు చేసే కార్ఖానాలో అగ్ని ప్రమాదం సంభవించింది. మైలార్‌దేవ్‌పల్లి ఉడంగడ్డ దళితబస్తీ శ్మశానవాటికను ఆనుకుని ఉన్న కృష్ణారెడ్డినగర్ కాలనీలో 50 గజాల స్థలంలో మహ్మద్ అబ్దుల్లా కుమారుడు మహ్మద్ బాకర్ పరుపులు తయారీ చేస్తున్నాడు. పాత బట్టలను తీసుకువచ్చి యంత్రంలో వేసి దాని నుంచి దూదిని తీస్తారు. అలా తీసిన దూదితో పరుపులు తయారు చేస్తారు. శుక్రవారం నాలుగు గంటల సమయంలో పరుపుల కార్ఖానాలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పరుపుల కార్ఖానాలో ఉన్న దూది, పరుపులు మొత్తం కాలిపోయాయి. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ అగ్ని మాపక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఉన్నతాధికారులు

## ఫాస్ట్ డ్రైవ్.. లాస్ట్ డ్రైవ్ కావొచ్చు

● యువతకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన

**ఖైరతాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి):** ఉజ్వల భవిత ఉన్న విద్యార్థులు వాహనాలు నడిపే సమయంలో సంయమనం పాటించాలని, ఇంట్లో తమ వారు వేచి చూస్తారనే ఆలోచనతో ఉండాలని ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం లక్డీకాపూల్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ) కళాశాల విద్యార్థులకు టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. దీనికి సెంట్రల్ జోన్ ట్రాఫిక్ అదనపు డీసీపీ మహమ్మద్ షాకీర్‌హుస్సేన్ అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. యువత ఎక్కువగా ఓవర్‌స్పీడ్, రాంగ్‌రూట్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారని, రేసింగ్‌లు, స్టంట్‌లు చేస్తూ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని తెలియజేశారు. ట్రాఫిక్ నియమాలు పాటించకపోతే కలిగే నష్టాలపై ఏసీపీ శంకర్‌రాజ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎన్‌బి రత్నం, సైఫాబాద్ ట్రాఫిక్ సీఐ రాజశేఖర్, ప్రిన్సిపల్ కె.రఘువీర్ పాల్గొన్నారు.

## ఎల్‌పీజీ మెకానిక్, ఇన్‌స్పెక్టర్ కోర్స్‌లో శిక్షణ

● సెట్విన్ ఎండీ కె.వేణుగోపాల్‌రావు



వేణుగోపాల్‌రావు

**యాకుత్‌పుర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్‌లో ఉన్న కోర్సులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ ప్రాధాన్యత క్రమంలో నిరుద్యోగ యువతీ యువకులకు అంతుబాటులోకి తీసుకువస్తుందని సంస్థ ఎండీ కె.వేణుగోపాల్‌రావు అన్నారు. పాతబస్తీలోని సెట్విన్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), ఇండియాన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)లకు చెందిన డిస్ట్రిబ్యూటర్ల సహకారంతో త్వరలో పదోతరగతి చదివిన యువతీ, యువకులకు ఎల్‌పీజీ గ్యాస్ స్టౌవ్‌లకు సంబంధించి.. ఎల్‌పీజీ మెకానిక్ కమ్ ఇన్‌స్పెక్టర్ కోర్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎండీ తెలిపారు. గృహలలో గ్యాస్ స్టౌలకు సంబంధించి మెకానిక్‌లను తీర్చిదిద్ది వారికి అవసరమైతే పైన పేర్కొన్న కంపెనీలకు సంబంధించి తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 800 డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని, శిక్షణ అనంతరం వారికి అక్కడ ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయని వివరించారు. ఎల్‌పీజీ స్టౌ కలిగిన వారు తప్పకుండా మూడు సంవత్సరాలకు గ్యాస్ స్టౌలను తప్పకుండా రిపేర్ చేయించుకోవాలని నిబంధన ఉందని ఆయన గుర్తుచేశారు. ఎల్‌పీజీ మెకానిక్ కమ్ ఇన్‌స్పెక్టర్ కోర్స్‌లో శిక్షణ పొందే విద్యార్థులు రూ. 3 వేలు చెల్లించాల్సి ఉంటుందని, అందుకోసం ఓ ప్రాణాళికను సిద్ధం చేసిన్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు సంబంధించి త్వరలో వివరాలు వెల్లడించనున్నట్లు ఎండీ తెలిపారు. యువతీ, యువకులు శిక్షణ పొంది ప్రయోజనం పొందాలని ఆయన సూచించారు. తొలివిడత 100 మందికి శిక్షణనిచ్చి ఈ కోర్సును అన్ని కేంద్రాలకు విస్తరించడం జరుగుతుందన్నారు.

## సీఎస్ రంగరాజన్‌కు టీటీడీ ఆహ్వానం

**మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** శ్రీ చిలుకూరు వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) నుంచి శుక్రవారం ఆహ్వానం అందింది. టీటీడీ సారథ్యంలో తిరుపతిలో ఈ నెల 3 నుంచి 5 వరకు నిర్వహించనున్న భక్తి ఉద్యమంలో ఆధ్యాత్మిక గురు కేటగిరి కింద ఆహ్వానం అందినట్లు రంగరాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సనాతన ధార్మిక సదస్సు ముఖ్య ఉద్దేశం సనాతన హిందూ ధర్మ విలువలను నిలబెట్టే ఆధ్యాత్మిక ఉద్యమమని.. టీటీడీ తన హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మారుమూల, వెనుకబడిన ప్రాంతాల్లో మత మార్పిడిలను నిరోధించడానికి ఆధ్యాత్మికత కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. నాతో పాటు దేశంలోని వివిధ మఠాధిపతులు దాదాపు 57 మంది పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు రంగరాజన్ తెలిపారు.



విద్యార్థులను పట్టాలు అందజేస్తున్న ఆచార్య లింబాద్రి

## సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

● ఆచార్య లింబాద్రి

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులు విద్యతో పాటు పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని పోటీ ప్రపంచంలో రాణించాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తపస్య కాలేజ్ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య లింబాద్రితో పాటు ఉస్మానియా వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి రాములు, తపస్య కళాశాలల చైర్మన్ సెంట్రల్ కౌన్సిల్ చార్టర్ అకౌంట్ మెంబర్ సీఏ శ్రీధర్ ముప్పాల తదితరులు హాజరై సుమారు 500 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య లింబాద్రి మాట్లాడుతూ సమకాలీన ప్రపంచంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు, వ్యాపారానికి కావాల్సిన నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. మానవ విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడానికి విద్యాసంస్థలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## కృష్ణకాంత్ పార్కులో 'సంస్కార్' విద్యార్థుల సందడి



పార్కులో సందడి చేస్తున్న చిన్నారులు

**ఎర్రగడ్డ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైవ్ స్కూల్ చిన్నారులు శుక్రవారం కృష్ణకాంత్ పార్కులో సందడి చేశారు. విహారయాత్రలో భాగంగా చిన్నారులు కృష్ణ కాంత్ పార్కును పూర్తిగా తిరిగి ఆడి, పాడి ఆహ్లాదంగా గడిపారు. ఈ సందర్భంగా స్కూల్ ఫౌండర్, సీఈవో ఏ మోహనవంశీ మాట్లాడుతూ.. విద్యార్థుల విజ్ఞానానికి పదును పెట్టేందుకు ఇలాంటి విజ్ఞాన, విహార యాత్రలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. విజ్ఞానయాత్రలో భాగంగా బిర్లా సైన్స్ ప్లానిటోరియం, పంటలు ఎలా పండుతాయి అని తెలుసుకోవడానికి పొలాలను సందర్శించడంతో పాటు సైన్స్ ఎగ్జిబిషన్, మోడల్ రైతు బజార్లను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఏ మధుమతి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా శేఖర్‌రెడ్డి

**చంపాపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా హస్తినాపురం డివిజన్ విశ్వేశ్వరయ్య కాలనీకి చెందిన మంకాల శేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి శుక్రవారం మాట్లాడుతూ తనను జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం తనవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు.



## అనుమతి లేని సభలు, సమావేశాలపై ఆంక్షలు..

● రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఏడు రోజుల పాటు

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** ముందస్తు అనుమతులు తీసుకోకుండా నిర్వహించే సభలు, సమావేశాలపై నిషేధం విధిస్తూ రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరి 1 నుంచి 7వ తేదీ వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. సభలు సమావేశాల సందర్భంగా ర్యాలీలు, ర్యాలీల్లో కత్తులు, జెండాలు, ఆయుధాలు ప్రదర్శించడం, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగేలా సభలు, సమావేశాలు నిర్వహించడం, స్పీకర్లను వినియోగించడం, అనుమతి లేకుండా డీజేల నిర్వహణపై ఆంక్షలు విధించారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.



మురుగు, వ్యర్థాలతో జియాగూడ కబేలా

## దుర్గంధభరితంగా జియాగూడ కబేలా

● ఇబ్బంది పడుతున్న వినియోగదారులు

**జియాగూడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతున్నాం. ఇప్పటికే ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చింది. నగరాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తున్నాం. స్వచ్ఛ హైదరాబాద్‌తో నగరం అద్దంలా మెరిసిపోతుంది. ఇలా ఎన్నో మాటలు చెప్పిన జీహెచ్ఎంసీ అధికారులు ఆచరణలో మాత్రం వాటిని అమలు చేయడం మరిచారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు చందంగా మురుగు, వ్యర్థాలతో జియాగూడ కబేలా కంపు కొడుతుంది. ఇక్కడ అనునిత్యం కోట్ల రుపాయల మాంసం విక్రయాలు జరుగుతాయి. కబేలాలో ముక్కుపూటలు అదిరిపోయే దుర్గంధం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. జీహెచ్ఎంసీ సిబ్బంది రోజు ఊడ్చినా.. మాంసం వ్యర్థాలను పక్కనే పడేయడంతో అది కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. తడి, పొడి చెత్తను వేరు చేయడానికి డబ్బాలను ఏర్పాటు చేసినా అవి కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యాయి. ఎన్నుకోబడ్డ నేతలు, ప్రభుత్వ అధికారులు కబేలా పరిశుభ్రతను గాలికి వదిలేసి చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రముఖ సాంస్కృతిక సంస్థ కిన్నెర ఆర్ట్ థియేటర్ కార్యదర్శి రఘురామ్, ప్రముఖ నాట్య గురువు ఉషా గాయత్రి దంపతులను కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పరామర్శించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సాంస్కృతిక సేవలో నిమగ్నమవ్వాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏపీ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ తదిరతులు కూడా రఘురామ్ దంపతులను పరామర్శించారు.

- రవీంద్రభారతి, ఆంధ్రజ్యోతి



అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అసోసియేషన్ నాయకులు

## గ్రామ రెవెన్యూ వ్యవస్థ తీసుకొస్తాం

**అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి):** గ్రామ రెవెన్యూ వ్యవస్థను తీసుకొస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డిప్యూటీ కలెక్టర్ అసోసియేషన్‌కు సంబంధించిన డైరీని మంత్రి తన నివాసంలో అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండవని.. మా ప్రభుత్వంలో ప్రజా పాలన సుభిక్షంగా ఉంటుందన్నారు. అందుకే ఆరు గ్యారేంటీలను ప్రజల కోసం తీసుకురావడం జరిగిందన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సేవలు మరువలేనివని... వారి ద్వారా ప్రభుత్వానికి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్, ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, టీజీఆర్ఓ జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీష్, హరాలే సుధాకర్ రావు, సురేశ్ బాబు, పల్లెపాటి నరేశ్, చింతల మురళీ, ప్రకాశ్‌రావు దేవ్ పాండే, పగిళ్ల వెంకన్న, వినయ్ కుమార్, బాలరాజు, శ్రీహరి నాయక్, ప్రభు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



పద్మ విభూషణ్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును సత్కరిస్తున్న వీహెచ్‌పీ నేతలు

## వెంకయ్య నాయుడికి వీహెచ్‌పీ సత్కారం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడును విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర బృందం సత్కరించింది. విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భాగ్యనగర్ బృందం వెంకయ్యనాయుడుని సత్కరించింది. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, డా.రాంసింగ్, రాష్ట్ర సహకార్యదర్శి భానుప్రసాద్, రాష్ట్ర ప్రచారప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, దుర్గా వాహిని రాష్ట్ర సంయోజక్ వాణిసక్కుబాయి, పూర్వ ఏబీవీపీ కార్యకర్త మధు పాల్గొన్నారు.

## పేదలకు అన్యాయం చేస్తున్న మోదీ బడ్జెట్: మురళి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి

రాంనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ అబద్ధాల పుట్ట అని, కార్పొరేట్‌లకు 25 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసి పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ, విద్య, వైద్య రంగాలకు నిధులు కేటాయించకుండా ప్రజా బడ్జెట్ అని అబద్ధాలు ఆడుతూ పేదలను మోసం చేస్తుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఆరోపించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రక్షించాలని, పట్టణ ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆకునూరి మురళి మాట్లాడుతూ.. దేశంలో అసమానతలు పెరుగుతున్నాయని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని మోదీ రద్దు చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ సదస్సులో చక్రధర్‌బుద్ధ, పి.శంకర్, పులి కల్పన, ఫిరోజ్, ఇందిర, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ఛ్ఛ్.. వాళ్లు కేటుగాళ్లా..?

● ఏసీబీ పేరు చెబితే .. డబ్బులిచ్చేసిన కొందరు అధికారులు ● అవి ఫేక్ కాల్స్ అని తెలుసుకుని నిట్టూర్పు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ బాలకృష్ణపై ఏసీబీ అధికారుల దాడుల నేపథ్యంలో సంస్థలోని అవినీతి ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఏసీబీ అంటేనే హడలిపోతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కేటుగాళ్లు ఏసీబీ పేరుతో వారిని బెదిరించి సొమ్ము చేసుకున్నారు. 'ఏసీబీ ఆఫీసుకొచ్చి కలవండి' అనే పేరుతో 'ఆంధ్రజ్యోతి' కథనం ద్వారా వాళ్లు కేటుగాళ్లు అని తెలుసుకుని డబ్బు చెల్లించినవారు నిట్టూరుస్తున్నారు. బాలకృష్ణపై ఏసీబీ అధికారుల దాడుల్లో లెక్కకు మించిన ఆస్తులు బయటపడ్డాయి. ఆ ఘటన వెలుగులోకి వచ్చిన నాటి నుంచీ హెచ్ఎండీఏ అధికారులు, ఉద్యోగులకు ఏసీబీ అధికారులమంటూ కేటుగాళ్ల నుంచి కాల్స్ వస్తున్నాయి. 'మేం ఏసీబీ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నాం. మీపై వివిధ ఫిర్యాదులు వచ్చాయి. విచారణ జరుపుతున్నాం. ఆఫీసుకొచ్చి కలవండి. లేదంటే సెటిల్ చేసుకోండి' అని రెండు రోజులుగా 6305369061, 6305957556 నెంబర్ల నుంచి కొందరు ఉద్యోగులకు (హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లో ఉన్న నెంబర్లకు) ఫోన్లు వచ్చాయి. దీంతో భయపడిన కొందరు.. కేటుగాళ్లు చెప్పిన ఖాతా (అకౌంట్ నెంబర్ 721902010001421)కు రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు డబ్బు ట్రాన్స్‌ఫర్ చేశారు. అవన్నీ ఫేక్ కాల్స్ అని 'ఆంధ్రజ్యోతి' కథనం ద్వారా తెలుసుకున్న బాధితులు తాము మోసపోయామని ఆవేదన చెందుతున్నారు. కొందరు అధికారులు, ఉద్యోగులు హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలికి ఈ ఫేక్ కాల్స్‌పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

# నమ్మించి ముంచేశాడు..

● రూ.కోటిన్నరతో బ్యాడ్మింటన్ కోచ్ పరార్

● న్యాయం చేయాలంటూ బాధితుల ఆందోళన



ఆళ్ల పున్నారెడ్డి

పంజాగుట్ట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'నేను ఒంటరివాడిని. చెడు అలవాట్లు లేవు. మంచి పనులకు సహాయం చేస్తుంటాను' అంటూ బ్యాడ్మింటన్ కోచ్ కాలనీవాసులను నమ్మించి సుమారు కోటిన్నర కొట్టేశాడు. నెల క్రితం కాలనీలోని గది ఖాళీ చేసి బిచాణా ఎత్తేశాడు. మోసపోయామని గుర్తించిన బాధితులు శుక్రవారం ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు జిల్లాకు చెందిన ఆళ్ల పున్నారెడ్డి (67) బ్యాడ్మింటన్ కోచ్. వెంగళరావునగర్ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీ కమ్యూనిటీహాల్ ఆవరణలోని బ్యాడ్మింటన్ కోర్టును ఐదేళ్లక్రితం లీజుకు తీసుకున్నాడు. నెలకు దాదాపు రూ.1.10 లక్షలు అద్దె చెల్లించేందుకు కాలనీ సంక్షేమ సంఘంతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. కోర్టు సమీపంలోని ఓ గదిలో ఒంటరిగా ఉండేవాడు. బ్యాడ్మింటన్ కోర్టుకు చిన్నారులను తీసుకొచ్చే తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులతో పరిచయం పెంచుకునేవాడు. మంచివాడిగా నమ్మించి అత్యవసరం అంటూ డబ్బు అప్పు తీసుకునేవాడు. నాలుగున్నరేళ్ల కాలంలో సుమారు 25 మంది నుంచి రూ. కోటిన్నర వరకూ వసూలు చేశాడు. ఒక మహిళ అయితే రూ.25 లక్షల వరకు ఇచ్చినట్లు సమాచారం. బ్యాడ్మింటన్ కోర్టుకు రోజూ సుమారు 250 మంది వచ్చేవారు. వేలాది రూపాయలు ఫీజులు చెల్లించేవారు. అయినప్పటికీ అసలు, కనీసం వడ్డీ కూడా చెల్లించకపోవడంతో బాధితులు తమ డబ్బు కోసం అతడిపై ఒత్తిడి పెంచారు. దీంతో పండగకు ఊరెళ్తున్నానని పున్నారెడ్డి సంక్రాంతి రోజున గది ఖాళీ చేసి వెళ్లాడు. అప్పటి నుంచీ ఫోన్ పనిచేయడం లేదు. దీంతో బాధితులు అసోసియేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. అప్పటికే అక్కడ బ్యాడ్మింటన్ కోర్టు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు నోటీస్ ఉండడంతో, అసోసియేషన్‌కు తెలియకుండా పున్నారెడ్డి ఇంతలా మోసం చేయలేడని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. అత్యవసరం అంటే లోన్లు తీసుకుని మరీ ఇచ్చామని వాపోతున్నారు.

## అంతర్జాతీయంగా ఫార్మా రంగానికి భవిష్యత్తు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా ఫార్మా రంగానికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని, ఫార్మసీ విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం జేఎన్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సదస్సుకు హరియాణా, మధ్యప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్, బీహార్, రాజస్థాన్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్.. తదితర రాష్ట్రాల నుంచి ఫార్మారంగ నిపుణులు, సైంటిస్టులు, విద్యార్థులు హాజరయ్యారు.



సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ కార్మికుల భద్రతా ప్రమాణాలకు సంబంధించిన డైరీని ఆవిష్కరిస్తున్న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తదితరులు

సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ కార్మికులు

## భద్రతా ప్రమాణాలు పాటించాలి

● దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్

● తార్నాకలోని రైల్వే ఆఫీసర్ క్లబ్‌లో జోనల్ సేఫ్టీ సెమినార్

తార్నాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేలో సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ విభాగంలో పనిచేసే కార్మికులు భద్రత ప్రమాణాలు పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు. శుక్రవారం తార్నాకలోని రైల్వే ఆఫీసర్ క్లబ్‌లో జోనల్ జనరల్ సెక్రటరీ కొత్తపల్లి మల్లేషం అధ్యక్షతన ఆల్ ఇండియా రైల్వే సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోనల్ సేఫ్టీ సెమినార్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే పీసీపీఓ పి. కిషోర్ బాబు, పీసీఎస్ఓ కె. వెంకటరామణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విమలా గద్దర్‌కు రమాబాయ్ అంబేడ్కర్ అవార్డు

పంజాగుట్ట, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధనౌక గద్దర్ సతీమణి విమలా గద్దర్ రమాబాయ్ అంబేడ్కర్ అవార్డుకు ఎంపికయ్యారని డాక్టర్. బీఆర్. అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు జి.వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రేమ్ నగర్ అంబేడ్కర్ భవన్‌లో సంస్థ ముఖ్య నాయకులు సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఈ నెల 7న రమాబాయ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా లోయర్ ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగే ఉత్సవాలలో విమలా గద్దర్‌కు అవార్డు అందజేస్తామన్నారు. కార్యక్రమానికి ప్రజా, ప్రకృతి కవి జయరాజు, వెన్నెలా గద్దర్, హాజరవుతారన్నారు.

## అఖిల్ పహిల్వాన్ హోటల్ సీజ్ చేసిన ఆర్డీవో

మంగళ్‌హట్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విదేశాల నుంచి యువతులకు ఉద్యోగాల పేరుతో ఎరవేసి నగరానికి రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్న అఖిల్ పహిల్వాన్ హోటల్‌ను అధికారులు సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాంనగర్ ప్రాంతానికి చెందిన అఖిల్ పహిల్వాన్(35) కొంత కాలంగా ఆబిడ్స్‌లోని ఓ భవనాన్ని లీజుకు తీసుకొని పార్చున్ పేరుతో హోటల్ నిర్వహిస్తున్నాడు. గత నెల 19న అదే హోటల్‌లో వ్యభిచారం నిర్వహిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు అనంతరం పార్చున్ హోటల్‌కు సంబంధించిన వివరాలను హైదరాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారులు అందించారు. దీంతో హైదరాబాద్ ఆర్డీవో, రెవెన్యూ అధికారులు శుక్రవారం ఆబిడ్స్ పోలీసుల సహకారంతో పార్చున్ హోటల్‌ను సీజ్ చేశారు.

## ఈ వేసవిలో వంద శాతం నీరు సరఫరా చేయాలి

హైదరాబాద్ సిటీ, జనవరి2 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్లను వీలైనంత తొందరగా పూర్తి చేసి.. ఈ వేసవిలో వంద శాతం నీరు సరఫరా చేయాలని వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టులో రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కిస్మత్ పూర్, మంచిరేవుల, బైరాగీ గూడ, గంధం గూడ, బృందావన్ కాలనీ, ఎర్రకుంట అభ్యుదయ నగర్, గండిపేట్‌లలో నిర్మాణం పూర్తి చేసుకున్న పలు రిజర్వాయర్లను పరిశీలించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రవికుమార్, సీజీఎం టీవీ శ్రీధర్, అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్టీసీకి రూ. 21 కోట్ల ఎగనామం

● నిందితుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): టీఎస్ ఆర్టీసీకి వ్యాపార ప్రకటనల కాంట్రాక్టు సొమ్ము ఎగ్గొట్టిన కాంట్రాక్టర్‌ను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ బాబూరావు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ చింతల్‌కు చెందిన వద్దాను సునీల్ 'గో రూరల్ ఇండియా ప్రై.లిమిటెడ్' పేరుతో అడ్వర్టైజింగ్ ఏజెన్సీ నడుపుతున్నాడు. టీఎస్ ఆర్టీసీలో ప్రకటనల స్పేస్ కాంట్రాక్టుకు తీసుకున్నాడు. దీని నిమిత్తం హైదరాబాద్ రీజియన్‌కు రూ. 10,74,89,006, సికింద్రాబాద్ రీజియన్‌కు రూ. 10,97,38,389 కాంట్రాక్టు సొమ్ము చెల్లించాల్సి ఉంది. వాటిని ఎగ్గొట్టడంతో ఆర్టీసీ అధికారులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

## డీజీ100 జాబితాలో జేఎన్‌టీయూకు చోటు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా టెక్నాలజీ ప్రభావిత (డీజీ100) సంస్థల జాబితాలో జేఎన్‌టీయూ స్థానం దక్కించుకుందని న్యూఢిల్లీకి చెందిన సంస్థ ప్రతినిధులు తెలిపారు. గత డిసెంబర్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించిన సమావేశంలో టాప్ 100 సంస్థల జాబితాను రూపొందించామని, అందులో ఐఐటీ మద్రాస్, మణిపాల్ యూనివర్సిటీ, వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి ప్రతిష్ఠాత్మకం సంస్థలతో పాటు జేఎన్‌టీయూ ఎంపికైందన్నారు. ఈ మేరకు వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావును కలిసి జ్ఞాపికను అందజేసినట్లు డీజీసంస్థ ప్రతినిధులు షాజిల్ అహ్మద్, సురేశ్‌బాబు తెలిపారు.

## కమిటీ లేదు..

(5వ పేజీ తరువాయి)

కొత్త సభ్యులను ఎన్నుకోవాల్సి ఉన్నా.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పెండింగ్‌లో ఉంచారు. డిసెంబర్ 5వ తేదీన ఎన్నికల ప్రవర్తనా నియామవళి ముగిసినా ఇప్పటి వరకు కమిటీ ఎన్నిక దిశగా అడుగులు పడలేదు. నెల క్రితమే కార్యదర్శి కార్యాలయం ఎన్నికల నిర్వహణకు సంబంధించి కమిషనర్‌కు ఫైల్ పంపినట్టు తెలిసింది. నోటిఫికేషన్ జారీపై రోనాల్డ్‌రోస్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. స్టాండింగ్ కమిటీ ఎన్నిక జరగకపోవడంతో 2024-25 ఆర్థిక సంవత్సరం ముసాయిదా బడ్జెట్‌పైనా చర్చ జరుగలేదు. మూడు నెలలకోమారు జరగాల్సిన కౌన్సిల్ సమావేశమూ గతేడాది ఆగస్టులో నిర్వహించారు. ఆరు నెలలైనా.. మీటింగ్ ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడైనా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందన్న ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేందుకు కనీసం రెండు నెలల సమయం పడుతుంది. ఆ లోపు స్టాండింగ్ కమిటీ ఎన్నిక, కౌన్సిల్ సమావేశం జరుగుతుందా..? అన్నది చర్చనీయాంశంగా మారింది.

# మురుగు పరుగులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగు పరుగులు తీస్తోంది. మురుగు నిర్వహణ చేపట్టే జెట్టింగ్, మినీ ఎయిర్‌టెక్ మిషన్లు రెండు రోజులుగా ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో మురుగు సమస్యలు నగరంలో పెరిగాయి. గ్రేటర్ పరిధిలో ప్రతీ రోజు మురుగు నిర్వహణ చేపట్టిన కానీ పలు ప్రాంతాల్లో వీధులన్నీ అధ్వాన్నంగా మారుతుండగా, తాజాగా నిర్వహణ నిలిచిపోవడంతో మురుగు సమస్యలు తాండవిస్తున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ పొంగిపోర్లుతున్నాయి. రోడ్లు, వీధుల్లో ప్రవహిస్తుండడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలంటూ వాహనాలను నిలిపివేసిన సీవరేజ్ క్లినింగ్ మిషిన్స్ ఓనర్స్ అసోసియేషన్‌తో వాటర్‌బోర్డు అధికారులు ఇప్పటికీ చర్చలు జరపలేదు. దాంతో సమస్యలు పరిష్కారమయ్యేంతా వరకు విధుల్లో చేరేది లేదంటూ అసోసియేషన్ నేతలు భీష్మించారు.గ్రేటర్ హైదరాబాద్‌లో మురుగు నిర్వహణ అత్యంత కీలకమైంది. మురుగు నిర్వహణ సక్రమంగా లేకపోతే వీధుల్లో సీవరేజ్ పరుగులు తీయనుంది. ప్రతీ రోజు గ్రేటర్ హైదరాబాద్‌లో దాదాపు 1500లకు పైగా మురుగు ఓవర్‌ఫ్లో సమస్యలు వాటర్‌బోర్డుకు ఫిర్యాదులు వస్తాయి. వాటి ఆధారంగానే జెట్టింగ్, మినీ ఎయిర్‌టెక్ మిషన్లు ఎక్కడికక్కడే పరిష్కారం చేస్తాయి. రెండు రోజులుగా సీవరేజ్ నిర్వహణ నిలిచిపోవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో సీవరేజ్ సమస్యలు తలెత్తాయి. మురుగుతో వీధులన్నీ దుర్గంధంగా మారడంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా ప్రాంతాల నివాసితులు ఇంటి డోర్ తీసేందుకు జంకుతున్నారు. దుర్వాసన వస్తుండడంతో ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో సీవరేజ్ సమస్యలు పరిష్కారం చేయకపోతే రోగాలు అలుముకునే ప్రమాదమున్నది. వాటర్‌బోర్డు ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టాలని నగరవాసులు విజ్ఞప్తులు చేస్తున్నారు. శుక్రవారం వాటర్‌బోర్డు కాల్ సెంటర్ 155313కు దాదాపు 2వేల వరకు ఫిర్యాదులు వచ్చినట్లు.. అందులో సీవరేజ్ ఓవర్‌ఫ్లో సమస్యలే అధికంగా ఉన్నట్లు తెలిసింది.



గెజిటెడ్ - 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ కె.అశోక్ రెడ్డి, తదితరులు

## గుర్తింపు తెచ్చేలా అధికారులు పనిచేయాలి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సమాచారశాఖ శాఖకు మంచి గుర్తింపు తీసుకువచ్చేలా అధికారులు పనిచేయాలని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ కె.అశోక్ రెడ్డి అన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్-2024ను సమాచారశాఖ కార్యాలయం బోర్డు రూంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది శాఖ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు కిషోర్ బాబు, సంయుక్త సంచాలకులు డి.ఎస్.జగన్, డి.శ్రీనివాస్, కె.వెంకటరమణ, ఎన్.వెంకటేశ్వర రావు, ముర్తూజ, రాధాకిషన్, సీఈఈ ఉప సంచాలకులు ఎస్.ఎ.హాష్మీ, ఎం.మధుసూదన్, వై.వెంకటేశ్వర్లు, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు డి.జితేందర్, కార్యదర్శి కె.అనిల్‌కుమార్, ట్రెజరర్ టి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు జి.శ్రీలతాదేవి, ఉమేష్ బాజ్పేయి, జాయింట్ సెక్రటరీస్ ఎం.మీనాక్షి, ఆర్.నరేష్, సి.నాగరాజు, పబ్లిసిటీ సెక్రటరీ వి.ఇందిర, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.రాజ్ కుమార్, ఎం.ఎ.మాజీద్‌లు పాల్గొన్నారు.

## 4న ఆర్టీసీ టీఎంయూ సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అటు యాజమాన్యం, ఇటు ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపే అంశంపై చర్చించేందుకు ఈ నెల 4న ఆర్టీసీ కార్మిక ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలంగాణ మజ్దూర్ యూనియన్(టీఎంయూ) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి తెలిపారు. ఎల్బీ నగర్ హిమగిరి గార్డెన్స్‌లో జరిగే సమావేశంలో ప్రొఫెసర్ కోదండరామ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని వివరించారు. టీయూఎంయూ రాష్ట్ర నాయకులు, సి సి ఎస్ ఎం సి మెంబర్స్, జోనల్, డివిజన్ రీజియన్, డిపో అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజీ కార్యదర్శులు, సిసిఎస్ ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు.

## "అన్‌మాస్క్ కేన్సర్"ను ప్రారంభించిన అపోలో ఆస్పత్రి



"అన్‌మాస్క్ కేన్సర్"ను ప్రారంభించిన అపోలో ఆస్పత్రి డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ డా.విజయ్ ఆనంద్‌రెడ్డి, డా.జగదీశ్వర్ గౌడ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేన్సర్‌ను జయించిన తర్వాత జీవితాన్ని అర్థవంతమైన అన్వేషణలో ముందుకు తీసుకువెళ్లేందుకు, అపోహాలను తొలగించేందుకు సమాజంలో సానుభూతిని పెంచడానికి "అన్‌మాస్క్ కేన్సర్" సెంటర్లను ప్రారంభించినట్లు అపోలో ఆస్పత్రి డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ డా.విజయ్ ఆనంద్‌రెడ్డి అన్నారు. కేన్సర్‌ను జయించిన వారి అనుభవాలు, నైపుణ్యాలు, అర్హతలను తెలియచేస్తూ కేన్సర్‌పై ఉన్న అపోహలు, భయాలను 'అన్‌మాస్క్ కేన్సర్' తొలగిస్తుందన్నారు.

## వాయు కాలుష్యం నియంత్రణకు చర్యలు తీసుకోండి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా రోగ్యంపై ప్రభావం చూపుతోన్న వాయు కాలుష్యం నియంత్రణకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్‌లోని పీసీబీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వాయు కాలుష్యం- విపరిణామాలపై చర్చించారు.

## కుమార్తె వరసైన యువతిపై అత్యాచారం

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఓ లాడ్జి గదిలో డైరెక్టర్ ఉన్నాడు.. వెబ్ సిరీస్‌లో మంచి అవకాశం వస్తుంది రమ్మని కుమార్తె వరసైన యువతిని లాడ్జికు తీసుకువెళ్లి అత్యాచారం చేసిన ప్రబుద్ధుడిపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ఏలూరు ప్రాంతానికి చెందిన జి.కృష్ణారావు నగరంలో లోన్ ఏజెంట్‌గా పని చేస్తు లింగంపల్లిలో భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నాడు. కృష్ణాజిల్లాకు చెందిన ఓ మహిళ మూసాపేటలో నివాసం ఉంటుంది. ఆమె భర్త చనిపోవడంతో కొడుకు, కూతురుతో కలిసి ఉంటోంది. ఐతే కృష్ణారావుకు ఓ రైలు ప్రయాణంలో ఆ మహిళతో పరిచయం ఏర్పడింది. ఆమెను నమ్మించి 2016లో పెళ్లి చేసుకున్నాడు. అనంతరం వీరి మధ్య గొడవలు మొదలయ్యాయి. అయినప్పటికీ కృష్ణారావు తరచుగా ఆ మహిళ ఇంటికి వస్తూ పోతూ ఉంటే ఆమె కుమార్తెతో చనువుగా ఉంటూ సినిమా, సీరియల్స్, వెబ్ సిరీస్‌ల గురించి ప్రస్తావిస్తూ నటించేందుకు అవకాశం కల్పిస్తానని నమ్మించాడు. తండ్రి వరసయ్యే కృష్ణారావు మాటలను ఆ యువతి నమ్మింది. గురువారం రాత్రి స్థానికంగా ఉన్న ఓ లాడ్జిలో వెబ్‌సిరీస్ డైరెక్టర్ ఉన్నాడు.. కలిసి వద్దాం.. మంచి అవకాశం వస్తే నీకు మంచి గుర్తింపు వస్తుందని తీసుకువెళ్ళాడు. అక్కడకు వెళ్లిన తరువాత అతని అసలు రంగు బయటపెట్టి కూతరు వరసయ్యే ఆ యువతిపై అత్యాచారం చేశాడు. దీంతో నిర్ఘాంతపోయిన ఆ యువతి ఇంటికి వచ్చాక తన తల్లికి జరిగిన విషయం తెలిపింది. దీంతో తల్లి కూతురు ఇద్దరు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అ ప్రబుద్ధిడిపై అత్యాచారం, ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దరఖాస్తుకు గడువు ఫిబ్రవరి 21

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బి.ఎడ్ (ఒ.డి.ఎల్) అర్హత పరీక్ష 2023-24కు నోటిఫికేషన్ విడుదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 21 చివరి తేది అని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి డా.పి.వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పరీక్షకు రెండు రోజుల ముందు హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఇతర వివరాలకు www.braou.ac.in, www.braouonline.inలో సంప్రదించవచ్చని తెలిపారు.

## జీవో 55 రద్దు కోరుతూ వ్యవసాయ వర్సిటీ బంద్

(5వ పేజీ తరువాయి)

మధ్యాహ్నం 3 గంటలకు వర్సిటీలో పాలకమండలి సమావేశం నిర్వహించి 100 ఎకరాలను హై కోర్టుకు కేటాయించేందుకు నిర్ణయం తీసుకోనున్నారనే సమాచారం రావడంతో విద్యార్థులు వర్సిటీ బంద్‌కు ఆకస్మిక పిలుపు నిచ్చారు. ఉదయమే వ్యవసాయ కళాశాల గేటుకు తాళం వేసి విద్యార్థులను, అధ్యాపకులను, ఉద్యోగులను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. బీఎస్సీ అగ్రికల్చరల్ సెకండ్ ఇయర్ ఫైనల్ పరీక్షలు ఉండగా అధ్యాపకులను బయటకు పంపించి వేసి వాటిని కొద్దిసేపు అడ్డుకున్నారు. ఆ తర్వాత విద్యార్థులు పరీక్షలను రాశారు. వ్యవసాయ కళాశాల గేటు ఎదుట, పరీక్షాల నిర్వహణ కేంద్రం వద్ద, వర్సిటీ పరిపాలనా భవనం వద్ద బైఠాయించి వ్యవసాయ విశ్వవిద్యాలయం భూములను హై కోర్టుకు ఇవ్వవద్దని నినాదాలు చేశారు. నిరసన చేపడుతున్న విద్యార్థులకు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులతోపాటు ఆ పార్టీ నాయకుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు సంఘీభావం తెలుపుతూ నిరసనలో పాల్గొన్నారు. నిరసనలో విద్యార్థి సంఘాల నాయకులు రాజ్‌కుమార్, మీసాల శ్రీజ, సురేందర్, దీక్షిత్, విక్రమ్, అరవింద్, వంశీధర్‌రెడ్డి, సత్యమూర్తి, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకమండలి సమావేశం వాయిదా ?

విద్యార్థుల నిరసనల కారణంగా పాలకమండలి సమావేశం వాయిదా పడినట్లు తెలిసింది. సాయంత్ర ఆరు గంటల వరకు వర్సిటీ రిజిస్ట్రార్‌తోపాటు పాలకమండలి సభ్యులు రాజేంద్రనగర్‌లోనే ఉండటం, పాలకమండలి చైర్మన్, ఇన్‌చార్జీ వీసీ ఎం.రఘునందన్‌రావు రాకపోవడంతో సమావేశం జరుగలేదనే తెలిసింది.

## రేపు పాలస్తీనా సంఘీభావ సభ

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనా ప్రజలకు ప్రపంచమంతా అండగా ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఫిబ్రవరి 4న పాలస్తీనా సంఘీభావ సభను హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా హాజరవుతారని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 3 ఫిబ్రవరి 2024



# రోగాలను జయించే దబ్బ

సైంధవార్ద్రక సంయుక్తం బీజ పూర కమత్తి యః!
శాకినీభిరివాకృష్టం విశత్యుదరమోద నమ్!!

దబ్బపండుని 'మాతులుంగ, బీజ పూర' అని పిలుస్తారు. 'సిట్రస్ మెడికా' వృక్షనామం. చూపులకు పెద్ద కాయలా కనిపిస్తుంది. కానీ, మందపాటి తోలు, లోపల చిన్నపాటి తొనలూ ఉంటాయి. దీని తోలు, గింజలు, తొనలు వైద్యానికి పనికొస్తాయి. పేగుల్లో వచ్చే వ్యాధుల్లో దీని ప్రయోగం ఎక్కువ. మొలల వ్యాధిలో ఇది ప్రముఖమైన ఔషధం కూడా.

దబ్బపండు తోలు ముడతలుగా, గరుకుగా ఉంటుంది. పుల్లనిదైనప్పటికీ వేడినీ, వాతాన్నీ, కఫాన్ని తగ్గిస్తుంది. సి-విటమిన్‌కు పుట్టిల్లు. వండితే సి-విటమిన్ ఎగిరిపోతుంది. వేడి తగలకుండా దీంతో వంటకాలు చేసుకోవాలి.

బాగా పండిన దబ్బనే ఆహార ప్రయోజనాలకు వాడాలి. వాంతి, వికారాలను తగ్గించే ఔషధ ద్రవ్యాలలో ఇది ప్రముఖమైంది. కడుపులో నొప్పిని, అరుచిని, మలబద్ధకాన్ని నివారించి, విరేచనం అయ్యేలా చేస్తుంది. అజీర్తి సమస్యలన్నిటికీ ఇది నివారకమే. దబ్బ రసం ఇస్తే మద్యం మైకం దిగిపోతుంది. ఆగకుండా వచ్చే ఎక్కిళ్లు ఆగుతాయి. దగ్గు, ఆయాసం తగ్గుతాయి. మొలల వ్యాధిలో విరేచనం అయ్యేలా చేసి, నొప్పిని, రక్తస్రావాన్ని ఆపుతుంది.



పులుపుతో కూడిన ఆహార పదార్థాల్ని వాతవ్యాధులున్న వారికి నిషేధం అని చెప్పినా, దబ్బపండుకి వాతాన్ని, కఫాన్ని తగ్గించే గుణం ఉంది. చర్మానికి మంచిది. మంచి రంగునిస్తుంది. ముఖం మీద ముడతలు తగ్గుతాయి.

దీని తోలుని పారేయనవసరంలేదు. కఫాన్ని, వాతాన్ని తగ్గించే ద్రవ్యమే ఇది. కడుపులో పెరిగే నులిపురుగుల్ని చంపి బయటకు వెళ్లగొట్టే గుణం దీనికుంది. ఔషధాలకే కాదు, ఆహార పదార్థాల తయారీకి కూడా దబ్బపండు తొనలు, దూది భాగము, దాని పైనుండే తోలూ ఉపయోగిస్తాయి. దబ్బ పండ్లు ఎముక పుష్టినిస్తాయి. కండరాలు బలసంపన్నం అవుతాయి. కిడ్నీ, లివర్లను శక్తిమంతం చేస్తాయి. గుండెకు టానిక్‌లాగా పని చేస్తాయి. కండరాలు శుష్కించిపోయే వ్యాధిలో ఇది ఉపయోగపడుతుంది.

దబ్బ రసంతో తయారయ్యే ఆయుర్వేద ఔషధాలలో మాదీఫల రసాయనం, ధాత్రీ రసాయనం ముఖ్యమైనవి. గర్భవతుల్లో కలిగే వాంతులు, వికారాలు తగ్గిస్తుంది. పేగులకు ఇది టానిక్. ఇమ్యూనిటీ బూస్టర్ కూడా. బస్సు పడని వారికి వాంతి కాకుండా ఆపుతాయి.

దబ్బ పండును ఒక కూరగాయగా కూడా దీన్ని వాడుకోవచ్చు.

దబ్బపానీయం: దబ్బ తొనల్ని వలిచి, కొద్దిగా సైంధవలవణం, అల్లం రసం కలిపి, కొద్దిసేపు ఉంచితే తొనల లోపల ముత్యాల నుంచి రసం బాగా ఊరుతుంది. దీన్ని తాగితే రోగాలను జయించటం తేలిక అంటాడు క్షేమశర్మ. ఇది కఫవాతాల్ని హరించి జఠరాగ్నిని పెంచుతుంది. గుండెకు మేలు చేస్తుంది. లివర్, స్ప్లీను లాంటి అవయవాలలో కలిగే వాపు, కడుపునొప్పిని తగ్గిస్తుంది. మొలల వ్యాధితో బాధపడే వారికి మంచిదన్నాడు.

దబ్బపప్పు: ఉడికించిన ముద్దపప్పు చల్లారాక దబ్బరసం కలిపి, తాలింపు పెట్టుకుంటే ఈ పప్పు కమ్మగా ఉంటుంది. ఆరోగ్యానికి మంచిది.

**దబ్బ పండును వానాకాలంలో సైంధవ లవణంతోనూ, వసంత కాలంలో పంచదారతోనూ, చలికాలంలో ఉప్పు, అల్లం, ఇంగువతోనూ, వేసవి కాలంలో బెల్లంతోనూ కలిపి తీసుకోవాలని క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం'లో సూచించాడు. దబ్బ పండు శాకినీ డాకినీల్లా రోగాల్ని జయిస్తుందంటాడు క్షేమశర్మ.**

దబ్బ పులిహోర: చింతపండు రసానికి బదులుగా దబ్బరసం కలిపి, పులిహోర తాలింపు పెడితే రుచికరంగా ఉంటుంది. చింతపండు పులిహోర కన్నా ఇది మేలైనది. కొద్దిగా ఆవపిండి, మెంతిపిండి కూడా కలిపితే కమ్మగానూ, మేలుచేసేదిగానూ ఉంటుంది.

దబ్బకారం: ఓ బాండీలో కొంచెం నూనె వేసి, అందులో తగినన్ని ఎండుమిర్చి, తాలింపు గింజల్ని వేగించి మెత్తగా నూరాలి. అందులో ఉప్పు, దబ్బ రసం కలిపితే దబ్బకారం లేదా దబ్బ పచ్చడి తయావుతుంది. దీని తొనలో ఉండే ముత్యాలను నలిపేయకుండా అలానే కలిపితే... కంటికి ఇంపుగా, రుచికరంగా ఉంటుంది. టిఫిన్లలోకి నంజుకోవటానికి బావుంటుంది.

దబ్బ ఊరగాయ: దబ్బను తోలుతో సహా ముక్కలుగా తరిగి, ఉప్పు, పసుపు వేసి మూడు రోజులు ఊరనివ్వాలి. మూడో రోజున తగినంత కారం, మెంతి పిండి కలిపి ఒక సీసాలో భద్రపరచుకోవాలి. కావల్సినప్పుడు కొద్దిగా ఇవతలికి తీసి ఇంగువ తాలింపు పెట్టుకుంటే కమ్మగా ఉంటుంది. దబ్బ రసానికి చెప్పిన గుణాలన్నీ దబ్బ ఊరగాయకీ ఉంటాయి.

• గంగరాజు అరుణాదేవి

మేకప్

# పొడి చర్మం, చమక్కు

ఒకే రకమైన మేకప్ అందరికీ నప్పదు. చర్మ తత్వాన్ని బట్టి మేకప్ సామాగ్రి, దాన్ని అప్లై చేసుకునే మెలకువలను అనుసరించాలి. పొడి చర్మం కలిగిన వాళ్లు ఇవిగో ఈ మేకప్ టిప్స్ పాటించాలి.

**ఎక్స్‌ఫోలియేట్:** ఫౌండేషన్‌తో పాటు ఇతరత్రా మేకప్ ఉత్పత్తులు పొడి చర్మం పైన చక్కగా ఇమిడిపోలేవు. కాబట్టి పొడి చర్మ తత్వం కలిగిన వాళ్లు చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేసి, నునుపుగా మార్చుకోవాలి. ఇందుకోసం ఉపయోగించే స్క్రబ్ చర్మానికి హాని కలిగించనిదై ఉండాలి.

**హైడ్రేటింగ్ సీరం:** చర్మానికి తేమను అందించి, మేకప్‌కు అనువుగా మార్చడం కోసం తప్పనిసరిగా హైడ్రేటింగ్ సీరం వాడుకోవాలి. ఈ సీరంను క్రమం తప్పక వాడితే, చర్మంలో జీవకళ ఉట్టిపడడంతో పాటు, సుతిమెత్తగా, కాంతివంతంగా తయారవుతుంది.

**ఫేస్ ప్రైమర్:** ఫౌండేషన్ అప్లై చేసే ముందు ముఖానికి ప్రైమర్ పూసుకోవాలి. ఇలా చేయడం వల్ల మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కు చెదరకుండా ఉంటుంది. అలాగే చర్మంలోని తేమ తరిగిపోకుండా కాపాడుతుంది.

**ఫౌండేషన్ ఫార్ములా:** చర్మానికి తేమనందించే, ద్రవరూప ఫౌండేషన్‌ను మాత్రమే వాడుకోవాలి. అతిగా మ్యాట్ తత్వం కలిగి ఉండే ఫౌండేషన్‌తో చర్మం మరింత పొడిబారుతుంది. క్రీమ్ రూపంలో ఉండే ఫౌండేషన్ వాడాలనుకుంటే, చర్మంలో ఇంకిపోయి, చర్మపు రంగులో కలిసిపోయేలా ఉండే నాణ్యమైన లిక్విడ్ ఫౌండేషన్‌నే ఎంచుకోవాలి.

**మేకప్ స్పాంజ్:** బ్లష్, ఐ షాడో లాంటి టార్గెటెడ్ అప్లికేషన్స్‌కు బ్రష్‌లే అనువుగా ఉన్నప్పటికీ, పొడి చర్మం కలిగిన వాళ్లు ఫౌండేషన్ అప్లికేషన్ కోసం తడిపిన స్పాంజ్‌ను ఉపయోగించడమే మేలు. తడి స్పాంజితో చర్మానికి అదనపు హైడ్రేషన్ కూడా దక్కుతుంది. అలాగే చర్మపు ముడతల్లో, గీతల్లో మేకప్ ఇరుక్కుపోకుండా ఉండాలంటే తడి స్పాంజ్‌తోనే ఫౌండేషన్ వేసుకోవాలి.

**పౌడర్:** పొడి చర్మానికి పౌడర్లు నప్పవు. అయితే మేకప్ సెట్ చేయడం కోసం అద్దుకునే పౌడర్ లైట్ వెయిట్ పౌడర్ అయి ఉండేలా చూసుకోవాలి.



వంటిల్లు



**రక్తహీనత ఎక్కువశాతం స్త్రీలు, తక్కువ మోతాదులో పురుషులు బాధపడే వ్యాధి. పీసీఓడీ, పీసీఓఎస్, విటమిన్ లోపం, నీరసం.. లాంటివన్నీ రక్తహీనత వల్లనే. కొన్ని బీట్‌రూట్ రైస్, దానిమ్మ పచ్చడి, పాలకూర కూర.. వంటలు తింటే రక్తహీనత తగ్గుముఖం పడుతుంది. ఆ వంటలే ఇవి..**

# రక్తహీనతకు చెక్

## బీట్‌రూట్ రైస్

**కావాల్సిన పదార్థాలు**

ఆవాలు- అర టీస్పూన్, జీలకర్ర- అర టీస్పూన్, మినప్పప్పు- 1 టీస్పూన్, శనగపప్పు- 1 టీస్పూన్, పసుపు- అర టీస్పూన్, ఉప్పు- ఒకటిన్నర టీస్పూన్, కారం-1 టీస్పూన్, జీడిపప్పు- 2 టేబుల్ స్పూన్లు, నూనె- 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర- 1 కట్ట, కరివేపాకు- కొద్దిగా, బీట్‌రూట్ -150 గ్రాములు, బియ్యం లేదా మిల్లెట్ రైస్- 250గ్రాములు, గరం మసాలా- పావు టీస్పూన్, నిమ్మరసం- 1 (మీడియం సైజ్), బ్రెడ్ ముక్కలు-10 క్యూబ్స్ (వేయించినవి)

**తయారీ విధానం**

ప్యాన్‌లో నూనె వేడికాగానే ఆవాలు, జీలకర్ర, మినప్పప్పు, పచ్చి శనగపప్పు, కరివేపాకుతో పోపు వేసి కొత్తిమీర కలిపి.. వేగగానే కొద్దిగా జీడిపప్పు కూడా వేసి వేయించాలి. తురిమి పెట్టుకున్న బీట్‌రూట్‌ను కూడా వేసి అన్నీ కలుపుతూ రెండు నిముషాల పాటు కుక్ చేస్తే మగ్గుతాయి. పసుపు, ఉప్పు, కారం, బీట్‌రూట్‌కు సరిపడ వేసి ఉడికి చల్లారిన రైస్‌ను యాడ్ చేసి మొత్తం ఒకసారి కలిపాక.. మిగతా ఉప్పు, కారం కూడా కలిపి గరం మసాలా వేసి అన్నీ కలిపి మరికొంత కొత్తిమీర యాడ్ చేసి స్టవ్‌ను ఆఫ్ చేసుకోవచ్చు. వేయించిన బ్రెడ్ ముక్కలతో పాటు నిమ్మరసం చల్లుకోవాలి.

## పాలకూర కూర

**కావాల్సిన పదార్థాలు**

ఎండుమిర్చి- 8, కరివేపాకు- గుప్పెడు, జీలకర్ర- 1 టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయ-1 (మీడియం సైజ్), పచ్చిమిర్చి- 4, ఆవాలు- అర టీస్పూన్, జీలకర్ర- అర టీస్పూన్, వెల్లుల్లి- 4 రెబ్బలు, నూనె- 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు- 1 టీస్పూన్, పసుపు- పావు టీస్పూన్, పాలకూర- పది ఆకులు



**తయారీ విధానం**

ముందుగా పాలకూరలోకి పొడిని సిద్ధం చేసుకోవాలి. మీరు తినే కారంకి అనుగుణంగా కొద్దిగా నూనెలో ఎండుమిర్చి, కరివేపాకు, జీలకర్రను వేయించి పొడి చేసి ఉంచుకోవాలి. కడాయ్‌లో ఆయిల్ తీసుకుని ఆవాలు, జీలకర్ర, వెల్లుల్లి పోపు వేశాక.. ఉల్లిపాయ పచ్చిమిర్చి వేసి బాగా వేయించి పాలకూరను వేసి, 4 నిముషాల పాటు కలిపి మగ్గించాలి. పసుపు, ఉప్పు కూడ వేసి మరొక 4 నిముషాల పాటు వేయించాలి. స్టవ్ కట్టేసి ముందుగా సిద్ధం చేసుకున్న కారంపొడిని కలిపి.. మరొక రెండు నిముషాలు మూతపెట్టి అలానే ఉంచి దించేయాలి. అద్భుతమైన రుచితో ఘుమఘుమలాడే పాలకూర కూర సిద్ధం.



## దానిమ్మ పచ్చడి

**కావాల్సిన పదార్థాలు**

దానిమ్మ గింజలు- 200 గ్రాములు, పచ్చిమిర్చి- 10, ఉప్పు- ఒకటి ముప్పావు టీస్పూన్, పసుపు- పావు టీస్పూన్, ఇంగువ- చిటికెడు, జీలకర్రపొడి- 1 టీస్పూన్, పంచదార- ఒకటిన్నర టీస్పూన్, కరివేపాకు- కొద్దిగా, వేయించి దంచిన నువ్వుల పొడి- 40 గ్రాములు, నూనె- 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర- 1 కట్ట, ఆవాలు- అరటీస్పూన్, జీలకర్ర- అరటీస్పూన్, మినప్పప్పు- అరటీస్పూన్, శనగపప్పు- అరటీస్పూన్

**తయారీ విధానం**

ముందుగా మిక్సీలో దానిమ్మ గింజలు, పచ్చిమిర్చి, ఉప్పు, పసుపు, ఇంగువ, జీలకర్ర, పంచదార, కరివేపాకు వేయించి దంచిన నువ్వుల పొడి, కొత్తిమీర వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి. మరీ పేస్ట్‌లా వద్దు. అటుపై నూనె లేదా నెయ్యిలో ఆవాలు, జీలకర్రపొడి, మినప్పప్పు, శనగపప్పుతో తాలింపు చేయాలి. కొత్తిమీరతో గార్నిష్ చేసుకుని భేషుగ్గా వడ్డించాలి.



శైలజ
సైలాస్ కిచెన్,
యూట్యూబ్ ఛానల్
asksailaw@gmail.com

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/dvvhzfB లో చదవండి.

## ఈ ప్రొటీన్ ఫుడ్.. మంచిదే!

మంచి ప్రొటీన్ ఫుడ్ తింటే కండ గట్టిగా ఉంటుంది. అంతేనా... కణజాల వ్యవస్థను నిర్మించటానికి, ఎంజైమ్‌ల ఉత్పత్తికి దోహదపడుతుంది. కండరాలతో పాటు ఎముకలు, చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రొటీన్ ఫుడ్ తినటం అవసరం.

- ప్రొటీన్ అంటేనే మనకు గుర్తొచ్చేది కోడి గుడ్లు. ఒక్క కోడి గుడ్డులోని తెల్లసొనలో నాలుగు గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. పచ్చసొనతో పోలిస్తే తెల్లసొనలో మంచి ప్రొటీన్ ఉంటుంది.
- సాల్మన్ చేపల్లో 22 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఇవి తినటం వల్ల శరీరంలో కొవ్వు పెరగదు.
- ఇరవై ఎనిమిది గ్రాముల ఆల్మండ్స్‌లో ఆరు గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. అందుకే వీటిని ప్రతిరోజూ రాత్రి నానబెట్టి కనీసం రెండు లేదా మూడు ఆల్మండ్స్‌ను తినటం మంచిది. జీడిపప్పును కూడా తింటే ప్రొటీన్లు శరీరానికి అందుతాయి.
- పాలు, పెరుగు, వెన్నల్లో కూడా ప్రొటీన్ ఉంటుంది. అందుకే పిల్లలయినా, పెద్దలయినా పాల ఉత్పత్తులను తినటం మంచిదే.
- చికెన్, మటన్‌లో కూడా హై ప్రొటీన్స్ ఉంటాయి. అయితే వీటితో పాటు శాకాహారంలో కూడా మంచి ప్రొటీన్లు ఉంటాయి. అవే గుమ్మడి గింజల్లో మంచి ప్రొటీన్లు ఉంటాయి. వంద గ్రాముల వేరుశనగల్లో 25 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.
- సోయా ఉత్పత్తులైన సోయా పాలు, సోయా పెరుగు, సోయా బీన్స్‌లో ప్రొటీన్ల శాతం ఎక్కువే.
- వంద గ్రాముల పనీర్‌లో 18 గ్రాములు ప్రొటీన్లు ఉన్నాయి. సన్‌ఫ్లవర్ విత్తనాలు కూడా ప్రొటీన్లు కలిగి ఉంటాయి.
- నూనెలో వేయించిన చీజ్, బటర్‌ను తినకూడదు. ప్రొటీన్లు అధికంగా తింటే కొవ్వు పదార్థాలు వచ్చి గుండె సంబంధ వ్యాధులు వస్తాయనే మాట అపోహ మాత్రమే. అయితే మరీ మితిమీరి ప్రొటీన్ ఫుడ్ తినొద్దు. ప్రొటీన్ ఫుడ్ తీసుకున్నాక సరైన వ్యాయామం చేయాలి. దీని వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.



సెలబ్ ఫిట్

**కంగనా రనౌత్...**
**ఆ పేరే ఒక బ్రాండ్...**
**చిత్రసీమలో అయినా... రాజకీయాల్లో అయినా!**
**తన అద్భుతమైన నటనతో ఎంతలా ప్రేక్షకుల మనసు దోచుకుందో...**
**కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడి అంతే స్థాయిలో వివాదాలు కొనితెచ్చుకుంది.**
**పాత్ర కోరుకొంటే బరువు పెరగడానికైనా... తగ్గడానికైనా ఆమె ఎప్పుడూ సిద్ధం.**
**పదిహేడేళ్లకే తెరంగేట్రం చేసిన కంగనా... ఇప్పుడు ముప్పై ఆరేళ్ల వయసులోనూ ముగ్ధ మనోహరిలా ఆకట్టుకుంటోంది.**

# సహజ సౌందర్యం

'గ్యాంగ్‌స్టర్'తో హిందీ పరిశ్రమలో అడుగుపెట్టిన కంగనా... కొన్ని దక్షిణాది చిత్రాల్లోనూ నటించింది. కథ నచ్చితే భాష ఏదన్నది ఆమె పట్టించుకోదు. పదిహేడేళ్లకు షైబడిన కెరీర్... నాలుగు పదులు దాటిన సినిమాలు... వేటికవే ప్రత్యేకత గల పాత్రలు... నటిగా ఆమెను మరో స్థాయిలో నిలబెట్టాయి.



హిమాచల్‌ప్రదేశ్ మండి జిల్లాలోని భంబ్లా అనే చిన్న పట్టణంలో పుట్టిన కంగనా... చిన్నప్పటి నుంచి స్వతంత్ర భావాలతో పెరిగింది. ఆమె తండ్రి అమర్‌దీప్ రనౌత్ వ్యాపారవేత్త. తల్లి ఆశా ఉపాధ్యాయురాలు. తాత సర్జూసింగ్ రనౌత్ మాజీ ఎమ్మెల్యే. ఉమ్మడి కుటుంబం. కూతుర్ని డాక్టర్‌ను చేయాలన్నది తల్లితండ్రుల కోరిక. కానీ పన్నెండో తరగతి యూనిట్ టెస్ట్‌లో కెమిస్ట్రీలో పాస్ కాలేకపోయింది. దాంతో ఎంబీబీఎస్ చదవాలనే ఆలోచన విరమించుకుంది. ఒకరిపై ఆధారపడకూడదన్న ఆలోచనతో పదహారేళ్ల వయసులోనే ఢిల్లీకి వెళ్లింది. మెడిసిన్ వద్దనుకోవడం, ఆ వయసులో స్వతంత్రంగా జీవించాలనుకోవడం కంగన తల్లితండ్రులకు అస్సలు నచ్చలేదు. తన మాట కాదని ఇల్లు వదిలి వెళ్లిపోయినందుకు కూతురుకు ఎలాంటి సాయం అందించకూడదని అమర్‌దీప్ నిర్ణయించుకున్నారు.

కంగనా నివాసం ఢిల్లీకైతే మారింది కానీ... అప్పటికి ఏ కెరీర్ ఎంచుకోవాలనే స్పష్టత ఆమెకు లేదు. ఆమె రూపాన్ని చూసిన ఓ ఏజెన్సీ మోడలింగ్ చేయమని సలహా ఇచ్చింది. అలా కొన్ని ప్రాజెక్ట్‌లు చేసింది. అయితే అందులో సృజనకు అవకాశం లేదని మోడలింగ్ వదిలేసింది. నటన వైపు చూపు మళ్లింది. 'అస్మిత థియేటర్ గ్రూప్'లో చేరి, నటనలో ఓనమాలు నేర్చుకుంది. తరువాత గిరీష్ కర్నాడ్ తదితర ప్రముఖులు రచించిన పలు నాటకాల్లో నటించి, ప్రశంసలు అందుకుంది. ఢిల్లీకి వెళ్లినప్పటి నుంచి కంగనా ఎన్నో అవస్థలు పడింది. చాలీచాలని సంపాదన. బ్రెడ్, పచ్చడి... ఇవే చాలా రోజులు ఆమెకు ఆహారం. థియేటర్ ఆర్టిస్ట్‌గా పలు ప్రదర్శనలు ఇచ్చాక... కంగన మనసు సినిమాల వైపు మళ్లింది. ముంబయికి వెళ్లి, అక్కడ యాక్టింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకుంది. తొలి చిత్రంతోనే విమర్శకుల ప్రశంసలు అందుకున్న కంగనా... ఆ తరువాత వరుస అవకాశాలతో దూసుకుపోయింది. ఏడాదికి రెండు... మూడు... ఆరు సినిమాలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

పాత్ర ఏదైనా అందులో ఆమె లీనమైపోతుంది. తెర మీద దాన్ని పండించేందుకు ఎన్ని వ్యయప్రయాసలకైనా వెనకాడదు. కథ డిమాండ్ చేస్తే బొద్దుగా మారిపోతుంది... సన్నజాజి తీగలానూ మురిపిస్తుంది. అంతలా తన శరీరాన్ని సాన పెట్టింది.



'తలైవి' కోసం బరువు పెరిగిన ఆమె... రాబోయే 'ఏమర్జెన్సీ' కోసం జిమ్‌లో తీవ్ర కసరత్తులు చేసింది.

### వర్కవుట్ ఇలా...

'సహజ సౌందర్యవతి'గా బాలీవుడ్‌లో పేరు పొందిన కంగనా రనౌత్... దానికి తగ్గట్టుగానే శరీరాన్ని ఎప్పటికప్పుడు అదుపులో పెట్టుకుంటుంది. తినే తిండి విషయంలో జాగ్రత్తలు ఎన్నో పాటిస్తుంది. వారానికి కనీసం ఐదు రోజులు జిమ్‌కు వెళుతుంది. వ్యక్తిగత ట్రైనర్ లీనా మోర్గే పర్యవేక్షణలో కఠోర వ్యాయామాలు చేస్తుంది. వీటిల్లో కార్డియో మొదలు యోగా వరకు అన్నీ ఉంటాయి. కేవలం యోగా కోసమే రోజూ ముప్పావు గంట కేటాయిస్తుంది ఈ భామ. చివరగా పది నిమిషాల ధ్యానంతో ముగిస్తుంది. ఒకవేళ రెగ్యులర్ వర్కవుట్స్‌తో బోర్ కొడితే డ్యాన్స్‌తో కేలరీలు కరిగిస్తుంది.

- రోజూ ఉదయం రన్నింగ్. కుదిరినప్పుడల్లా పర్వత ప్రాంతాల్లో పరుగెడుతుంది.
- జిమ్‌లో గంటలతరబడి గడుపుతుంది. కార్డియోతో పాటు పుల్‌అప్స్, పుషప్స్, స్క్వాట్స్, వెయిట్ ట్రైనింగ్ ఉంటాయి.
- కంగనా ఫిట్‌నెస్ ట్రైనింగ్‌లో యోగా కూడా భాగం. తన శరీరానికి యోగా కీలకమని ఆమె భావిస్తుంది. క్లిష్టమైన ఆసనాలు సులువుగా వేయగలదు.
- మానసిక ప్రశాంతత, ఏకాగ్రత కోసం రోజూ తప్పనిసరిగా ధ్యానం.
- రోజువారీ వ్యాయామాలకు భిన్నంగా అప్పుడప్పుడు కిక్ బాక్సింగ్. దీన్ని ఆమె బాగా ఆస్వాదిస్తుంది.
- వ్యాయామాలకు విరామం ఇచ్చినప్పుడు స్విమ్మింగ్, డ్యాన్స్

### ఇదీ మెనూ...

కంగనా పూర్తి శాకాహారి. ఆరోగ్యకరమైన, పుష్కలంగా పోషక విలువలు కలిగిన తాజా ఆహారం తీసుకొంటుంది.

- ఉదయం లేవగానే గ్లాసుడు నీళ్లు
- బ్రేక్‌ఫాస్ట్‌లో గంజి, తృణధాన్యాలతో పాలు.
- మధ్యాహ్న భోజనానికి ముందు తాజా పండ్లు, ప్రొటీన్ షేక్, బ్రౌన్ బ్రెడ్
- లంచ్‌లో అన్నం, రోటీ, పప్పు, ఉడకబెట్టిన కూరగాయ ముక్కలు, సలాడ్
- రాత్రి భోజనంలో తేలికపాటి ఆహారం. వెజిటబుల్ సూప్, ఉడకబెట్టిన కూరగాయ ముక్కలు, సలాడ్

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం • 03 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com



2025

# జనవరి 10న విశ్వంభర

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమా టైటిల్ టీజర్‌తోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తన అభిమానుల్ని, ప్రేక్షకుల్ని అలరించారు చిరంజీవి. 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ఠ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్ కోసం 13 భారీ సెట్స్‌తో కొత్త ప్రపంచం సృష్టించారు. ఈ సినిమా షూటింగ్‌లో మెగాస్టార్ శుక్రవారం అడుగుపెట్టారు. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ అత్యంత భారీ బడ్జెట్‌తో 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి ఇప్పటివరకూ నటించిన చిత్రాల్లో ఇదే కాస్ట్లీయస్ట్ ఫిల్మ్. వచ్చే సంక్రాంతి సందర్భంగా జనవరి 10న 'విశ్వంభర'ను విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. ఈ చిత్రానికి సాహిత్యం: శివశక్తి దత్తా, చంద్రబోస్, సంగీతం: కీరవాణి, ఛాయాగ్రహణం: చోటా కె నాయుడు, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరావు, సంతోష్ కామిరెడ్డి.

# అర్థం చేసుకొనే లైఫ్ పార్టనర్ ఉన్నాడు

**లావణ్య**



'వరుణ్‌తేజ్‌తో పెళ్లయిన తర్వాత కెరీర్ పరంగా ఏమీ మార్పు లేదు.. మెగా కుటుంబంలోకి వచ్చాక 'నువ్వు ఇలా చేయాలి.. అలా చేయాలి' అని ఎవరూ నాకు చెప్ప లేదు. కెరీర్ పరంగా నాకు కావాల్సినంత స్వేచ్ఛ ఉంది. వరుణ్ లాంటి అర్థం చేసుకొనే లైఫ్ పార్టనర్ ఉన్నాడు. మా వరకూ గతంలో లాగానే ఉన్నాం. ఒక పెద్ద ఫ్యామిలీలోకి అడుగుపెట్టడం మంచి అనుభూతినిచ్చింది. వరుణ్, నేను ఎవరి ప్రొఫెషనల్ వర్క్‌లో వాళ్లం ముందుకు వెళ్తాం. నేను చేసే ప్రాజెక్ట్‌లో వరుణ్ ఇన్‌వాల్వ్ కాడు. 'మిస్ పర్ఫెక్ట్' స్ర్కిప్ట్ చదివి బాగుందన్నాడు' అని చెప్పారు లావణ్య. తను హీరోయిన్‌గా నటించిన వెబ్ సిరీస్ 'మిస్ పర్ఫెక్ట్' డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతున్న సందర్భంగా ఆమె మీడియాతో ముచ్చటించారు.

● 'ఈ సిరీస్‌లో మంచి నటులు ఉన్నారు. రొమాంటిక్, కామెడీ ఎలిమెంట్స్ బ్లెండ్ చేసిన మంచి స్ర్కిప్ట్ ఇది. ఇలాంటి స్ర్కిప్ట్ నా దగ్గరకు రావడం హ్యాపీగా ఉంది. ఇందులో నేను 'మిస్ లావణ్య , లక్ష్మి' అనే పాత్రలు చేశాను. అన్ని రకాల ఎమోషన్స్ ఈ పాత్రల్లో ఉన్నాయి. నా పర్సనల్ లైఫ్‌కు దగ్గరగా ఉండే పాత్రలివి. సినిమాలకు, వెబ్ సిరీస్‌కు పెద్ద తేడా కనిపించలేదు. సినిమా షూటింగ్ జరిగినట్టే ఈ వెబ్ సిరీస్ వర్క్ కూడా జరిగింది' అని చెప్పారు లావణ్య.

● 'కొత్త దర్శకులతో పని చేయడం ఎప్పుడూ రిఫ్రెషింగ్‌గా ఉంటుంది. మా దర్శకుడు విశ్వక్ ఖండేరావు రైటింగ్ యూనిక్‌గా ఉంటుంది. అతనితో వర్క్ చేయడం ఆనందంగా ఉంది. సెట్‌లో ఎవరు సలహా చెప్పినా స్వీకరించేవారు. పర్ఫెక్షనిస్ట్‌గా ఉండడం వల్ల ఎన్ని సమస్యలు వస్తాయో ఈ సిరీస్‌లో చూస్తారు' అని ఆమె అన్నారు. నిర్మాత సుప్రియ తనకు మంచి స్నేహితురాలు కావడంతో ఈ సిరీస్ కంఫర్ట్‌గా చేశానని చెప్పారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఓ కొత్త హీరోతో నిర్మించే చిత్రంలో నటించనున్నట్లు లావణ్య చెప్పారు. ఇందులో తనది పోలీస్ ఆఫీసర్ పాత్ర అన్నారు. దీంతో పాటు ఒక తమిళ సినిమా కూడా చేస్తున్నట్లు వెల్లడించారు.



# వేసవిలో వస్తున్న ఫ్యామిలీ స్టార్

విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం విడుదల తేదీని చిత్ర యూనిట్ శుక్రవారం ప్రకటించింది. ఏప్రిల్ 5న ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వాసు వర్మ ఉన్నారు. రిలీజ్ డేట్ ప్రకటించిన సందర్భంగా స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో విజయ్ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ మ్యాన్‌లా కనిపిస్తున్నారు. లుంగీ కట్టుకుని భుజాన గోనె సంచీ, ఆధార్ కార్డ్‌తో విజయ్ నడిచి వస్తున్న పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.

# 22న గోవాలో రకుల్ పెళ్లి

హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ పెళ్లి ముహూర్తం ఖరారు అయింది. తన ప్రియుడు, నిర్మాత, నటుడు జాకీ భగ్నానితో ఆమె వివాహం ఈ నెల 22న గోవాలో జరుగనుంది మిడిల్ ఈస్ట్‌లో ధూమ్ ధామ్‌గా డిస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోవాలని మొదట రకుల్, ఆమె బాయ్ ఫ్రెండ్ అనుకున్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ డిస్టినేషన్ వెడ్డింగ్స్ విదేశాల్లో కాకుండా మన దేశంలోనే నిర్వహించాలని ఇటీవల .విజ్ఞప్తి చేయడంతో రకుల్, జాకీ తమ ఆలోచన మార్చుకుని గోవాలో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పెళ్లి తర్వాత ముంబైలో రిసెప్షన్ గ్రాండ్‌గా ఏర్పాటు చేసి టాలీవుడ్, బాలీవుడ్‌లోని చిత్ర ప్రముఖులందరినీ ఆహ్వానించాలని కూడా వారు అనుకున్నారు. అయితే తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ముంబైలో కానీ మరెక్కడ కానీ వీళ్ల పెళ్లి రిసెప్షన్ జరగడం లేదు.



# వేడుకల వేళ...

రాజ్ తరుణ్ హీరోగా ఎ.ఎస్.రవి కుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న 'తిరగబడరసామీ' చిత్రం నుంచి సెలబ్రేషన్ సాంగ్ విడుదల చేశారు. సుద్దాల అశోక్ తేజ రాసిన ఈ పాటను లిప్సికా భాష్యం, అదితి భావరాజు, చైతు సత్సంగి పాడారు. చిత్ర నిర్మాత మల్కాపురం శివకుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'యువతను ఆకట్టుకొనే రొమాన్స్ ఫ్యామిలీ సెంటిమెంట్, యాక్షన్, ఎమోషన్ అంశాలతో చిత్రం రూపుదిద్దుకుంటోంది. హిందీ 'బిగ్‌బాస్'తో యావత్ భారతాన్ని అలరించిన మన్నార చోప్రా ఈ సినిమాలో ఓ విభిన్న పాత్ర పోషిస్తున్నారు. ఆమెపై చిత్రీకరించిన ప్రత్యేక గీతం అందరినీ అలరిస్తుంది.. ఈ నెల 23న చిత్రాన్ని విడుదల చేస్తాం' అన్నారు. మకరంద్ దేశ్‌పాండే, జాన్ విజయ్, రఘుబాబు, అంకిత్ ఠాకూర్, పృథ్వీ, ప్రగతి, రాజా రవీంద్ర, బిత్తిరి సత్తి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఫొటోగ్రఫీ: జవహర్ రెడ్డి, సంగీతం: జేబీ.



# కోర్టులో మాకు న్యాయం జరుగుతుంది

**శ్రీమంతుడు టీమ్ స్పందన**

మహేశ్‌బాబు హీరోగా దర్శకుడు కొరటాల శివ రూపొందించిన 'శ్రీమంతుడు' చిత్రం కథ విషయంలో న్యాయస్థానంలో కేసు నడుస్తున్న విషయం తెలిసిందే. తన స్వీయరచన 'చచ్చేంత నవల'ను కాపీ కొట్టి 'శ్రీమంతుడు' సినిమా తీశారని రచయిత శరత్‌చంద్ర కోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసులో కొరటాల శివ సుప్రీం కోర్టు వరకూ వెళ్లినా ఫలితం లేకపోయింది. క్రిమినల్ కేసు ఎదుర్కోవాల్సిందేనని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో శరత్‌చంద్ర ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ' కొంతమంది సినీ పెద్దలు మా మధ్యన రాజీ కుదర్చడానికి ప్రయత్నించారు. రూ. 15 లక్షలు ఇప్పిస్తామన్నారు. కానీ అది నా స్ర్కిప్టే అని దర్శకుడు అంగీకరించాలి' అని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన చిత్రయూనిట్ సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేసింది. 'శ్రీమంతుడు' సినిమా, 'చచ్చేంత ప్రేమ' నవల...రెండూ మార్కెట్లో ఉన్నాయి. ఆ నవల చదివి మా సినిమా చూసినాళ్లకు ఆ రెండింటి మధ్య ఎలాంటి పోలిక లేదని అర్థమవుతుంది. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది కాబట్టి ముందే ఒక అభిప్రాయానికి వచ్చి తీర్పులు ఇవ్వడం తగదు. న్యాయస్థానం తీర్పు కోసం కొంతకాలం ఓపికపట్టండి. న్యాయప్రక్రియపై మాకు నమ్మకం ఉంది' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

# యువతను మెప్పించే రేవ్ పార్టీ

**క్రిష్ సిద్దిపల్లి**

'నేను లేని నా ప్రేమకథ' చిత్రంతో హీరోగా వెండితెరకు పరిచయమయ్యారు క్రిష్ సిద్దిపల్లి. ఆయన కథానాయకుడిగా రూపొందిన 'రేవ్‌పార్టీ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా క్రిష్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

● హీరో అవ్వాలనేది నా కోరిక. కెరీర్ ఆరంభంలో పలు తెలుగు చిత్రాలకు సహాయ దర్శకుడిగా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశాను. ఆ తర్వాత నటుడిగా చిన్నపాత్రలు పోషించాను. ప్రస్తుతం హీరోగా మంచి అవకాశాలు




వస్తున్నాయి. నేను హీరోగా నటించిన 'రేవ్‌పార్టీ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. యువతను ఆకట్టుకునే వినూత్నమైన కథతో ఈ చిత్రం తెరకెక్కింది. రాజు బొనగాని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. రితిక చక్రవర్తి, ఐశ్వర్యగౌడ హీరోయిన్లు. సింగిల్ షెడ్యూల్‌లో చిత్రీకరణ పూర్తి చేశాం. ఉడుపి, గోవా, బెంగళూరు ప్రాంతాల్లో ఎక్కువగా రేవ్ పార్టీలు జరుగుతుంటాయి. అందుకే ఆ ప్రాంతంలోని ఒరిజినల్ లోకేషన్స్‌లో చిత్రీకరణ చేశాం. రేవ్‌పార్టీలు ఎలా జరుగుతాయి?, వాటి వెనుక ఎవరు ఉంటారు, యువతకు ఎలాంటి నష్టం జరుగుతుందనేది ఆసక్తికరంగా తెరకెక్కించాం. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం.

# ఆ మూడూ నచ్చి రవి తేజ ఓకే చేశారు

**సంగీత దర్శకుడు దేవ్ జాంద్**

'దర్శకుడు కార్తీక్‌తో నాకు అనుబంధం ఉంది. 'ఈగల్' సినిమా ఓకే కాగానే 'రవితేజను ఒప్పించు. ఆయన ఓకే అంటేకానీ నిన్ను ఈ ప్రాజెక్ట్‌లోకి తీసుకోలేను' అని చెప్పారు కార్తీక్. నా వంతు ప్రయత్నంగా మూడు ట్రాక్స్ కంపోజ్ చేసి కార్తీక్‌కు ఇచ్చాను. అవి రవితేజకు నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌లోకి అడుగుపెట్టాను' అన్నారు సంగీత దర్శకుడు దేవ్ జాంద్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తయారైన 'ఈగల్' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా దేవ్ మీడియాతో మాట్లాడారు. 'ఈగల్'లో చాలా కొత్త తరహా సంగీతం అందించాం. రవితేజకు ప్రాపర్ ఇంగ్లీష్ ట్రాక్ చేసే అవకాశం రావడం నా అదృష్టం. ఆయన చాలా మంచి వ్యక్తి. సంగీతం గురించి దాదాపు గంట సేపు మాట్లాడుకున్నాం. ఈ సినిమాలో స్ర్కీన్‌ప్లే, యాక్షన్, దర్శకుడు తీసిన విధానం యూనిక్‌గా ఉంటాయి. 'ఆడు మచ్చా' పాట మెస్మరైజ్ చేస్తుంది.' అని ఆయన తెలిపారు. కార్తీక్ ప్రతిభావంతుడైన దర్శకుడు అని చెబుతూ ఆయన అభిరుచికి తగ్గ సంగీతం అందించానని దేవ్ చెప్పారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్, సహ నిర్మాత వివేక్ అంతే ప్రోత్సహించారని తెలిపారు.





# నాగ్- అక్షయ్ మల్టీస్టారర్?

'నా సామిరంగ' చిత్రం విజయం సాధించడంతో మంచి జోష్‌లో ఉన్నారు నాగార్జున. ప్రస్తుతం ఆయన ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నారు. ఇప్పుడు ఆయన మరో మల్టీస్టారర్ చిత్రానికి పచ్చజెండా ఊపారని సమాచారం. ఓ తమిళ దర్శకుడు చెప్పిన కథ నచ్చడంతో నాగార్జున ఎస్ చెప్పారట. మల్టీస్టారర్‌గా రూపొందబోతోన్న ఈ చిత్రంలో ప్రముఖ బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ కీలకపాత్ర పోషించనున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. నాగార్జున అడపా దడపా హిందీ చిత్రాల్లో కనిపిస్తూనే ఉన్నారు. రణ్‌బీర్ కపూర్ హీరోగా వచ్చిన 'బ్రహ్మాస్త్ర' చిత్రంలో నాగార్జున కీలకపాత్రలో నటించారు. ఆ చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా రాజమౌళి-మహేశ్‌బాబు కాంబినేషన్‌లో వస్తున్న చిత్రంలోనూ నాగార్జున ప్రధాన పాత్రలో నటించనున్నారని కొన్నాళ్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# గ్రామీణ ప్రేమకథ

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. ట్రైలర్ బాగుందనీ, సినిమా విజయం సాధించాలనీ ఆయన కోరారు. నిర్మాత మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకొన్న ప్రేమకథ ఇది. ఈ నెలలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. సెన్సార్ కార్యక్రమాలు జరుగుతున్నాయనీ, తను అనుకున్న విధంగా సినిమా తీయడానికి నిర్మాత ఎంతో సహకరించారనీ దర్శకుడు తెలిపారు. దీప్తి, మేకా రామకృష్ణ, జయప్రకాశ్, ప్రియ, నవీన్, రవి శివతేజ, సుమన్, రాచర్ల లాస్య తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు: వసంత్ వెంకట్ బాలా, సంగీతం: చైతు కొల్లి, ఛాయాగ్రహణం: తాజ్ జీడీకే.





# ఆ రెండేళ్లు నరకం చూశా

**పూనమ్ కౌర్**

ఫైబ్రోమైయాల్జియా సమస్యతో రెండేళ్లపాటు నరకం చవి చూశానని నటి పూనమ్ కౌర్ అన్నారు. ఈ అరుదైన వ్యాధి గురించి ఆమె జనాల్లో అవగాహన పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా ఓ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఫైబ్రోమైయాల్జియాతో తాను చాలా ఇబ్బందులకు గురైనట్లు అందులో ఆమె చెప్పారు. శరీరం సున్నితంగా మారి, కొద్దిపాటి స్పర్శకూ తీవ్రంగా స్పందించేదన్నారు. కండరాల నొప్పులతో కనీసం దుస్తులు కూడా ధరించలేకపోయాననీ, రెండేళ్ల పాటు నరకం చూశానని ఆమె తెలిపారు. ఒక రకంగా చావు అంచుల వరకూ వెళ్లొచ్చినట్లు అనిపించిందన్నారు. రెండేళ్లుగా పలు రకాల వైద్య పద్ధతులు ప్రయత్నించినా అవేవీ తన సమస్యకు సాంత్వన ఇవ్వలేకపోయాయనీ అయితే ప్రకృతి చికిత్స, జీవనశైలిలో మార్పులతో తాను ఆ సమస్యను అధిగమించానని సోషల్ మీడియాలో పూనమ్‌కౌర్ తెలిపారు.

# యశస్వీభవ

## జైస్వాల్ అజేయ శతకం

### భారత్ తొలి ఇన్నింగ్స్ 336/6

### ఇంగ్లండ్‌తో రెండో టెస్టు



యశస్వీ జైస్వాల్ (257 బంతుల్లో 179 బ్యాటింగ్)

**2** ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టుల్లో ఒకే రోజు అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన బ్యాటర్‌గా గవాస్కర్ (179)తో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచిన యశస్వీ జైస్వాల్. కరణ్ నాయర్ (232) టాప్‌లో ఉన్నాడు. అలాగే ఏ జట్టుపై అయినా ఓవరాల్‌గా ఆరో భారత బ్యాటర్.

**4** 23 ఏళ్లు రాకముందే ఇంటా, బయటా టెస్టు సెంచరీలు సాధించిన నాలుగో భారత బ్యాటర్‌గా జైస్వాల్. రవిశాస్త్రి, సచిన్, వినోద్ కాంబ్లీ ముందున్నారు.

**విశాఖపట్నం (స్పోర్ట్స్):** విజయమే లక్ష్యంగా బరిలోకి దిగిన భారత జట్టు ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో తొలి రోజే ఆధిపత్యం కనబరచింది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (257 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్సర్లతో 179 బ్యాటింగ్) అంతులేని ఆత్మవిశ్వాసంతో అంతా తానై రోజంతా బరిలో నిలిచాడు. ఈ క్రమంలో కెరీర్‌లో రెండో అజేయ శతకంతో పాటు ఒంటిచేత్తో జట్టుకు భారీ స్కోరు అందించాడు. అయితే బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న ఈ పిచ్‌పై మిగతా బ్యాటర్లు కనీసం అర్ధసెంచరీ చేయకపోవడం గమనార్హం. శుక్రవారం ఆట ముగిసే సరికి భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 93 ఓవర్లలో 6 వికెట్లకు 336 పరుగులు సాధించింది. గిల్ (34), రజత్ (32) ఫర్వాలేదనిపించారు. క్రీజులో జైస్వాల్‌తో పాటు అశ్విన్ (5) ఉన్నాడు. రెండో రోజు జట్టు 450-500 పరుగుల స్కోరు లక్ష్యంగా బ్యాటింగ్ సాగించాల్సి ఉంటుంది. ఆదివారం నుంచి వికెట్ బౌన్స్ అయ్యే చాన్సుండడంతో ఇంగ్లండ్‌పై ఒత్తిడి పెంచవచ్చు. స్పిన్నర్లు షోయబ్ బషీర్, రెహాన్ అహ్మద్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అయితే ఇంగ్లండ్ బౌలర్లు ఒకే ఒక్క ఎక్స్‌ట్రా (నోబ్) ఇవ్వడం విశేషం. భారత తుది జట్టులో కుల్దీప్, రజత్, ముకేశ్‌లకు చోటు దక్కింది.




**1** భారత్‌లో టెస్టు ఆడిన అతిపెద్ద వయస్సు (41 ఏళ్లు) పేసర్‌గా అండర్సన్.

**ఆరంభం..నిదానం:** టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్‌కు దిగగా.. ఫ్లాట్ వికెట్‌ను సద్వినియోగం చేసుకుంటూ యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ అదరగొట్టాడు. అద్భుత భాగస్వామ్యాలతో సెంచరీతో పాటు జట్టుకు విలువైన పరుగులు అందిస్తూ డబుల్ సెంచరీకి చేరువయ్యాడు. 6.4 అడుగుల ఎత్తున్న అరంగేట్ర స్పిన్నర్ బషీర్ బౌన్స్‌ను రాబడుతూ ఇబ్బందిపెట్టాడు. తొలి గంట ఓపెనర్లు జైస్వాల్, రోహిత్ (14) నిదానంగా ఆడుతూ 16 ఓవర్లలో 40 పరుగులే అందించారు. 41 ఏళ్ల పేసర్ అండర్సన్ కచ్చితమైన బంతులతో పరుగులను నియంత్రించాడు. స్పిన్నర్ బషీర్ తన తొలి వికెట్‌గా రోహిత్‌ను అవుట్ చేశాడు. ఆ తర్వాత జైస్వాల్ స్వీప్, కట్ షాట్లతో బౌండరీలు బాదాడు. గిల్ ఆత్మవిశ్వాసంతో కనిపించినా ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. రెండో వికెట్‌కు 49 రన్స్ చేరాక గిల్‌ను అండర్సన్ అవుట్ చేశాడు. లంచ్ బ్రేక్‌కల్లా జట్టు స్కోరు 103/2.

**జైస్వాల్ శతకం:** రెండో సెషన్‌లో గేరు మార్చిన యశస్వీ చక్కటి స్ట్రోక్‌ప్లేతో ఎదురుదాడికి దిగాడు. దీంతో ఈ సెషన్‌లో జట్టు 122 పరుగులు సాధించింది. మరోసారి విఫలమైన శ్రేయాస్ అయ్యర్ వికెట్‌ను మాత్రమే ఇంగ్లండ్ బౌలర్లు తీయగలిగారు. తొలి ఫిఫ్టీని 89 బంతుల్లో సాధించిన జైస్వాల్ సెంచరీని మాత్రం మరో 62 పరుగుల్లోనే అందుకున్నాడు. లెఫ్టామ్ స్పిన్నర్ హార్ట్లీ ఓవర్‌లో ముందుకువచ్చి లాంగాన్‌లో సంధించిన సిక్సర్‌తో శతకం పూర్తి చేశాడు. ఈ సెషన్‌లో తను ఎక్కువగా డ్రైవ్ షాట్లు ఆడాడు. హార్ట్లీని లక్ష్యంగా చేసుకుంటూ 45వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో సత్తా చూపాడు. అలాగే శ్రేయాస్ (27)తో కలిసి మూడో వికెట్‌కు 90 పరుగులు జోడించడం విశేషం. అనంతరం తొలి టెస్టు ఆడుతున్న రజత్ పటీదార్ తడబాటు లేకుండా బ్యాటింగ్ సాగించాడు. రివర్స్ స్వీప్ షాట్లతోనూ ఆకట్టుకున్నాడు.

**నిరాశపర్చిన భరత్:** ఆఖరి సెషన్‌లో ఇంగ్లండ్ బౌలర్లు కాస్త పుంజుకుని మూడు వికెట్లు పడగొట్టారు. 68వ ఓవర్‌లో జైస్వాల్ 6,4తో ఆకట్టుకున్నా, కాసేపటికే రజత్ వికెట్‌ను రెహాన్ తీయడంతో నాలుగో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అలాగే అక్షర్ (27)తోనూ ఐదో వికెట్‌కు 52 పరుగులు జోడించడంతో జట్టు స్కోరు 300 దాటింది. అయితే లోకల్ బాయ్ కేఎస్ భరత్ నిరాశపరిచాడు. 90వ ఓవర్‌లో సిక్సర్ బాదిన అతను ఉన్న కాసేపు వేగం చూపాడు. కానీ మరో రెండు ఓవర్లలో తొలి రోజు ఆట ముగుస్తుందనగా రెహాన్ ఓవర్‌లో వెనుదిరిగాడు.

### తొలిరోజు హాజరు 15,600

మ్యాచ్ మొదటిరోజు సుమారు 15,600 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. రెండు వేల మంది విద్యార్థులతోపాటు ఏసీఏ పరిధిలోని క్లబ్ క్రికెటర్లకు కూడా ఉచిత ప్రవేశం కల్పించిన నేపథ్యంలో గ్యాలరీలలో ప్రేక్షకుల తాకిడి కనిపించింది. అలాగే ఇంగ్లండ్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడం విశేషం. కాగా స్టేడియం పూర్తి సామర్థ్యం 27 వేలు.

### స్కోరుబోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** జైస్వాల్ (బ్యాటింగ్) 179; రోహిత్ (సి) పోప్ (బి) బషీర్ 14; గిల్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 34; శ్రేయాస్ (సి) ఫోక్స్ (బి) హార్ట్లీ 27; రజత్ (బి) రెహాన్ 32; అక్షర్ (సి) రెహాన్ (బి) బషీర్ 27; భరత్ (సి) బషీర్ (బి) రెహాన్ 17; అశ్విన్ (బ్యాటింగ్) 5; ఎక్స్‌ట్రాలు: **1; మొత్తం: 93 ఓవర్లలో 336/6; వికెట్ల పతనం:** 1-40, 2-89, 3-179, 4-249, 5-301, 6-330; **బౌలింగ్:** అండర్సన్ 17-3-30-1; రూట్ 14-0-71-0; హార్ట్లీ 18-2-74-1; బషీర్ 28-0-100-2; రెహాన్ 16-2-61-2.

### సిరాజ్‌కు విశ్రాంతి

**విశాఖపట్నం:** సుదీర్ఘ సిరీస్ కావడంతో పని ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని పేసర్ మహ్మద్ సిరాజ్‌కు రెండో టెస్టు నుంచి విశ్రాంతినిచ్చినట్టు బీసీసీఐ ప్రకటించింది. కొన్ని నెలలుగా సిరాజ్ అవిశ్రాంతంగా క్రికెట్ ఆడుతున్నాడు. అతడి స్థానంలో రంజీ కోసం విడుదల చేసిన పేసర్ అవేశ్‌ను తిరిగి జట్టులోకి రప్పించారు. ప్రస్తుతం కుటుంబంతో కలిసి ఉన్న సిరాజ్ ఇంగ్లండ్‌తో మూడో టెస్టుకు అందుబాటులో ఉంటాడు.

## అస్మిత అదరహో

**'థాయ్‌లాండ్' నుంచి గాయత్రి జోడీ అవుట్**

**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వాలిఫయర్‌గా అడుగుపెట్టిన అస్మిత సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో అస్మిత 21-14, 19-21, 21-13తో 44వ ర్యాంకర్ ఎస్తర్ వార్దాయో (ఇండోనేసియా)ను ఓడించింది. మహిళల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో గాయత్రి గోపీచంద్/ట్రిసా జాలీ జంట 12-21, 21-17, 21-23తో ఇండోనేసియా జోడీ ఫెబ్రియానా/అమేలియా చేతిలో ఓడగా, పురుషుల సింగిల్స్‌లో మిథున్ మంజునాథ్ 19-21, 15-21తో మార్క్ కాలిజౌ (డెన్మార్క్) చేతిలో ఓటమి పాలయ్యాడు.


తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్న మాజీ బాక్సర్, ఒలింపిక్ పతక విజేత విజేందర్ సింగ్

## సెమీస్‌లో మన కుర్రాళ్లు

- సచిన్, ఉదయ్ శతకాలు
- నేపాల్‌పై ఘనవిజయం
- అండర్-19 వరల్డ్‌కప్


సచిన్, ఉదయ్

**బ్లూమ్‌ఫోంటీన్:** ఓటమనేదే లేకుండా దూసుకెళుతున్న భారత కుర్రాళ్లు అండర్-19 వరల్డ్‌కప్ సెమీఫైనల్లో ప్రవేశించారు. శుక్రవారం నేపాల్‌తో జరిగిన రెండో సూపర్ సిక్స్ మ్యాచ్‌లో భారత్ 132 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కిది వరుసగా ఐదో గెలుపు. సెమీస్‌లో మంగళవారం దక్షిణాఫ్రికాతో తలపడుతుంది. సచిన్ దాస్ (116), కెప్టెన్ ఉదయ్ సహరన్ (100) సెంచరీలతో చెలరేగి నాలుగో వికెట్‌కు రికార్డు స్థాయిలో 215 పరుగులు జోడించారు. దీంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 297/5 స్కోరు సాధించింది. ఛేదనలో నేపాల్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 165 పరుగులు చేసి ఓడింది. కెప్టెన్ దేవ్ ఖనాల్ (33) టాప్ స్కోరర్. లెఫ్టామ్ స్పిన్నర్ సౌమీ పాండేకు 4, అర్షిన్‌కు 2 వికెట్లు దక్కాయి. ఇతర మ్యాచ్‌ల్లో శ్రీలంకపై 119 రన్స్‌తో సౌతాఫ్రికా గెలవగా.. ఆసీస్-విండీస్ మ్యాచ్ వర్షంతో రద్దయ్యింది.

### కామెంట్రీ మధ్యలోనే వెళ్లిపోయాడు..

భారత్-ఇంగ్లండ్ రెండో టెస్టుకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ తొలి రోజు ఆట మధ్యలోనే వెళ్లిపోయాడు. తన అత్తయ్య పుష్ప మెహ్రోత్రా మృతి చెందారన్న వార్తతో అతడు శుక్రవారం మధ్యాహ్నమే హుటాహుటిన విశాఖ నుంచి కాన్పూర్ బయలుదేరాడు. 2022 డిసెంబరులో భారత్-బంగ్లాదేశ్ టెస్టు సందర్భంగా సన్నీ కామెంట్రీ విధుల్లో ఉన్నప్పుడే అతడి తల్లి కూడా మరణించడం గమనార్హం.

### తొలిరోజు హైదరాబాద్‌దే

**హైదరాబాద్:** మిజోరంతో శుక్రవారం ప్రారంభమైన రంజీ ప్లేట్ లీగ్ పోరులో హైదరాబాద్ తొలిరోజే పట్టు బిగించింది. స్పిన్నర్ రోహిత్ రాయుడు (4/20), పేసర్ కార్తికేయ (2/34) విజృంభణకు మిజోరం తొలి ఇన్నింగ్స్‌లో 199 పరుగులకే ఆలౌటైంది. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ తొలిరోజు ఆఖరికి వికెట్ నష్టానికి 120 రన్స్ చేసింది. కెప్టెన్ రాహుల్ సింగ్ (81), రోహిత్ రాయుడు (25) క్రీజులో ఉన్నారు.

### వారియర్స్, స్టీలర్స్ జోరు

**న్యూఢిల్లీ:** ప్రొ కబడ్డీ లీగ్‌లో బెంగాల్ వారియర్స్, హరియాణా స్టీలర్స్ జోరు కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన పోరులో వారియర్స్ 45-38తో దబాంగ్ ఢిల్లీపై, స్టీలర్స్ 34-30తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచాయి.

### చెలరేగిన బార్ట్‌లెట్

**తొలి వన్డేలో ఆసీస్ గెలుపు**

**మెల్‌బోర్న్:** యువ పేసర్ జేవియర్ బార్ట్‌లెట్ (4/17) అరంగేట్రంలో అదరగొట్టగా, గ్రీన్ (2/40, 77 నాటౌట్) ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకోవడంతో వెస్టిండీస్‌తో శుక్రవారం జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా ఎనిమిది వికెట్లతో నెగ్గింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన పర్యాటక జట్టు 48.4 ఓవర్లలో 231 పరుగులకు ఆలౌటైంది. కార్టీ (88), ఛేజ్ (59) అర్ధ శతకాలు చేశారు. ఛేదనను ఆస్ట్రేలియా 38.3 ఓవర్లలో 232/2 స్కోరుతో పూర్తి చేసింది. స్మిత్ (79 నాటౌట్), ఇన్‌గ్లిస్ (65) హాఫ్ సెంచరీలతో చెలరేగారు.

## ఫేవరెట్ భారత్

**పాక్‌తో డేవిస్ కప్ నేటినుంచి**



**డ్రా ఇలా..**

**శనివారం**
మొదటి సింగిల్స్: రామ్‌కుమార్ x ఖురేషి
రెండో సింగిల్స్: అకీల్ x శ్రీరామ్

**ఆదివారం**
డబుల్స్: బర్కతుల్లా/ముర్తజా x యుకీ /సాకేత్
తొలి రివర్స్ సింగిల్స్: రామ్‌కుమార్ x అకీల్ ఖాన్
రెండో సింగిల్స్: ఖురేషి x శ్రీరామ్


**ఇస్లామాబాద్:** అరవై సంవత్సరాల తర్వాత దాయాది గడ్డపై అడుగుపెట్టిన భారత డేవిస్ కప్ జట్టు శనివారం నుంచి పాకిస్థాన్‌తో జరిగే చారిత్రక డేవిస్ కప్ గ్రూప్-1 ప్లేఆఫ్ పోరులో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. డేవిస్ కప్‌లో ఇప్పటిదాకా ఇరు జట్లు ఏడు సార్లు తలపడగా..అన్ని సార్లూ భారత్‌దే విజయం. ఈసారి సింగిల్స్‌లో స్టార్ ఆటగాళ్లు లేకున్నా భారత జట్టు బలీయంగానే ఉంది.

### అఫ్ఘానిస్థాన్ 198 ఆలౌట్

**కొలంబో:** శ్రీలంక పేసర్ల ధాటికి శుక్రవారం మొదలైన ఏకైక టెస్ట్‌లో అఫ్ఘానిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలింది. రెహ్మాత్ షా (91) ఒక్కడే రాణించాడు. విశ్వ ఫెర్నాండో 4, అసిత ఫెర్నాండో, ప్రభాత్ చెరి మూడేసి వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ చేపట్టిన లంక తొలి రోజు ఆఖరికి వికెట్ నష్టపోకుండా 80 పరుగులు చేసింది.

# బిజినెస్

## నిఫ్టీ సరికొత్త రికార్డు



**73,000 మార్క్ దాటిన సెన్సెక్స్**

### ఇంట్రాడేలో 22,126 పాయింట్లను తాకిన సూచీ ..

### ఆల్‌టైం గరిష్ఠానికి మార్కెట్ సంపద ..

### రూ.382.77 లక్షల కోట్లకు చేరిక..

**ముంబై:** దలాల్‌స్ట్రీట్‌లో మళ్లీ రికార్డుల మోత మోగింది. శుక్రవారం ట్రేడింగ్‌లో నిఫ్టీ ఆల్‌టైం రికార్డు స్థాయికి ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్లు ర్యాలీ తీయడంతో దేశీయంగానూ మదుపరులు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి మార్కెట్ దిగ్గజ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. ఒక దశలో 1,444 పాయింట్లు ఎగబాకి 73,089.40 వద్దకు చేరుకున్న సెన్సెక్స్.. చివరికి 440.33 పాయింట్ల లాభంతో 72,085.63 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 156.35 పాయింట్ల వృద్ధితో 21,853.80 వద్ద క్లోజైంది. సూచీ ఒక దశలో 429.35 పాయింట్ల లాభంతో 22,126.80 వద్ద సరికొత్త ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. కొనుగోళ్ల హోరులో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం ఒక్క రోజులో రూ.3.34 లక్షల కోట్లు వృద్ధి చెంది సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.382.77 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 లాభపడ్డాయి. పవర్‌గ్రిడ్ 4.10 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎన్‌టీపీసీ 3.34 శాతం, టీసీఎస్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, విప్రో, ఇన్ఫోసిస్, రిలయన్స్, టెక్ మహీంద్రా షేర్లు రెండు శాతానికి పైగా పుంజుకున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ మాత్రం ఒక శాతానికి పైగా క్షీణించాయి. ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 1,384.96 పాయింట్లు (1.95 శాతం), నిఫ్టీ 501.2 పాయింట్లు (2.34 శాతం) బలపడ్డాయి.

**ఆధార్ హౌసింగ్ రూ.5,000 కోట్ల ఐపీఓ**

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు కలిగిన ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా ఈ ఫైనాన్స్ కంపెనీ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్‌కు చెందిన రూ.4,000 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించాలనుకుంటోంది. దీంతో పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ.5,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

### రూ.20 లక్షల కోట్లకు చేరువలో రిలయన్స్

స్టాక్ మార్కెట్లో అత్యంత విలువైన కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీ లిమిటెడ్ (ఆర్ఐఎల్) షేరు ధర సరికొత్త జీవితకాల గరిష్ఠానికి ఎగబాకింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ఒక దశలో 3.40 శాతం లాభంతో రూ.2,949.90 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 2.18 శాతం లాభంతో రూ.2,914.75 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో రూ.41,860.54 కోట్లు పెరిగి మొత్తం రూ.19,72,028.45 కోట్లకు చేరుకుంది. ఈ ఏడాదిలో ఇప్పటికే 12.76 శాతం వృద్ధి చెందిన రిలయన్స్ షేరు ధర.. ముున్ముందు సెషన్లలో రూ.3,000 దిశగా దూసుకెళ్లనుందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ లెక్కన కంపెనీ మార్కెట్ విలువ త్వరలోనే రూ.20 లక్షల కోట్ల మైలురాయిని దాటే అవకాశాలున్నాయి.

### ఈ నెల 7న 3 ఐపీఓలు షురూ

ఫిబ్రవరి 7న రెండు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లతో పాటు ఐసీటీ ఉత్పత్తుల డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఐపీఓలు ప్రారంభం కానున్నాయి. రూ.523 కోట్ల సమీకరణ లక్ష్యంతో ఇష్యూకు వస్తున్న క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.445-468గా నిర్ణయించింది. కాగా, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.393-414గా ఖరారు చేసింది. ఇష్యూ ద్వారా గరిష్ఠంగా రూ.570 కోట్లు సమీకరించాలనుకుంటోంది. రాశి పెరిఫెరల్స్ ఇష్యూ ధరల శ్రేణిని రూ.295-311గా నిర్ణయించింది. తద్వారా రూ.600 కోట్ల వరకు సమీకరించనుంది.

## ఎస్‌బీఐ, ఓఎన్‌జీసీల్లో మరింత వాటాల విక్రయం

**ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ)తో పాటు చమురు, సహజవాయువు ఉత్పత్తి దిగ్గజం ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ)లో మరింత వాటాల విక్రయానికి సిద్ధంగా ఉన్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఒక బిజినెస్ న్యూస్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయం వెల్లడించారు. ఈ రెండు కంపెనీల ఈక్విటీలో 50 శాతం కంటే తక్కువ వాటా కలిగి ఉండేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం బ్లూచిప్ కంపెనీలుగా పరిగణించే ఓఎన్‌జీసీ ఈక్విటీలో 58.89 శాతం, ఎస్‌బీఐలో 57.47 శాతం వాటా కలిగి ఉంది. వృత్తిపరమైన నైపుణ్యాలు పెంచడం ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ), ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) మార్కెట్ విలువ పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆర్థిక మంత్రి సీతారామన్ స్పష్టం చేశారు.

### ప్రైవేటీకరణ తప్పదు

వచ్చే ఆర్థిక సంవత్సరం ఎట్టి పరిస్థితుల్లోనూ ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణ పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) కార్యదర్శి తుహిన్ కాంత పాండే ఈ విషయం చెప్పారు. వచ్చే ఏడాది పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం ఇంతని బడ్జెట్‌లో పేర్కొనకపోయినా ఈ మొత్తం రూ.50,000 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల నగదీకరణ ద్వారా రూ.30,000 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ మౌలిక సదుపాయాల ఆస్తుల నగదీకరణ ద్వారా రూ.1.75 లక్షల కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నా అది రూ.1.5 లక్షల కోట్లు మించే అవకాశం లేదన్నారు.

## నవ లిమిటెడ్ లాభం రూ.465 కోట్లు


**హైదరాబాద్:** నవ లిమిటెడ్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి గాను కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.995 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.465 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఒక త్రైమాసికంలో ఈ స్థాయి లాభం ఆర్జించటం ఇదే తొలిసారని కంపెనీ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.362.80 కోట్లు)తో పోల్చితే లాభం 28.2 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో ఎనర్జీ విభాగం పనితీరు మెరుగ్గా ఉండటం ఎంతగానో కలిసి వచ్చిందని పేర్కొంది. మరోవైపు మైనింగ్ డివిజన్ అమ్మకాలు ఆశించిన స్థాయిలో ఉండటంతో పాటు బొగ్గు విక్రయాలు పెరగటంతో లాభదాయకత పెరిగిందని తెలిపింది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ డిసెంబరు త్రైమాసికంలో రూ.335.80 కోట్ల ఆదాయంపై రూ.45.1 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మరోవైపు డిసెంబరు త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ కన్సాలిడేటెడ్ దీర్ఘకాలిక రుణ భారం ఏకంగా 87 శాతం తగ్గుదలతో రూ.3,356 కోట్ల నుంచి రూ.761.30 కోట్లకు చేరింది.

### కొత్త ఐటీ రిటర్న్ ఫామ్స్ : సీబీడీటీ

**న్యూఢిల్లీ:** 2024-25 పన్ను మదింపు సంవత్సరానికి (ఏవై) సంబంధించి ఆదాయ పన్ను (ఐటీ) శాఖ.. ఐటీఆర్ 2,3,5 పేరుతో కొత్త ఐటీ రిటర్న్ ఫామ్స్ విడుదల చేసింది. వ్యాపార లేదా వృత్తిపరమైన ఆదాయం లేని వ్యక్తులు, అవిభక్త హిందూ కుటుంబాలు (హెచ్‌యూఎఫ్).. ఐటీఆర్-2 ద్వారా, వ్యాపార లేదా వృత్తిపరమైన ఆదాయం ఉన్న వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు ఐటీఆర్-3 ద్వారా, భాగస్వామ్య సంస్థలు, ఎల్ఎల్‌పీలు ఐటీఆర్-5 ద్వారా తమ ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేయాలి. ఈ రిటర్న్‌లు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తెలిపింది. ఐటీఆర్-1, ఐటీఆర్-6 ఐటీ శాఖ ఇంతకు ముందే విడుదల చేసింది. వార్షిక ఆదాయం రూ.50 లక్షల వరకు ఉన్న వ్యక్తులు ఐటీఆర్-1 ద్వారా, కంపెనీలు ఐటీఆర్-6 ద్వారా తమ రిటర్న్‌లు ఫైల్ చేయాలి.

### బీఓఐ లాభంలో 62% వృద్ధి

**న్యూఢిల్లీ:** బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ).. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో 1,870 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.1,151 కోట్లతో పోల్చితే ఇది 62 శాతం అధికం. ఇదే కాలంలో బ్యాంక్ ఆదాయం రూ.12,728 కోట్ల నుంచి రూ.14,160 కోట్లకు పెరిగింది. స్థూల ఎన్‌పీఏలు (మొండి బకాయిలు) 7.66 శాతం నుంచి 5.35 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.61 శాతం నుంచి 1.41 శాతానికి తగ్గాయి. డిసెంబరు చివరి నాటికి బ్యాంక్ సీఏఆర్ 16.06 శాతం ఉంది. ఈ త్రైమాసికంలో బ్యాంక్ రూ.10 ముఖ విలువ గల 44,91,01,796 అదనపు ఈక్విటీ షేర్లు రూ.100.20 ధరకు జారీ చేయడం ద్వారా రూ.4,500 కోట్లు సమీకరించింది. దీంతో డిసెంబరు 31 నాటికి బ్యాంకులో ప్రభుత్వ వాటా 73.38 శాతానికి తగ్గింది.




| బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో) | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 63,600 ▲ | 58,300 ▲ | 78,000 ▲ |
| ముంబై | 63,142 ▲ | 57,838 ▲ | 71,864 ▲ |

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 2వ తేదీ | | విజయవాడ | 528 |
| హైదరాబాద్ | 525 | విశాఖపట్నం | 550 |
| 3వ తేదీ | | వరంగల్ | 527 |
| చిత్తూరు | 573 | | |
| గోదావరి | 528 | డజను గుడ్లు రూ.72 | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 99 | గోదావరి | 108 |
| వరంగల్ | 99 | | |
| కరీంనగర్ | 99 | విజయవాడ | 108 |
| మహబూబ్‌నగర్ | 99 | గుంటూరు | 109 |
| | | ఒంగోలు | 109 |
| కర్నూలు | 99 | చిత్తూరు | 113 |
| విశాఖపట్నం | 105 | | |

### ఫిబ్రవరి 29 తర్వాత కూడా పేటీఎం యాప్ సేవలు కొనసాగుతాయ్..

**ముంబై:** డిజిటల్ చెల్లింపుల వేదికైన పేటీఎం యాప్ సేవలకు ఎలాంటి అంతరాయం ఉండదని, ఫిబ్రవరి 29 తర్వాత యాప్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని కంపెనీ సీఈఓ విజయ్ శేఖర్ శర్మ శుక్రవారం ఎక్స్ (గతంలో ట్విటర్)లో పోస్ట్ చేశారు. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్)పై ఆర్‌బీఐ కఠిన ఆంక్షల నేపథ్యంలో పేటీఎం యాప్ సేవల కొనసాగింపుపై యూజర్లలో ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో ఆయన స్పష్టత నిచ్చారు. ఈ నెలాఖరు తర్వాత నుంచి పీపీబీఎల్ డిపాజిట్లు స్వీకరించకుండా ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. కస్టమర్ల సేవింగ్, కరెంట్ అకౌంట్లతో పాటు ప్రీ-పెయిడ్ సాధనాలైన వాలెట్లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్‌లు (ఎన్‌సీఎంసీ) ఫాస్టాగ్ అకౌంట్లలోకి డిపాజిట్లు లేదా టాప్-అప్‌లను స్వీకరించవద్దని బ్యాంక్‌ను ఆర్‌బీఐ బుధవారం ఆదేశించింది. అయితే, అకౌంట్లలోకి వడ్డీ, క్యాష్‌బ్యాక్ లేదా రిఫండ్ సొమ్మును మాత్రం జమ చేయవచ్చని స్పష్టం చేసింది. అంతేకాదు, కస్టమర్లు తమ అకౌంట్‌లో ఉన్న నగదును ఉన్నంతవరకు వినియోగించుకునేందుకు, ఉపసంహరించుకునేందుకూ ఎలాంటి ఆంక్షలుండవని తెలిపింది. ఇవి తప్ప మార్చి 1 నుంచి ఐఎంపీఎస్, ఏఈపీఎస్ వంటి నగదు బదిలీ లావాదేవీలు, భారత్ బిల్ పేమెంట్ ట్రాన్సాక్షన్లు, యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను అందించడానికి వీల్లేదని పీపీబీఎల్‌ను ఆదేశించింది.

**పేటీఎం షేరు మరో 20 శాతం డౌన్:** ఆర్‌బీఐ ఆంక్షల ప్రభావంతో పేటీఎం బ్రాండ్ మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ షేరు ధర శుక్రవారం మరో 20 శాతం క్షీణించి రూ.487.05కు పడిపోయింది. క్రితం (గురువారం) సెషన్లోనూ కంపెనీ షేరు ఇరవై శాతం పతనమైంది. ఈ రెండ్రోజుల్లో షేరు 40 శాతం నష్టపోవడంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.17,378 కోట్లు తగ్గి రూ.30,931 కోట్లకు పడిపోయింది.

**రూ.244 కోట్ల షేర్లను కొనుగోలు చేసిన మోర్గాన్ స్టాన్లీ**

అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం మోర్గాన్ స్టాన్లీ శుక్రవారం పేటీఎంకు చెందిన రూ.244 కోట్ల విలువైన షేర్లను బహిరంగ మార్కెట్ ద్వారా కొనుగోలు చేసింది.

### టాటా మోటార్స్ లాభంలో భారీ వృద్ధి

**ముంబై:** డిసెంబరు త్రైమాసికంలో టాటా మోటార్స్ 133.32 శాతం వృద్ధితో రూ.7,100 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభం రూ.3,043 కోట్లు. త్రైమాసిక సమీక్షా కాలంలో కన్సాలిడేటెడ్ ఆదాయం 25 శాతం పెరిగి రూ.1,10,600 కోట్లకు చేరింది. సీజనల్ డిమాండ్, కొత్త వాహనాలు ప్రవేశపెట్టడం, జేఎల్ఆర్ సరఫరాల మెరుగుదల ఫలితంగా నాలుగో త్రైమాసికంలో మరింత మెరుగైన పనితీరు ప్రదర్శించగలమన్న విశ్వాసం కంపెనీ ప్రకటించింది. డిసెంబరు త్రైమాసికంలో రుణ భారాన్ని రూ.9,500 కోట్లకు తగ్గించుకోగలిగామని కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ పీబీ బాలాజీ చెప్పారు.

- **తగ్గిన కావేరీ సీడ్స్ లాభం**

కావేరీ సీడ్స్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.1,42.63 కోట్ల రెవెన్యూపై రూ.11.78 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.144 కోట్లుగా ఉండగా నికర లాభం (రూ.38.09 కోట్లు) ఏకంగా 69 శాతం తగ్గింది.

### మెడ్‌ప్లస్ లాభంలో స్వల్ప వృద్ధి

**హైదరాబాద్:** డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ లాభం స్వల్పంగా పెరిగింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,451.26 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.13.73 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.1,201.67 కోట్ల ఆదాయంపై రూ.13.38 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ఆదాయం పెరిగినప్పటికీ ఖర్చులు, పన్ను వ్యయాలు పెరిగిపోవటం పనితీరుపై ప్రభావం చూపించిందని పేర్కొంది. ఈ కాలంలో కంపెనీ మొత్తం వ్యయాలు 20 శాతం పెరిగి రూ.1,431 కోట్లుగా నమోదయ్యాయి. డిసెంబరు త్రైమాసికంలో కొత్తగా 144 స్టోర్లను ప్రారంభించటంతో మొత్తం స్టోర్ల సంఖ్య 4,233కు చేరిందని మెడ్‌ప్లస్ వెల్లడించింది.

## మేడిగడ్డ దర్యాప్తు సంగతి ఏమైంది?

- రెండు వారాల్లో సమాధానం ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టులో అవినీతి, బరాజ్ కుంగుబాటు, ప్రాజెక్టుకు నిధుల సేకరణలో అక్రమాలపై దర్యాప్తు సంగతి ఎంతవరకు వచ్చిందని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇందుకు సంబంధించిన ఫిర్యాదుపై ఏం నిర్ణయం తీసుకున్నారో రెండు వారాల్లో లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశాలు జారీచేసింది. మేడిగడ్డ బరాజ్ నాలుగేళ్లకే కుంగిపోవడంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి. నిరంజన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఇప్పటికే జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని, దానిని సీబీఐకి బదిలీచేయాలని కోరారు. నిధుల సేకరణ తదితర అంశాలపై సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్ (ఎస్ఎఫ్ఐవో)తో దర్యాప్తు జరిపించాలని విన్నవించారు. ఈ పిటిషన్‌కు రిజిస్ట్రీ రెగ్యులర్ నెంబర్ ఇవ్వలేదు. ఫైలింగ్ నంబర్‌తోనే చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఎదుట శుక్రవారం మరోసారి విచారణకు వచ్చింది. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుపై ఏం చర్యలు తీసుకున్నారో లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశాలు జారీచేసింది. విచారణను రెండువారాలకు వాయిదా వేసింది.

## కొత్తగూడెంలో 222 కిలోల గంజాయి పట్టివేత

- మౌలాలిలో గంజాయి అమ్ముతూ పట్టుబడ్డ మరో ఇద్దరు
- మాదాపూర్ ఎస్ఓటీకి చిక్కిన ఫుడ్ డెలివరీ బాయ్..
- గచ్చిబౌలిలో 20 గ్రాముల కొకైన్, ఎండీఎంఏ స్వాధీనం
- ఇద్దరి అరెస్టు.. వారి సమాచారంతో 10 మంది అదుపులోకి!

కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్/రాయదుర్గం/మౌలాలి/నల్లగొండటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా.. అక్కడక్కడ దొంగచాటుగా కొన్ని ముఠాలు సరఫరా చేస్తూ పట్టుబడుతూనే ఉన్నాయి. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పలు సంఘటనల్లో గంజాయి, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొని పలువురిని అదుపులోకి తీసుకున్నారు. భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ఆర్టీసీ పాత డిపో వద్ద సీఐ మురళీ తన సిబ్బందితో వాహనాల తనిఖీలు చేపట్టగా.. సీలేరు నుంచి మహారాష్ట్రకు అక్రమంగా 222.38 కేజీల గంజాయి ప్యాకెట్లను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన సునీల్, శబ్‌రామ్ అలియాస్ సత్పాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇటు హైదరాబాద్‌లోని మౌలాలిలో గంజాయి అమ్ముతున్న దుబ్బాకుల మహేశ్, అడబాల నాగరాజును మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు. నాగ్‌పూర్‌లో గంజాయి కొని తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్నారని.. వీరి వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్న మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఓ ఫుడ్ డెలివరీ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న నవీన్ అనే వ్యక్తిని మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. గచ్చిబౌలి అంజయ్యనగర్‌కు చెందిన అతడి నుంచి 1.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నవీన్‌ను రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. మరో ఘటనలో గచ్చిబౌలి పోలీసులు ఓ యువకుడు, మహిళను అదుపులోకి తీసుకుని 10 గ్రాముల కొకైన్, 10 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిచ్చిన సమాచారంతో ఇప్పటివరకు 10 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

### సిగరెట్ పెట్టెల్లో మత్తు ట్యాబ్లెట్లు పెట్టి..

డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు ట్యాబ్లెట్లు, ఇంజెక్షన్లను కొనుగోలు చేసి వినియోగించడమే కాకుండా ఇతరులకు విక్రయిస్తున్న ఇద్దరితో పాటు ఓ మెడికల్ షాపు యజమానిని నల్లగొండ పట్టణంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహ్మద్ జబీఉల్లా, మహ్మద్ సల్మాన్ కొంతకాలంగా మత్తు పదార్థాలకు బానిసలయ్యారు. స్థానికంగా ఉండే న్యూహెల్త్ కేర్ ఫార్మసీకి చెందిన నరేశ్ ద్వారా ప్రిస్కిప్షన్ లేకుండానే మత్తు ప్రభావిత ట్యాబ్లెట్లు, ఇంజెక్షన్లను అధిక మొత్తంలో కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. బయటి వ్యక్తులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. వీరికి సహకరిస్తున్న మెడికల్ షాపు యజమాని నరేశ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు.


## ఇద్దరు పోలీసోళ్ల గంజాయి స్మగ్లింగ్!

- నిందితులు ఏపీ బెటాలియన్ సిబ్బంది..

నిజాంపేట్/హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గంజాయి స్మగ్లింగ్‌ను అరికట్టాల్సిన పోలీసులే అక్రమ బాట పడితే? ఏపీ బెటాలియన్ కానిస్టేబుళ్లు ఇదే పని చేశారు. భారీగా అప్పులు పేరుకుపోవడం, జీతం సరిపోకపోవడంతో గంజాయి స్మగ్లింగ్‌ను ఎంచుకున్నారు. ఏపీ నుంచి హైదరాబాద్‌కు కార్లో 22 కిలోల గంజాయిని తరలిస్తూ సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులకు దొరికిపోయారు. నిందితులు ఏపీ కాకినాడలోని 'ఏపీ 3వ బెటాలియన్'లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ పట్నాయక్(35), కానిస్టేబుల్ శ్రీనివాసులు (32). పట్నాయక్ సెకండ్ హ్యాండ్ కార్లు విక్రయించే వ్యాపారం ప్రారంభించాడు. అది సరిగా నడవక అప్పులపాలయ్యాడు. శ్రీనివాసులు కాజు, బాదం సరఫరా చేసే వ్యాపారం ప్రారంభించాడు. అనుకున్న స్థాయిలో వ్యాపారం సాగక అప్పులు చేశాడు. అప్పుల నుంచి బయటపడేందుకు ఇద్దరూ కలిసి గంజాయిని స్మగ్లింగ్ చేసి డబ్బు సంపాదించాలనే నిర్ణయానికొచ్చారు. ఆరోగ్యం బాగోలేదని చెప్పి సెలవు పెట్టారు. మచిలీపట్నంలో ఒక గంజాయి సరఫరాదారుడి వద్ద గంజాయిని కొన్నారు. అక్కడి నుంచి కారులో హైదరాబాద్ శివారులోని బాచుపల్లి ప్రాంతానికి చేరుకున్నారు. పారిశ్రామికవాడల్లో విక్రయించే క్రమంలో బాచుపల్లి మీదుగా వెళ్తున్నారు. సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు బాచుపల్లి పోలీసుతో కలిసి ప్రధాన రహదారిపై ఉన్న మారుతి వాహనాన్ని పట్టుకున్నారు. రెండు కేజీల బరువు చొప్పున ఉన్న 11 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాసులు, పట్నాయక్‌ను బాచుపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

## హైస్పీడ్ రైళ్ల ప్రాజెక్టులో వేగం

- మార్చిలోగా హైస్పీడ్ రైల్వే కారిడార్ల సర్వే పూర్తి
- దక్షిణమధ్యరైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ వెల్లడి



హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో త్వరలోనే హైస్పీడ్ రైళ్లకు సంబంధించిన ప్రాజెక్టు పనులు వేగం పుంజుకున్నాయని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ చెప్పారు. దక్షిణ మధ్యరైల్వే పరిధిలోని ప్రాజెక్టులకు తాజా కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు పెరిగాయని పేర్కొన్నారు. శుక్రవారం రైల్ నిలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఏపీలో రాజధాని నగరాలను కలుపుతూ రెండు కారిడార్లను 2023 ఆగస్టులో ప్రతిపాదించారని, ఇందులో ఒకటి శంషాబాద్-విజయవాడ- విశాఖపట్నం కారిడార్ కాగా, మరొకటి విశాఖపట్నం-విజయవాడ- కర్నూలు కారిడార్ అని వెల్లడించారు. ఈ కారిడార్‌లలో మొత్తం 922 కిలోమీటర్ల మార్గానికి సంబంధించి ఇప్పటికే ఏరియల్ సర్వే పూర్తయిందని, ప్రస్తుతం కొనసాగుతున్న ఫీల్డ్ సర్వే మార్చిలోగా పూర్తి కానుందని చెప్పారు. హైస్పీడ్ కారిడార్‌లు అందుబాటులోకి వస్తే గంటకు 220కిలోమీటర్ల వేగంతో రాజధాని నగరాల మధ్య రైళ్లు పరుగులు పెట్టనున్నాయని చెప్పారు. కాగా ప్రధానమంత్రి గతిశక్తి పథకంలో భాగంగా సిమెంట్, పోర్టు కనెక్టివిటీ, హైట్రాఫిక్ డెన్సిటీ రైల్వే కారిడార్ ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు జరిగాయన్నారు. మల్టీమోడల్ కనెక్టివిటీ ద్వారా సరుకు రవాణా సామర్థ్యం మెరుగవుతుందన్నారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలో ఐదు వందేభారత్ రైళ్లు నడుస్తుండగా, వాటి నిర్వహణ సదుపాయాల అభివృద్ధికి కేంద్రం రూ.10కోట్లు కేటాయించిందని చెప్పారు. త్వరలోనే మరికొన్ని రైళ్లు దక్షిణమధ్యరైల్వేకు రావచ్చన్నారు.

### తెలంగాణకు రూ.5 వేలకోట్లు.. ఏపీకి రూ.9 వేలకోట్లు

దక్షిణమధ్య రైల్వే పరిధిలోని రైల్వే ప్రాజెక్టులకు 2024-25 కేంద్ర బడ్జెట్‌లో రూ.14,232.84 కోట్ల కేటాయింపులు జరిగాయని జీఎం అరుణ్‌కుమార్ తెలిపారు. ఇందులో తెలంగాణ పరిధిలోని ప్రాజెక్టులకు రూ.5,071 కోట్లు కేటాయించగా, ఏపీ ప్రాజెక్టులకు రూ.9,138 కోట్లు కేటాయించారని, నిరుడు బడ్జెట్ కేటాయింపుల కంటే తెలంగాణకు 14.7శాతం, ఏపీకి 8.7శాతం అదనంగా వచ్చినట్లు చెప్పారు. ఈ బడ్జెట్‌లో దక్షిణ మధ్యరైల్వే పరిధిలో కొత్తగా రెండు డబ్లింగ్ లైన్లు, ఒక బైపాస్ లైన్‌ను కేంద్రం మంజూరు చేసిందని, భద్రాచలం-డోర్నకల్ మధ్య రూ.770 కోట్లతో 54.65 కిలోమీటర్లు, ఔరంగాబాద్-అంకాయ్ మధ్య రూ.960 కోట్లతో 98 కిలోమీటర్ల డబ్లింగ్ ప్రాజెక్టులను వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపడతామన్నారు.

# కృష్ణా జలాలను కాపాడేది బీఆర్ఎస్సే

## నీటి వాటాపై ప్రధాని మోదీ పట్టించుకోరా?.. తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టిన రేవంత్

- రాష్ట్రంలో అధికారంలోకిదొంగలు : కేటీఆర్
- ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలపై స్పందించరా?
- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ



ఘట్‌కేసర్‌లో బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ విజయోత్సవ సభలో మాట్లాడుతున్న కేటీఆర్

ఘట్‌కేసర్ రూరల్/హైదరాబాద్/వికారాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): "కృష్ణా జలాల్లో మన వాటా తేల్చడానికి ప్రధాని మోదీకి సమయం లేకుండా పోయింది. కృష్ణా జలాలు, రాష్ట్ర ప్రజల కోసం పోరాటం చేయడం బీఆర్ఎస్‌కే సాధ్యం. సీఎం రేవంత్ తెలంగాణ హక్కులను కేంద్రం వద్ద తాకట్టుపెట్టారు" అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం కొర్రెములలో ఎమ్మెల్యే మల్లారెడ్డి అధ్యక్షతన మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ విజయోత్సవ సభ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. సీఎం హోదాలో ఉన్న రేవంత్ 6 గ్యారెంటీలు కావాలంటే కాంగ్రెస్‌కే ఓటు వేయాలనడం సిగ్గుచేటని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను నెరవేర్చకపోతే వెంటాడి భరతం పడతామని హెచ్చరించారు. రెండు జాతీయ పార్టీలను నిలదీయాలంటే పార్లమెంటులో బీఆర్ఎస్ సభ్యులు ఉండాల్సిందేనన్నారు. సచివాలయంలో లంకె బిందెలున్నాయని వచ్చి చూసేసరికి ఖాళీ కుండలు ఉన్నాయని సీఎం రేవంత్ అనడం దురదృష్టకరమని విమర్శించారు. లంకెబిందెల కోసం రాత్రిపూట దొంగలు గడ్డపారలు, తట్టపారలు పట్టుకొని నెత్తిపై గుడ్డలు వేసుకొని వస్తారన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అదే దొంగలు అధికారంలోకి వచ్చారని వ్యాఖ్యానించారు. సచివాలయంలో లంకెబిందెలుండవని కంప్యూటర్లు, ఫైళ్లు ఉంటాయని, ఇదే విషయాన్ని సీఎంకు చెప్పాలని ఆయన అన్నారు.

### బాలుడి వైద్య ఖర్చులకు రూ.లక్ష సాయం

బాలుడి చికిత్స కోసం కేటీఆర్ లక్ష రూపాయలను సాయంగా అందించారు. ఘట్‌కేసర్‌లోని మైసమ్మగుట్ట కాలనీకి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త శేషు కుమారుడు ప్రదీప్(8)కు వినిపించదు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించినా ఫలితం కనిపించలేదు. హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తీసుకెళ్లగా.. చికిత్సకు రూ.10 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఇందులో రూ.5లక్షలు ఈఎస్ఐ నుంచి సాయం అందనుందని శేషు తెలపగా.. కేటీఆర్ తన వంతుగా రూ.లక్ష విలువైన చెక్కును అందజేశారు.

### ఆటో తగులబెట్టుకున్నా కనికరించరా?

రాష్ట్రంలో ప్రజాపాలన తెస్తామని అడ్డగోలు హామీలిచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక ప్రజావ్యతిరేకిగా మారిందని, సర్కారు అనాలోచిత విధానాల వల్ల రాష్ట్రంలో ఆటోడ్రైవర్లు సంక్షోభంలో కూరుకుపోయారని కేటీఆర్ ఆరోపించారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. ప్రజాభవన్ ముందే ఒక డ్రైవర్ తన ఆటోకు నిప్పుపెట్టుకున్నా.. ముఖ్యమంత్రి ఇప్పటివరకు స్పందించకపోవడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. ఆటోలకు గిరాకీ లేకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 15మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, ఈ సంఘటనలపై స్పందించరా..? అని సీఎంను ప్రశ్నించారు. ఆటో డ్రైవర్లకు ప్రతి నెలా రూ.10 వేల ఆర్థికసాయం అందించాలని, ఆత్మహత్య చేసుకున్న 15మంది ఆటోడ్రైవర్లకు చెందిన ప్రతి కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోందన్నారు. దీనిపై స్పందించకుంటే.. 6.50 లక్షల మందితో కలిసి పోరాటం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు.

### నర్సులు, కానిస్టేబుల్ పోస్టులు మా ఘనతే

తమ ప్రభుత్వ హయాంలో ప్రకటించిన స్టాఫ్ నర్సులు, కానిస్టేబుల్ ఉద్యోగాల ఘనతను కాంగ్రెస్ ప్రభుత్వం వాడుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో 6956 స్టాఫ్ నర్సులు, 15,750 పోలీసు కానిస్టేబుళ్ల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను తమ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించామని, దురదృష్టవశాత్తూ ఎన్నికల కోడ్ రావడంతో పూర్తి చేయలేకపోయామని శుక్రవారం ఎక్స్‌లో తెలిపారు. ఈ నియామకాల గురించి ప్రస్తుత ప్రభుత్వం ఏమీ చేయకపోయినా.. తామే భర్తీ చేశామని సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల కోసం మాట్లాడాలంటే పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఉండాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ఎంపీలు ఉంటేనే రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేసే అవకాశం ఉంటుందని చెప్పారు.

### నీటిపారుదల శాఖ శ్వేతపత్రంలో

## విజిలెన్స్ నివేదిక

- తుది రూపు ఇస్తున్న అధికారులు
- అసెంబ్లీ సమావేశాలకు ముందే శ్వేతపత్రం విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖపై విడుదల చేయనున్న శ్వేతపత్రం విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులపై విచారణ అనంతరం విజిలెన్స్ సమర్పించే మధ్యంతర నివేదికను కూడా శ్వేతపత్రంలో పొందుపరచాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రం ఆవిర్భావానికి పూర్వం, తర్వాత.. నీటి పారుదల ప్రాజెక్టులపై నిధుల వినియోగం, ఆయా ప్రాజెక్టుల వల్ల కలిగిన ప్రయోజనాలు, ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులోని నిర్మాణ లోపాలు, జరిగిన అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే, ప్రభుత్వ ఆదేశాలతో నివేదికను సిద్ధం చేస్తోన్న అధికారులు దానికి తుది రూపు ఇచ్చే పనిలో పడ్డారు. నిజానికి, ఇంధన శాఖపై విడుదల చేసిన శ్వేతపత్రం నిరాశజనకంగానే ఉందని ప్రభుత్వం గుర్తించింది. దాంతో నీటిపారుదల శాఖ శ్వేతపత్రం విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. శ్వేతపత్రంలో పొందుపరిచే వివరాలన్నింటిపై ఆచితూచి వ్యవహరిస్తోంది. అయితే, అసెంబ్లీ సమావేశాల కన్నా ముందే శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించగా.. ఈనెల 4వ తేదీ (మంత్రివర్గ సమావేశం) నాటికి తుదిరూపు ఇచ్చే పనిలో యంత్రాంగం తలమునకలైంది.

### అసెంబ్లీ సమావేశాల్లో కాగ్ నివేదిక

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని అన్ని కాంపోనెంట్లపై ఏడాదిన్నరకు పైగా విచారణ జరిపిన కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) జనవరి 29వ తేదీన రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదిక కూడా అసెంబ్లీ సమావేశాల్లో విడుదల కానుంది. దాంతో రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చలన్నీ నీటిపారుదల ప్రాజెక్టుల చుట్టూనే జరగనున్నాయి.



## గడలా.. మజాకా!

- కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థిత్వం కోసం మాజీ డీహెచ్ గడల శ్రీనివాస్ దరఖాస్తు
- గతంలో బీఆర్ఎస్ తరఫున పోటీకి యత్నాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం లేదా సికింద్రాబాద్ లోకసభ స్థానాల నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ మాజీ డీహెచ్ గడల శ్రీనివాస్ శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు.ఈ మేరకు గాంధీభవన్‌కు ఆయన దరఖాస్తులు పంపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీతో అంటకాగిన ఆయన.. ఆ పార్టీ అధికారం కోల్పోగానే ప్లేటు ఫిరాయించి కాంగ్రెస్ వైపు చూడడం హాట్ టాపిక్‌గా మారింది. 2018లో డీహెచ్‌గా నియమితులైన గడల శ్రీనివాస్.. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయే వరకూ ఆ పోస్టులోనే కొనసాగారు. ప్రభుత్వ అధికారి అయి ఉండీ.. పలు వేదికల పైన బీఆర్ఎస్‌కు అనుకూలంగా బహిరంగంగానే ప్రకటనలు చేశారు. ఈ అంశం అప్పట్లో రాజకీయంగా దుమారం రేపింది. కొత్తగూడెం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా రంగంలోకి దిగేందుకు తన వంతుగా ఆయన విశ్వ ప్రయత్నాలు చేశారు. అయితే, సిట్టింగ్‌కే సీటు ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించడంతో అక్కడ వనమా వెంకటేశ్వర్‌రావే పార్టీ అభ్యర్థి అయ్యారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ఓటమిపాలై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక గడల శ్రీనివాస్‌ను డీహెచ్ పోస్టు నుంచి తప్పించారు. అప్పటి నుంచీ ఆయన దీర్ఘకాలిక సెలవులో కొనసాగుతున్నారు. అయితే ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణల ఫైళ్లను రేవంత్ ప్రభుత్వం దుమ్ము దులుపుతోందని, త్వరలోనే ఆయనపై ఏసీబీ దాడులు నిర్వహించేందుకు కసరత్తు జరుగుతోందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి దగ్గరై ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో భాగంగానే గడల శ్రీనివాస్.. సికింద్రాబాద్, ఖమ్మం సీట్ల నుంచి అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

# ప్రాజెక్టులను అప్పగించలేం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటనలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను ఒక్క రోజులోనే యుద్ధప్రాతిపదికన శుక్రవారం బోర్డు విడుదల చేసింది. ఈ నెల 27న కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి తెలంగాణ అభిప్రాయాలను స్పష్టం చేస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా రాసిన లేఖను ఈఎన్‌సీ మురళీధర్ అందించగా.. ఆ అంశాన్నీ మినిట్స్‌లో జతపర్చింది.

### ఆ మినిట్స్‌లో ఏముందంటే...

**తెలంగాణ ఈఎన్‌సీ:** ప్రాజెక్టుల అప్పగింతపై జనవరి17న కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన సమావేశానికి సంబంధించిన మినిట్స్‌లో సవరణలు చేయాలని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి లేఖ రాశారు. నీటి వాటాలు తేలే దాకా ప్రాజెక్టులను అప్పగించలేం. కృష్ణా జలాలను ట్రైబ్యునల్ పంచే దాకా 50:50 నిష్పత్తిలో నీటిని పంచాలి. శ్రీశైలం జలాశయం కట్టింది జలవిద్యుత్ ఉత్పాదన కోసమే. నాగార్జునసాగర్ పరిధిలో నీటి అవసరాలు తీర్చడానికి వీలుగా దీన్ని



కట్టారు. శ్రీశైలం ప్రాజెక్టులో కనీస నీటిమట్టం 830 అడుగులుగా ఉండాలి. ప్రాజెక్టుల ఆపరేషనల్ ప్రొటోకాల్ తేలేదాకా వాటిని అప్పగించలేం. జలవిద్యుత్ కేంద్రాలతోపాటు ప్రాజెక్టులను అప్పగించాలంటే తెలంగాణ ప్రభుత్వమే అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అనుమతి లేకుండా ప్రాజెక్టులను బోర్డుకు ఇవ్వలేం.

**ఏపీ ఈఎన్‌సీ:** సాగర్, శ్రీశైలం పరిధిలోని కాంపోనెంట్లను కృష్ణా బోర్డుకు అప్పగించడానికి మాకు ఎలాంటి అభ్యంతరాల్లేవు. అయితే తెలంగాణ ప్రాజెక్టులతోపాటే మా ప్రాజెక్టులను తీసుకోవాలి.

**కృష్ణాబోర్డు:** ఒకవేళ ప్రాజెక్టులను బోర్డుకు అప్పగిస్తే... ఆ ప్రాజెక్టుల వద్ద ఇరు రాష్ట్రాల నుంచి సమాన సంఖ్యలో ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తారు. వేతనాలతోపాటు ఇతర ప్రయోజనాలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలి. 15 కాంపొనెంట్ల కోసం ఏ మేరకు ఉద్యోగులు కావాలో... ఆ వివరాలన్నీ వారంలోగా బోర్డుకు అందించాలి. ప్రాజెక్టులన్నీ బోర్డు నియంత్రణలోనే ఉంటాయి. అయితే, నిరంతర, అత్యవసర నిర్వహణ పనులను సంబంధిత రాష్ట్రాలు.. ఇదివరకు ఏ పద్ధతిని(శ్రీశైలం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్, సాగర్‌ను తెలంగాణ) పాటించాయో.. అదే పాటించాలి.

**తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలు:** త్రిసభ్య కమిటీ(కృష్ణాబోర్డు సభ్యకార్యదర్శి, తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలు సభ్యులుగా ఉండే) తీసుకునే నిర్ణయాలు/వాటర్ రిలీజ్ ఆర్డర్‌ను కచ్చితంగా ఆయా కాంపొనెంట్లలో అమలు చేయాలి.

**కృష్ణాబోర్డు చైర్మన్:** నాగార్జునసాగర్, శ్రీశైలంతో పాటు 15కాంపొనెంట్లను పూర్తిస్థాయిలో బోర్డుకు అప్పగించాలి. వీటి నిర్వహణకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం నిధులను విడుదల చేయాలి. నాగార్జునసాగర్ డ్యామ్‌పై మోహరించిన సీఆర్‌పీఎఫ్ బలగాలు ఇరు రాష్ట్రాల అధికారులను ప్రాజెక్టుపైకి అనుమతిస్తాయి. ప్రాజెక్టు వద్ద ఏ పనులు చేయాలన్నా.. ఉద్యోగులను నియమించాలన్నా బోర్డు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

## ప్రాజెక్టులను అప్పగిస్తామని చెప్పలేదు

- జలశక్తి శాఖ సమావేశం మినిట్స్‌ను మార్చాలని గతంలోనే లేఖ రాశాం
- నీటి పారుదల శాఖ కార్యదర్శి బొజ్జా
- కృష్ణా బోర్డుది ప్రేక్షక పాత్రే: ఈఎన్‌సీ



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలపై బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్(కృష్ణా ట్రైబ్యునల్-2) తీర్పు వెలువడే దాకా, నీళ్లను 50:50 నిష్పత్తితో పంచాలనే డిమాండ్‌కు కట్టుబడి ఉన్నామని తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా స్పష్టం చేశారు. జనవరి 17వ తేదీన కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ నేతృత్వంలో జరిగిన సమావేశంలో కృష్ణా ప్రాజెక్టులను అప్పగిస్తామని చెప్పినట్లు మినిట్స్‌లో రికార్డయిందని, అయితే తాము చెప్పిన అంశాలేవీ అందులో నమోదు కాలేదని తెలిపారు. ప్రాజెక్టులను అప్పగిస్తామని తాము చెప్పలేదని, ఈ మేరకు మినిట్స్‌లో సవరణలు చేయాలని కోరుతూ జనవరి 27న కేంద్రానికి లేఖ రాశామని చెప్పారు. కృష్ణాబోర్డు సమావేశంలోనూ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశామని తెలిపారు. 10 కాంపొనెంట్లను అప్ప గించాలంటే తెలంగాణ ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందనే ఈఎన్‌సీ నివేదించారని తెలిపారు. జలసౌధలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బోర్డులకు ప్రాజెక్టుల అప్పగింత నిర్ణయం ఇప్పటిది కాదని, 2023-24 బడ్జెట్‌లోనేఅప్పటి ప్రభుత్వం దీనిపై ప్రకటన చేసిందని గుర్తు చేశారు. ఆపరేషనల్ ప్రొటోకాల్ తేలితేనే ప్రాజెక్టులను అప్పగించడానికి అవకాశం ఉంటుందన్నారు. కాగా, సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులపై కృష్ణాబోర్డుది ప్రేక్షకపాత్ర మాత్రమేనని ఈఎన్‌సీ(జనరల్) మురళీధర్ స్పష్టంచేశారు. ఎన్జీటీ ఆదేశాలు ఉన్నా.. ఏపీ ప్రభుత్వం అక్రమంగా రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు చేపడుతోందని ఆక్షేపించారు. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాలంటే నీళ్లను ఏ ప్రాతిపదికన పంచుకోవాలనే అంశాలతో ముడిపడిన ఆపరేషనల్ ప్రొటోకాల్‌పై తెలుగు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరాల్సి ఉంటుందని చెప్పారు.



## ప్రజాస్వామ్యాన్ని అంతమొందించే పనిలో మోదీ

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిరాజా

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి మోదీ ప్రజాస్వామ్యాన్ని అంతమొందించి ఏకస్వామ్య, ఫాసిస్టు, నియంతృత్వ వ్యవస్థలను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా ఆరోపించారు. హైదరాబాద్‌లో మూడు రోజులపాటు జరగనున్న సీపీఐ జాతీయ సమితి సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ.. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అనే నినాదం అధ్యక్ష తరహా పరిపాలన కోసమేనని సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో భారత దేశానికి బీజేపీ పాలన నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యమని ప్రకటించారు. బీజేపీని ఓడించేందుకే 'ఇండియా కూటమి'లో సీపీఐ భాగస్వామిగా ఉందని చెప్పారు.

# రిజర్వ్‌డ్ సీట్లకు గట్టి పోటీ!

- కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థిత్వానికి ఒక్కరోజే వందకు పైగా దరఖాస్తులు
- వరంగల్, పెద్దపల్లి, మహబూబాబాద్ స్థానాలకు భారీగా అప్లికేషన్లు
- హైదరాబాద్ సీటుకు రెండే..
- దరఖాస్తుకు నేడే ఆఖరు

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థిత్వానికి శుక్రవారం వందకు పైగా మంది దరఖాస్తు చేసుకున్నారు. శనివారం (నేటి)తో దరఖాస్తుల గడువు ముగియనుంది. రాష్ట్రంలోని 17 నియోజకవర్గాలకు గత మూడ్రోజులు కలుపుకొని 150 దాకా దరఖాస్తులు అందినట్లు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. జనరల్ సీట్ల కంటే రిజర్వ్‌డ్ నియోజకవర్గాలకే ఆశావహుల పోటీ ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించాయి. ఎస్సీ రిజర్వుడు సీట్లయిన వరంగల్, పెద్దపల్లి నియోజకవర్గాలకు.. ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లోని మహబూబాబాద్ సీటుకు ఎక్కువగా దరఖాస్తులు అందినట్లు వివరించాయి. హైదరాబాద్ సీటు కోసం ఇద్దరు మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం ఇచ్చాయి.

### ఖమ్మం సీటుకు సీనియర్ నేతల పోటీ..

ఖమ్మం సీటు కోసం గట్టి పోటీ నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిత, పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు తదితరులు గురువారం ఈ సీటు కోసం దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, వీవీసీ మోటార్స్ అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్.. మరికొందరు కూడా దరఖాస్తు చేశారు. అలాగే కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరితో పాటు మరికొందరు శనివారం దరఖాస్తు చేసుకునే అవకాశముందని పార్టీ వర్గాల సమాచారం. ఇటు నల్లగొండ సీటు కోసం పార్టీ నేత పటేల్ రమేశ్‌రెడ్డి దరఖాస్తు చేశారు.

### భువనగిరి స్థానానికి బీసీ నేతల క్యూ..

కాంగ్రెస్‌కు హాట్ సీట్‌గా ఉన్న మరో నియోజకవర్గం భువనగిరి సీటు కోసం నేతలు పోటీ పడుతున్నారు. అయితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఈ సీటును బీసీలకు కేటాయించాలన్న డిమాండ్ తెరపైకి రావడంతో ఆ వర్గం నేతలు దరఖాస్తుకు క్యూ కడుతున్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ సహా పలువురు బీసీ నేతలు దరఖాస్తు చేసుకుని తమ వంతు ప్రయత్నాల్లో పడ్డారు. ఇక మల్కాజ్‌గిరి సీటు కోసం పార్టీ నేత, సినీ నిర్మాత బండ్ల గణేశ్ తాజాగా దరఖాస్తు చేసుకున్నారు.



పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో శుక్రవారం ఉదయమే కాంగ్రెస్‌లో చేరిన విద్యావేత్త విద్యాస్రవంతి.. ఆ వెంటనే సికింద్రాబాద్ సీటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇదే సీటుకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి కూడా దరఖాస్తు చేశారు. ఇటు నాగర్‌కర్నూల్ సీటు కోసం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు పెదపల్లి సీటుకోసం టీపీసీసీ కార్యదర్శి పెరిక శ్యాం దరఖాస్తు చేసుకున్నారు.

# బీఆర్ఎస్ అవినీతిపై విచారణ ఏదీ..?

- నాడు రేవంత్ తీవ్ర ఆరోపణలు చేశారు కదా
- యువతను కాంగ్రెస్ మోసం చేసింది
- హామీలనూ ఎగ్గొట్టే యత్నం: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తుత్తి ఫైటింగ్ చేస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై టీపీసీసీ అధ్యక్షుడిగా తీవ్ర ఆరోపణలు చేసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు సీఎం అయ్యాక ఎందుకు విచారణ జరిపించడం లేదని నిలదీశారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్ చుట్టూ భూ అక్రమ లావాదేవీలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత వరకు దర్యాప్తు జరపలేదని అన్నారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్‌పై కోపంతో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని చెప్పారు. బీఆర్ఎస్‌ను ఓడించాలనే పట్టుదలతో తీర్పునిచ్చారు తప్ప.. కాంగ్రెస్‌ను గెలిపించాలని కాదని పేర్కొన్నారు. నమ్మి ఓటేసిన తెలంగాణ యువతను కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో 4వ తేదీ నుంచి మూడు రోజుల పాటు పార్లమెంటు నియోజకవర్గ ప్రవాస్ సమావేశాలు నిర్వహించనున్నారు. 5 నుంచి 8 వరకు గావ్ చలో అభియాన్, మార్చి 5 నుంచి 10 వరకు కాలేజీలు, వర్సిటీలు, మండల స్థాయిలో యువతతో భేటీలు, ఈ నెల 5 నుంచి వచ్చే నెల 5 వరకు అయోధ్య దర్శన్, 27 నుంచి 29 వరకు కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమావేశాలు, ఈ నెల 10లోపు పార్లమెంటు ఎన్నికల కార్యాలయాలు, 29లోపు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కార్యాలయాలు ప్రారంభించాలని పార్టీ నిర్ణయించింది.



మంత్రి పొంగులేటి దంపతులు రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైని కలిశారు. తన తమ్ముడి కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.

## వీఆర్వో వ్యవస్థను తిరిగి తీసుకొస్తాం

» రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తొలగించిన గ్రామ రెవెన్యూ వ్యవస్థను తిరిగి తీసుకువస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన నివాసంలో డిప్యూటీ కలెక్టర్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండవని, గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ వస్తుందని చెప్పారు. తమ ప్రభుత్వంలో ప్రజాపాలన సుభిక్షంగా ఉంటుందని, అందుకోసమే ఆరు గ్యారెంటీలను తీసుకువచ్చామని తెలిపారు. రద్దయిన వీఆర్వోలను సమానమైన హోదా, సర్వీసు భద్రతతో రెవెన్యూ ఉద్యోగులతో సమానమైన కామన్ సీనియారిటీతో రెవెన్యూ శాఖలోకి తీసుకువచ్చి, అర్హులైన వారందరికీ పదోన్నతి కల్పించాలని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రమోహన్ కోరారు. గ్రామస్థాయిలో రెవెన్యూ ఉద్యోగి లేకపోవడంతో మండల స్థాయిలో పనిభారం పెరిగి అనారోగ్యానికి గురవుతున్న ఉద్యోగుల సంఖ్య పెరుగుతోందని ట్రెసా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

## బాయిల్డ్ రైస్ కొనుగోలుకు కేరళ ఆసక్తి

» నివేదిక రూపొందించాలని మంత్రి ఉత్తమ్ ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేరళ ప్రభుత్వానికి సహకారం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్దంగా ఉందని రాష్ట్ర పౌరసరఫ రాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కేరళ రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి జీఆర్ అనిల్ శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రం నుంచి బాయిల్డ్ రైస్, మిర్చి పంటను కొనుగోలు చేయడానికి కేరళ సుముఖత వ్యక్తం చేసింది. 2 లక్షల టన్నుల బాయిల్డ్ రైస్ కొనుగోలుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. అదే విధంగా ఏటా కేరళ ప్రజల ఆహార అవసరాలను తీర్చేందుకు 10 లక్షల టన్నుల బియ్యం పంపించాలనే ప్రతిపాదనను మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకువచ్చింది. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ పోటీ ధరతో కేరళ బియ్యం అవసరాలను తెలంగాణ తీరుస్తుందని ఆ రాష్ట్ర మంత్రికి హామీ ఇచ్చారు. కేరళ ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలు పరిశీలించి, సమగ్ర నివేదిక రూపొందించాలని కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను ఆదేశించారు. ఈ అంశాలపై రెండు రాష్ట్రాల అధికారులతో కమిటీ వేసి చర్చించాలని నిర్ణయించారు.

## మరో 2000 కోట్ల అప్పు తీసుకోనున్న రాష్ట్రం

రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2000కోట్ల అప్పు తీసుకోనుంది. దీనికి సంబంధించి సెక్యూరిటీ బాండ్లను ఆర్‌బీఐకి విడుదల చేసింది. 11 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 21 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్ల చొప్పున అప్పు తీసుకోనున్నట్లు ప్రకటించింది. ఈ నెల 6న ఆర్‌బీఐ నిర్వహించే వేలం పాట ద్వారా ఈ అప్పును సేకరించనుంది. రాష్ట్రంతో కలిపి దేశంలోని 14రాష్ట్రాలు రూ.26,710కోట్ల అప్పుల కోసం సెక్యూరిటీ బాండ్లను విడుదల చేశాయి.

## 'పద్మ' పురస్కారాలకు ఎంపికైన వారికి 4న రాష్ట్ర ప్రభుత్వ సన్మానం

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక పద్మ విభూషణ్, పద్మ శ్రీ పురస్కారాలకు ఎంపికైన వారిని ఘనంగా సత్కరించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. శిల్పకళా వేదికలో ఈ నెల 4న ఏర్పాటు చేసే కార్యక్రమానికి రావాలంటూ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రముఖ సినీ నటుడు చిరంజీవిని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆహ్వానించారు. పద్మ విభూషణ్ అవార్డుకు ఎంపికైన సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని వెంకయ్యనాయుడిని ఆయన నివాసంలో శుక్రవారం మంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే అన్నపూర్ణ స్టూడియోస్‌లో చిరంజీవిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురిని శాలువాలతో సత్కరించారు. వీరితో పాటు పద్మ శ్రీ పురస్కారాలకు ఎంపికైన దాసరి కొండప్ప, గడ్డం సమ్మయ్య, కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్‌లాల్, స్థపతి ఆనందాచారిలను ప్రభుత్వం ఘనంగా సత్కరించనుంది.

## టీహబ్, బాల వికాస మధ్య ఎంవోయూ

» గ్రామీణ ప్రాంత ఆవిష్కరణలకు ప్రోత్సాహం: ఆంథోని అనీష్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాన్ని చూపే స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు బాలవికాసతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని టీహబ్ సీఓఓ ఆంథోని అనీష్ తెలిపారు. ఐటీ మంత్రి డి.శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో టీహబ్ సీఓఓ ఆంథోని అనీష్, బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరెడ్డి సింగిరెడ్డి ఒప్పందంపై సంతకాలు చేశారు. ఎంవోయూలో భాగంగా గ్రామీణ ప్రాంత ఆవిష్కరణలను ప్రోత్సహించడంతోపాటు, వాటి ఉన్నతికి సహకరిస్తారు. గ్రామీణ ప్రాంతాల ఆవిష్కరణలు, సామాజిక ఆవిష్కరణలను ప్రోత్సహించడంతోపాటు వాటికి సరైన దిశా నిర్దేశం, సహకారం అందిస్తామని అనీష్ తెలిపారు.

## టేకులగూడెం దాడి సూత్రధారి ఫొటో విడుదల



దుమ్ముగూడెం, ఫిబ్రవరి 2: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా-బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లోని టేకలగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఆర్‌పీఎఫ్ పోలీస్ క్యాంపుపై గత నెల 30న జరిగిన మావోయిస్టుల దాడి వెనుక దేవా అలియాస్ బర్సే సుక్కా ప్రధాన సూత్రధారిగా ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటివరకూ దేవా తన ఫొటోలను ఎక్కడా బయటకు రాకుండా జాగ్రత్తపడగా, తొలిసారిగా పోలీసులు అతని ఫొటోను విడుదల చేశారు. క్యాంపుపై రాకెట్లు, బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లతో దాడి చేసిన సంఘటనలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతిచెందగా, మరో 15 మంది జవాన్లు గాయపడిన విషయం తెలిసిందే. అయితే, తొలుత ఈ ఘటనకు పాల్పడింది మావోయిస్టు కీలకనేత హిడ్మాగా పోలీసులు అనుమానించారు. కానీ ఈ పకడ్బందీ వ్యూహంలో దేవా కూడా కీలకంగా వ్యవహరించినట్లు భావిస్తున్నారు.

## అగ్రి వర్సిటీల వీసీల భర్తీకి నోటిఫికేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్‌లర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈమేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

## పదేళ్లుగా ఆఫీసుకు రాకున్నా జీతం

» శ్రీనివాస్‌గౌడ్ అండదండలతో ఉద్యోగి నిర్వాకం

» వైద్య మంత్రికి తెలంగాణ ఉద్యోగుల సంఘం లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నారాయణగూడలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)లో పనిచేస్తున్న ల్యాబ్ అటెండెంట్ సత్యనారాయణ గౌడ్ అనే ఉద్యోగి గత పదేళ్లుగా ఆఫీసుకు రాకున్నా జీతం తీసుకుంటున్నాడని ఐపీఎం తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. ఆయన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరింది. ఈమేరకు సంఘం అధ్యక్షుడు మహేశ్‌కుమార్.. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు శుక్రవారం లేఖ రాశారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అండదండలతో నెలకోసారి వచ్చి సంతకం పెట్టి జీతం తీసుకునేవాడని అందులో పేర్కొన్నారు. ఐపీఎం డైరెక్టర్ శివలీల, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కుమార్ అతనికి సహకరించేవారని కూడా ఆరోపించారు. సత్యనారాయణ గౌడ్ తోపాటు ఆయనకు సహకరించిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎవడ్రా కూల్చేది

(మొదటిపేజీ తరువాయి)

ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటామని ప్రకటించారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారమే ఇంద్రవెల్లి గడ్డ నుంచే అభివృద్ధికి శ్రీకారం చుట్టామని తెలిపారు.

### ఆనాడు తప్పిదం జరిగింది

సమైక్యాంధ్ర పాలకులు 1981లో అమాయక ఆదివాసీ బిడ్డలను తుపాకీలతో కాల్చి చంపుతుంటే, నాటి తెలంగాణ నేతలందరం నిస్సహాయులై చేతులు ముడుచుకుని కూర్చున్నామని, నాడు జరిగిన తప్పుకు మన్నించాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆదివాసీ బిడ్డలను గుండెల్లో పెట్టి చూసుకుంటామని గతంలోనే మాటిచ్చామని గుర్తుచేశారు. నాడు అమరులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లతోపాటు ఇళ్లు కట్టుకునేందుకు రూ.5లక్షల నిధులు మంజూరు చేస్తామన్నారు. సమైక్య రాష్ట్రంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దేందుకే సోనియా తెలంగాణ ఇచ్చారని చెప్పారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏనాడైనా అడవిబిడ్డల కోసం ఇంద్రవెల్లి అమరవీరుల గురించి ఆలోచించారా?అని రేవంత్ ప్రశ్నించారు.



నాగోబా ఆలయం వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు సురేఖ, కోమటిరెడ్డి, భట్టి, తుమ్మల

చెరుకు తోటలో అడవి పందులు పడ్డట్లుగా బీఆర్‌ఎస్ నేతలు పదేళ్ల పాటు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారన్నారు. కేసీఆర్ నాయకత్వంలో ఏడు లక్షల కోట్ల రూపాయలు అప్పు తెచ్చారని, అందులో ఎప్పుడో కట్టిన కడెం ప్రాజెక్టు మరమ్మతులకు, సదర్మాట్ ప్రాజెక్టు నిర్మాణానికి డబ్బులు ఇవ్వడానికి చేతులు రాలేదని ప్రస్తావించారు. అడవి బిడ్డలు నివసించే గూడేలకు రోడ్లు వేశారా? రూ.40వేల కోట్లతో చేపట్టిన మిషన్ భగీరథ నుంచి తాగునీరు ఏమైనా అందించారా?అని ప్రశ్నించారు. అదే చేస్తే తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రూ.60 కోట్లు ఇవ్వాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని అడిగారు. ట్రైకార్ ద్వారా తరగతి గదుల నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. ఏ రోజైనా ఆదివాసీ బిడ్డల సంక్షేమం గురించి కేబినెట్‌లో సమీక్షించారా? అని ప్రశ్నించారు. ఎంత సేపు నీ బిడ్డలు, ఫాంహౌజ్ కట్టుకోవాలనే ధ్యాస తప్ప ప్రజల గురించి ఆలోచించలేదన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలు ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో తాము ఒకేసారి ఏడువేల మంది స్టాఫ్ నర్సుల ఉద్యోగాలను ఇచ్చామని చెప్పారు. నిరుద్యోగ యువత ఇబ్బందుల్లో ఉంటే కోర్టు కేసులను పరిష్కరించకుండా కేసీఆర్ సర్కారు నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా 15 రోజుల్లోనే 15 వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఎవరి చేతుల్లో తెలంగాణ భద్రంగా ఉంటుందో ప్రజలే ఆలోచించాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

### కేసీఆర్ పాపాల భైరవుడు

కేసీఆర్ జీవితంలో మళ్లీ ఎప్పటికీ ముఖ్యమంత్రి కాలేరని రేవంత్ అన్నారు. నిత్యానందస్వామి మాదిరిగా ఒక దీవిని కొనుక్కొని రాజుగా ప్రకటించుకోవాలని కేసీఆర్‌కు సూచించారు. గిరిజనులను, మహిళలను, మైనార్టీలను, దళితులను నిలువు దోపిడీ చేసిన కేసీఆర్ మళ్లీ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారని, ఆరు ఏడు సీట్లను గెలిపించుకుని మోదీకి అమ్ముకుందామని పథకం వేశారని ఆరోపించారు. ఇక్కడ ఎంపీలను గెలిపించుకుని ఢిల్లీకి వెళ్లి మోదీకి అమ్ముకోవడం కేసీఆర్‌కు అలవాటైన వ్యవహారమేనని చెప్పారు. దేశంలో రెండే కూటములు ఉన్నాయని ఇండియా కూటమిలోకి కేసీఆర్‌ను రానిచ్చే ప్రసక్తే లేదన్నారు. బీఆర్‌ఎస్ ఇంటి మీది పిట్ట కాంగ్రెస్ ఇంటి మీద వాలినా కాల్చిపడేస్తామని స్పష్టం చేశారు. పేదవాడి ఖాతాలో రూ.15 లక్షలు, పేదలకు ఇళ్లు, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలని చెప్పిన మోదీ ఎవరికి ఇచ్చారో చెప్పాలన్నారు. ఆదివాసీ బిడ్డ సోయం బాపురావుకు కనీసం మంత్రి పదవి కూడా ఇవ్వలేదని ప్రస్తావించారు. మోదీ, కేడీ ఇద్దరూ కలిసి కాంగ్రెస్‌ను అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేయడంతో పాటు వర్సిటీ ఏర్పాటు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్రంలో 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. రాహుల్ ప్రధాని కావాలంటే ఆదిలాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగుర వేయాలని పిలుపునిచ్చారు.



ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో తెలంగాణ పునర్నిర్మాణ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

## ఇంద్రవెల్లి జనసంద్రం

సభకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి భారీగా జనం తరలివచ్చారు. పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. మధ్యాహ్నం 1.30గంటలకు ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండ సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వెంకట్ రెడ్డి కోమటిరెడ్డిలు నాగోబా ఆలయానికి చేరుకున్నారు. కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళ సంఘాలతో ప్రత్యేకంగా సమావేశమై మేస్రం వంశీయుల ఆశీస్సులు తీసుకున్నారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతివనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సభా వేదిక పైనుంచే రేవంత్ గంట కొట్టి పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. సాయంత్రం 4 గంటల వరకు రేవంత్ కోసం ఎండలో ప్రజలు ఓపికగా ఎదురు చూశారు. సీఎం ఆలస్యంగా రావడంతో ఈలోగా భట్టి, సీతక్కలు ప్రసంగించారు.



## ధరణిని రద్దు చేసి భూములను తిరిగి ఇస్తాం: భట్టి

ధరణి మూలంగా భూములు కోల్పోయిన ఆదివాసీ గిరిజనులకు తిరిగి ఆ భూములను అప్పగిస్తామని మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అమరుల ఆశయాలను తమ ప్రభుత్వం నెరవేరుస్తుందని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఆదిలాబాద్ నుంచే అభివృద్ధిని ప్రారంభించామన్నారు. చిక్‌మన్ ప్రాజెక్టు నిర్మాణంతోపాటు త్రివేణి సంగమం అభివృద్ధి చేస్తామని చెప్పారు.

## త్వరలోనే రూ.500కు గ్యాస్ సిలిండర్

ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కూడా పూర్తి కాకుండానే ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదంటూ విపక్ష నేతలు పిల్లి శాపనార్థాలు పెడుతున్నారని రేవంత్ ఎద్దేవా చేశారు. త్వరలోనే లక్ష మంది మహిళలతో సభను ఏర్పాటు చేసి, ప్రియాంకగాంధీ చేతుల మీదుగా రూ.500కే గ్యాస్ సిలిండర్లను అందజేస్తామని ప్రకటించారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారందరికీ నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌ను ఇచ్చే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ప్రగతిభవన్ పేరు మీద పెద్ద గడీలను నిర్మించుకుని కష్టాలు చెప్పుకునేందుకు గద్దరన్న వెళ్తే ఎర్రటి ఎండలో 3 గంటల పాటు గేటు వద్ద నిల్చోబెట్టిన పాపం కేసీఆర్‌దని చెప్పారు. బీఆర్‌ఎస్‌కు గద్దరన్న ఉసురే తగిలిందని, ఎన్నికల్లో ప్రజలు బొక్కలు విరగొట్టి గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. తుమ్మిడిహెట్టి, సదర్మాట్ ప్రాజెక్టులను నిర్మించడంతో పాటు కడెం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపడతామని ప్రకటించారు. రాష్ట్రంలో నీళ్ల కోసం ఇంకా బావులు తవ్వుకుంటున్నారని, ఎక్కడ కోటి ఎకరాలకు నీళ్లిచ్చారో కేసీఆర్ చెప్పాలని నిలదీశారు.



ఆదిలాబాద్ జిల్లా నాగోబా ఆలయంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, అధికారులు

## బ్యాంకు లాకర్లలో బంగారం..!

» రేరా కార్యాలయం బీరువా బద్దలుకొట్టిన ఏసీబీ

» హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ కేసు

» మూడో రోజు విచారణలో కీలక విషయాలు వెల్లడించిన శివబాలకృష్ణ

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అరెస్టు సమయంలో గుర్తించిన దాని కంటే ఆయన ఆస్తులు పదిరెట్లు అధికమని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు గుర్తించారు. శివబాలకృష్ణ సమీప బంధువు పేరిట వేర్వేరు బ్యాంకుల్లో ఉన్న మూడు లాకర్లలో రెండింటిని ఏసీబీ ప్రత్యేక బృందం శుక్రవారం తెరిచింది. ఆ లాకర్లలో పెద్ద మొత్తంలో ఉన్న బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుంది. శివబాలకృష్ణ తన అక్రమ సంపాదనను బంగారు, భూముల రూపంలో మార్చినట్లు గుర్తించారు. కాగా, శివ బాలకృష్ణను అరెస్టు చేసిన ఏసీబీ.. న్యాయస్థానం అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్న సంగతి తెలిసిందే. తనిఖీలు, అరెస్టు సమయంలో శివబాలకృష్ణ విచారణ అధికారులకు సహకరించలేదు. అయితే, అధికారులు ఆధారాలను ముందుంచి ప్రశ్నిస్తుండడంతో నెమ్మదిగా నోరువిప్పుతున్నారు. శివబాలకృష్ణను శుక్రవారం, మూడో రోజు కస్టడీలోకి తీసుకున్న ఏసీబీ అధికారులు ఆయన పనిచేసిన రేరా కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడ ఆయన గదిలోని బీరువా తాళం చెవుల కోసం ప్రశ్నించగా తెలియదని సమాధానం ఇచ్చారు. దీంతో శివబాలకృష్ణ సమక్షంలోనే అధికారులు బీరువా బద్దలుగొట్టారు. వేర్వేరు వ్యక్తుల పేర్లతో వేర్వేరు ప్రాంతాల్లో కొనుగోలు చేసిన భూముల ఒరిజినల్ రిజిస్ట్రేషన్ పత్రాలు ఆ బీరువాలో బయటపడ్డాయి. భువనగిరి జిల్లాలో 8 ఎకరాల స్థలంతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో కొనుగోలు చేసిన భూముల పత్రాలను ఏసీబీ స్వాధీనం చేసుకుంది. తన కుటుంబ సభ్యుల పేర్లతో కొనుగోలు చేసిన భూముల పక్కనే బినామీ పేర్లతో భూమి కొనుగోలు చేసి అన్నింటికి కలిపి ఒకే కంచె ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు. రేరా కార్యాలయం బీరువాలో లభించిన భూముల పాసు పుస్తకాలు ఇతరుల పేర్లతో ఉండటంతో అవి వారి చిరునామాకు స్పీడ్ పోస్టులో వెళ్లాయి. వాటిని అందుకున్న వారు స్పీడ్ పోస్టు కవర్‌తో సహా పాస్‌పుస్తకాలను శివబాలకృష్ణకు అప్పగించగా ఆయన వాటిని అలానే భద్రపరిచారు. బీరువాలో లభించిన పత్రాల ద్వారా ఈ కేసులో ఏసీబీ ఇప్పటి వరకు గుర్తించని కొత్త ఆస్తులు బయటపడ్డాయి. బీరువాలో దొరికిన భూముల పత్రాల్లో ఉన్న పేర్ల ఆధారంగా వారందరినీ విచారించేందుకు ఏసీబీ సిద్ధమవుతోంది. శివబాలకృష్ణ ఇచ్చిన సమాచారం, దర్యాప్తులో లభిస్తున్న ఆధారాల మేరకు ఈ కేసులో త్వరలో మరికొందరిని అరెస్ట్ చేసేందుకు ఏసీబీ రంగం సిద్ధం చేస్తోంది. కాగా, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శివబాలకృష్ణ అరెస్టుకు కొద్ది రోజుల క్రితం ఆయనకు రెండు కార్లు బహుమతిగా వచ్చినట్లు ఏసీబీ గుర్తించింది. అవి ఎవరిచ్చారనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.

## 8 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు!

» రేపు క్యాబినెట్ భేటీ, పలు అంశాలపై చర్చ



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 8వ తేదీన ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం క్యాబినెట్ సమావేశం జరగనుంది. ఈ భేటీలో నిర్వహించనుండగా, పలు కీలక అంశాలు చర్చకు రానున్నాయి. ఈ మేరకు సమగ్ర వివరాలు పంపించాలంటూ అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణతోపాటు రెండు గ్యారెంటీల అమలు, గ్రూప్-1 పోస్టుల భర్తీ వంటి అంశాలపై చర్చించే అవకాశాలున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెల 1న కేంద్ర ప్రభుత్వం ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన దృష్ట్యా.. అదే తీరులో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అంశంపై క్యాబినెట్‌లో చర్చించనున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఆ బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చే కేటాయింపులను చూసిన తర్వాత పూర్తిస్థాయి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే ఆలోచనలో కాంగ్రెస్ సర్కారు ఉంది. అప్పటి వరకు ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదింపజేసుకుని, అమలు చేద్దామని యోచిస్తోంది. కాగా, ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మరో రెండింటిని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. బుధవారం జరిగిన మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలోనూ ఇదే విషయాన్ని సీఎం ప్రస్తావించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సరఫరా వంటి వాటిలో రెండింటిని అమలు చేయడానికి కసరత్తు చేయాలని అధికారులను ఆదేశించారు. వీటికయ్యే వ్యయాన్ని తేల్చాలని ఆర్థిక శాఖకు సూచించారు. ఈ నేపథ్యంలో రెండు గ్యారెంటీల అమలుపై క్యాబినెట్‌లో చర్చించి ఆమోదం తీసుకునే అవకాశాలున్నాయి. మరోవైపు.. గ్రూప్-1 పోస్టుల భర్తీని పకడ్బందీగా నిర్వహించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు పాత పోస్టులు 503తోపాటు రిటైర్మెంట్ల వల్ల ఖాళీ అయిన పోస్టులను జత చేసి.. పరీక్ష నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి ఆయా శాఖల్లో ఇంకా ఖాళీగా ఉన్న గ్రూప్-1 పోస్టుల వివరాలు సైతం ప్రభుత్వానికి అందాయి. 43పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖలు నివేదించగా, అదనంగా మరో 100 పోస్టులను జత చేయాలన్న ఆలోచనలో ఆర్థిక శాఖ ఉంది. ఈ అంశాలన్నింటిపై క్యాబినెట్ భేటీలో చర్చించి గ్రూప్-1 పోస్టుల సంఖ్యను తేల్చనున్నట్లు తెలిసింది.

## బతికున్నంతకాలం నెలకు 12వేల మందులు ఫ్రీ

» లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యువతికి ప్రజావాణిలో భరోసా

» శుక్రవారం 1757 దరఖాస్తులు.. ఇళ్లు, పెన్షన్లు, ధరణిపైనే ఎక్కువ

» దరఖాస్తుదారుల పట్ల సంయమనంతో వ్యవహరించండి

» ప్రజావాణి అధికారులకు నోడల్ అధికారి దివ్య దేవరాజన్ సూచన



ప్రజావాణిలో దరఖాస్తులను తీసుకుంటున్న దివ్య దేవరాజన్

బేగంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబానికి చెందిన ఆ యువతి మందుల ఖర్చు నెలకు రూ.12వేలు! బతికున్నంతకాలం ఆ ఔషధాలను ఆమె వాడాల్సిందే! మరి.. ఆర్థిక స్థోమత లేని ఆమె ఇంత ఖర్చు ఎలా భరించగలదు? ఆరేళ్ల నుంచి ఎలాగోలా నెట్టుకొస్తున్న ఆమెకు ప్రభుత్వ సాయం కోసం తలుపుతట్టేందుకు 'ప్రజావాణి' ఓ ఆశాకిరణంలా కనిపించింది. అక్కడికి వెళ్లి తన గోడు చెప్పుకొంటే 'ప్రజావాణి' అక్కున చేర్చుకుంది. ఆమెకు అవసరమైన మందులన్నీ ప్రతినెలా ఉచితంగా ఇవ్వాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు శుక్రవారం ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సైదాబాద్ వాస్తవ్యురాలైన దివ్యశ్రీ అనే యువతికి ప్రభుత్వం నుంచి భరోసా లభించింది. 2017లో దివ్యశ్రీకి ఉస్మానియా ఆస్పత్రిలో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. అప్పటి నుంచి వైద్యుల సూచన మేరకు దివ్యశ్రీ ప్రతినెలా ఖరీదైన మందులను వాడుతున్నారు. మందుల కోసం నెలకు రూ.12వేలు వెచ్చించే స్థోమత లేకపోవడంతో దివ్యశ్రీ, ఆమె కుటుంబసభ్యులు శుక్రవారం 'ప్రజావాణి'కి వచ్చి సాయం అర్థించారు. వెంటనే అక్కడే ఉన్న ఆరోగ్యశ్రీ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ వెంటనే స్పందించారు. దివ్యశ్రీకి అవసరమైన మందులను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై దివ్యశ్రీ కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా శుక్రవారం ప్రజావాణికి 1757 దరఖాస్తులొచ్చాయి. వీటిలో ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ధరణిలో భూ సమస్యలకు సంబంధించి విజ్ఞప్తులు ఎక్కువగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. నేషనల్ హెల్త్ మిషన్ ల్యాబ్ టెక్నీషియన్లు.. ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలని సమస్యపై 'ప్రజావాణి'లో విజ్ఞప్తి చేశారు. వీరు డీఎస్సీ ద్వారా ఎంపికై 22 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఇక.. ఆరేళ్ల క్రితం తమ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని గత సర్కారు హామీ ఇచ్చిందని.. అది నెరవేరలేదంటూ ఓ కుటుంబం ప్రజావాణిలో గోడు వెళ్లబోసుకుంది. 2017లో ఎల్బీ స్టేడియంలో జరిగిన మహాబతుకమ్మ ఉత్సవంలో సృజన అనే యువతి పాల్గొని.. తిరిగి వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. అప్పట్లో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పిస్తానని తమకు కల్వకుంట్ల కవిత హామీతో కూడిన పత్రం ఇచ్చారంటూ సృజన భర్త షాలీంరాజు, సోదరి సాయి శ్రీలత చెప్పారు. అయితే ఇప్పటిదాకా తమకు న్యాయం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా పీఏసీఎల్ ఇన్వెస్టర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు న్యాయం కోసం 'ప్రజావాణి'కి వచ్చారు. పెరల్స్ ఆగ్రోటెక్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెని కలెక్టివ్ ఇన్వెస్టింగ్ స్కీమ్ క్రింద వ్యాపారం చేస్తుందనే అభియోగంతో సెబీ దేశవ్యాప్తంగా కంపెనీ వ్యాపార లావాదేవీలను నిలిపివేయడం జరిగింది. బాధితులు కోర్టుకు వెళ్లగా కంపెనీ ఆస్తులు అమ్మి చెల్లించాలని కోర్టులో తీర్పు వచ్చిందని, తెలంగాణ వ్యాప్తంగా 20 లక్షల మంది ఖాతాదారులకు రూ. 1500 కోట్లు చెల్లించవలసి ఉందని, తెలంగాణలో సెబీ కార్యాలయంలో పీఏసీఎల్‌కు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి తమకు న్యాయం చేయాలని పీఏసీఎల్ ఇన్వెస్టర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

### సమస్యలను ఓపిగ్గా వినండి

ప్రజావాణికి వచ్చే దరఖాస్తు దారుల పట్ల అధికారులు సంయమనంతో వ్యవహరించడంతో పాటు వారు చెప్పే సమస్యలను ఓపికతో వినాలని ప్రజావాణిలో పలు విభాగాలకు చెందిన అధికారులకు నోడల్ అధికారి దివ్య దేవరాజన్ సూచించారు. శుక్రవారం ఆమె పలువురు అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఇప్పటి వరకు ప్రజావాణికి ఎన్ని దరఖాస్తులొచ్చాయి? ఎన్ని పరిష్కారమయ్యాయి? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? అనే వివరాలు అధికారుల వద్ద ఉండాలన్నారు. అందుకు అవసరమైన చర్యలను వెంటనే తీసుకోవాలని ఆదేశించారు.

## డబ్బులొస్తాయంటే వీడియోలకు లైకులు కొట్టా

» సైబర్ నేరగాళ్ల బారి నుంచి త్రుటిలో తప్పించుకున్నా: డీజీపీ



హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): "వీడియోలు చూసి లైక్ కొడితే డబ్బులు వస్తాయంటే.. ఓసారి ఎయిర్‌పోర్టులో ఉండగా లైక్‌లు కొట్టా. సైబర్ నేరగాళ్లు నన్ను ప్రలోభ పెట్టేందుకు బ్యాంకు వివరాలు తీసుకుని ముందుగా రూ.150 ఇచ్చారు. కానీ, నేను రెండు బ్యాంకు ఖాతాలు నిర్వహిస్తా. ఒకటి జీరో బ్యాలెన్స్, మరోటి మెయిన్ ఖాతా. ఆన్‌లైన్ చెల్లింపులకు మెయిన్ ఖాతా నుంచి జీరో ఖాతాకు బదిలీ చేసుకుంటా. ఈ ఖాతాలో డబ్బులు తక్కువగా ఉండడంతో వదిలేశారు" అని డీజీపీ రవి గుప్తా తెలిపారు. ఎంత అప్రమత్తంగా ఉన్నా.. సరికొత్త మార్గంలో వస్తూ సైబర్ నేరగాళ్లు ఏమారుస్తుంటారని తెలిపారు. అప్రమత్తత, ముందుజాగ్రత్తతోనే వారిని అడ్డుకోవచ్చన్నారు. సైబర్ నేరాలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు రవిగుప్తా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కర్ణాటక మాజీ డీజీపీ ఒకరు కూడా సైబర్ నేరగాళ్ల బారినపడ్డారని చెప్పారు. నేరగాళ్లు కొల్లగొట్టిన డబ్బును ఫ్రీజ్ చేయడంతో పాటు, బాధితులకు తిరిగి అప్పగించడంలోనూ దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని వివరించారు.

### దొంగలు పడడం లేదు.. సైబర్ నేరగాళ్లు పడుతున్నారు

ఇప్పుడు ఇళ్లల్లో దొంగలు పడడం లేదు కానీ ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు సైబర్ మోసానికి గురవుతున్నారని, నేరగాళ్లు పంపించే మెసేజ్‌లు, లింకులకు స్పందించకుంటే సురక్షితంగా ఉంటామని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ తెలిపారు. హెల్ప్‌లైన్ నంబరు 1930కు సుమారు 90 వేల ఫోన్లు వచ్చాయని, కేటుగాళ్ల బ్యాంకు ఖాతాల్లోని రూ.128 కోట్లను బ్లాక్ చేసినట్లు చెప్పారు. అవగాహన, సెక్యూరిటీ ఫీచర్స్ లేకపోవడం వల్ల ప్రజలు బాధితులుగా మారుతున్నారని హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## కల్లు దుకాణాల జీవోపై వివరణ ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరం, చుట్టుపక్కల దాదాపు వంద కల్లు దుకాణాలు ఏర్పాటుకు అనుమతిస్తూ గత ప్రభుత్వం 2014లో జారీచేసిన జీవో 24ను సస్పెండ్ చేయాలని దాఖలైన పిటిషన్‌లో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి శుక్రవారం హైకోర్టు నోటీసులు జారీచేసింది. ఈ జీవోను కొట్టేయాలని కోరుతూ ఫోరంఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. 50 కిలోమీటర్ల పరిధిలో తాటి చెట్లు ఉంటేనే కల్లు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్న నిబంధనన ఎత్తేసి ఈ జీవో ఇచ్చారని, దీనివల్ల కల్తీ కల్లు విక్రయించేందుకు అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం.. చీఫ్ సెక్రటరీ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శికి ఆదేశాలు జారీచేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా పడింది.

## విచారణపై స్టే కావాలంటే హైకోర్టుకెళ్లండి

» 'మార్గదర్శి'కి సూచించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మార్గదర్శి చిట్‌ఫండ్ కేసుల విచారణపై స్టే కావాలనుకుంటే ఏపీ హైకోర్టునే ఆశ్రయించాలని సుప్రీంకోర్టు ఆ సంస్థకు సూచించింది. మార్గదర్శిపై దాఖలైన చార్జిషీట్‌లను రెండు జిల్లా కోర్టులు తిరస్కరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేసింది. దీంతో సదరు అప్పీళ్లపై విచారణను ఏపీ హైకోర్టు నుంచి తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టులో మార్గదర్శి పిటిషన్ వేసింది. శుక్రవారం.. జస్టిస్ అభయ్ ఎస్. ఓకా, జస్టిస్ ఉజ్జల్ భయాన్ ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లపై స్టే ఇవ్వాలని మార్గదర్శి సంస్థ తరఫు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. స్పందించిన సుప్రీంకోర్టు స్టే కావాలనుకుంటే ఏపీ హైకోర్టులోనే పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది.

# భారత్‌లో క్యాన్సర్ విజృంభణ

**ఒక్క 2022లోనే 14 లక్షల కేసులు.. 9.1 లక్షల క్యాన్సర్ మరణాల నమోదు**

» మనదేశంలో 2023లో 3.4 లక్షల సర్వైకల్ క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి: కేంద్రం




హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో క్యాన్సర్ విజృంభిస్తోంది. ఆ మహమ్మారి కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఒక్క 2022లోనే మనదేశంలో 14 లక్షల క్యాన్సర్ కేసులు.. 9.1 లక్షల క్యాన్సర్ మరణాలు నమోదయ్యాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)కు చెందిన క్యాన్సర్ విభాగం 'ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రిసెర్చ్ ఆన్ క్యాన్సర్ (ఐఏఆర్‌సీ) వెల్లడించింది. పురుషుల్లో నోటి (లిప్, ఓరల్ క్యావిటీ) క్యాన్సర్ (మొత్తం క్యాన్సర్ కేసుల్లో 15.3%), ఊపిరితిత్తుల క్యాన్సర్ (8.5%).. మహిళల్లో రొమ్ము (27%), గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు (18%) ఎక్కువగా నమోదవుతున్నట్లు పేర్కొంది. భారతదేశంలో 75 ఏళ్లలోపు వారు క్యాన్సర్ బారిన పడే ముప్పు 10.6 శాతం, ఆ మహమ్మారి కారణంగా మరణించే ముప్పు 7.2 శాతంగా ఉందని.. అంతర్జాతీయంగా ఈ రెండింటి సగటు వరుసగా 20 శాతం, 9.6 శాతం ఉన్నాయని ఐఏఆర్‌సీ వివరించింది. ప్రపంచవ్యాప్తంగా ఏటా 2కోట్ల క్యాన్సర్ కేసులు, 97 లక్షల మరణాలు నమోదు అవుతున్నాయని వెల్లడించింది. డబ్ల్యూహెచ్‌వో మొత్తం 115 దేశాల్లో సర్వే నిర్వహించి.. వరల్డ్ క్యాన్సర్ డే (ఫిబ్రవరి 4) సందర్భంగా ఆ ఫలితాలను వెలువరించింది. మహిళల్లో నమోదవుతున్న అత్యధిక కేసుల్లో రెండో స్థానంలో రొమ్ము క్యాన్సర్ (11.6 శాతం) ఉన్నప్పటికీ.. దానివల్ల మరణాల ముప్పు (7 శాతమే) తక్కువగా ఉందని వివరించింది. అలాగే ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో ఎక్కువగా నమోదవుతున్న క్యాన్సర్లలో ఎనిమిదో స్థానంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఉందని.. క్యాన్సర్ మరణాల్లో 9వ స్థానంలో ఉందని వెల్లడించింది. 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఏటా 3.5 కోట్ల క్యాన్సర్ కేసులు నమోదు అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. క్యాన్సర్ కేసుల పెరుగుదల సామాజిక ఆర్థికాభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొంది.

### ప్రపంచవ్యాప్తంగా..

ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ కేసుల సంఖ్య పెరుగుతున్నట్లు డబ్ల్యూహెచ్‌వో వెల్లడించింది. సర్వైకల్ క్యాన్సర్ ఎలిమినేషన్ ఇనిషియేటివ్ ప్రోగ్రామ్ ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను నిర్మూలించవచ్చని డబ్ల్యూహెచ్‌వో అభిప్రాయపడింది. కాగా, మన దేశంలో 2023 సంవత్సరంలో 3.4 లక్షలకు పైగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కేసులు నమోదైనట్టు భారత వైద్య పరిశోధన మండలికి చెందిన జాతీయ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ తెలిపింది. ఈ విషయాన్ని కేంద్రం శుక్రవారం లోక్‌సభలో వెల్లడించింది. ఈ మహమ్మారిని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సాంకేతిక ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్టు కేంద్రమంత్రి సత్యపాల్ సింగ్ తెలిపారు.

# మహిళలూ జరభద్రం

**దేశంలో నానాటికీ పెరుగుతున్న సర్వైకల్ క్యాన్సర్ ముప్పు**

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, అమరావతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గర్భాశయ క్యాన్సర్ హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ద్వారా సోకుతుంది. ఇది లైంగిక సంపర్కం ద్వారా సంక్రమించే ఒక సాధారణ వైరస్. సాధారణంగా ఇది శరీరంలోకి ప్రవేశించాక క్యాన్సర్‌గా అభివృద్ధి చెందడానికి 15-20 ఏళ్లు పడుతుంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే మహిళల్లో 5-10 ఏళ్లకే క్యాన్సర్ కణాలు అభివృద్ధి చెందుతాయి. ఎక్కువమందితో లైంగిక చర్యల్లో పాల్గొనడం, గర్భనిరోధక మాత్రలు ఎక్కువగా వినియోగించడం వల్ల కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది.

### లక్షణాలేమిటి..?

- గర్భాశయ క్యాన్సర్ వచ్చిన వారికి నెలసరి సమయంలో అధిక రక్తస్రావం అవుతుంది.
- పొత్తి కడుపులో నొప్పి.. తరచూ కడుపు ఉబ్బరం
- పదే పదే మూత్ర విసర్జనకు వెళ్తారు. ఆ సమయంలో మంట, నొప్పిగా అనిపిస్తుంది.
- శృంగారంలో పాల్గొన్నప్పుడు, ఆ తర్వాత యోని దగ్గర నొప్పి, మంటగా ఉంటుంది.
- మెనోపాజ్ తర్వాత శృంగారంలో పాల్గొన్నప్పుడు సంభోగం తర్వాత రక్తస్రావం అవుతుంది.
- దుర్వాసనతో కూడిన వైట్ డిశ్చార్జ్ అవుతుంది.
- అలసట, నీరసం, బరువు తగ్గడం, రక్తహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి.

### 'పాప్ స్మియర్ టెస్ట్'తో గుర్తించవచ్చు

గర్భాశయ క్యాన్సర్‌ను గుర్తించడానికి వైద్యులు 'పాప్ స్మియర్ టెస్ట్' నిర్వహిస్తారు. పెల్విక్ ఎగ్జామినేషన్, బయాప్సీ విధానాల ద్వారానూ దీన్ని గుర్తించవచ్చు. మహిళలు గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా ముందస్తు వ్యాక్సిన్లు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. 9 నుంచి 26 ఏళ్ల మధ్య వయసున్న అమ్మాయిలకు ఈ వైరస్ సోకకుండా వ్యాక్సిన్ వేస్తారు. అలాగే.. పాప్ స్మియర్ పరీక్ష ద్వారా ముందుగానే



దీన్ని గుర్తించి ప్రీ క్యాన్సర్ దశలోనే చిన్నపాటి చికిత్సతో నిర్మూలించవచ్చని వైద్యులు చెబుతున్నారు. 29-45 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు ప్రతి రెండు-మూడేళ్లకోసారి, 50-60 ఏళ్లవారు ఐదేళ్లకోసారి స్క్రీనింగ్ చేయించుకుంటూ ఉండాలంటున్నారు. అలాగే అసురక్షిత లైంగిక చర్యల్లో పాల్గొనకూడదని, తరచూ గర్భనిరోధక మాత్రలు మింగొద్దని సూచిస్తున్నారు. కాగా.. గర్భాశయ క్యాన్సర్ నివారణకు సీరం ఇనిస్టిట్యూట్ స్వదేశీయంగా 'సర్వావ్యాక్' అనే వ్యాక్సిన్‌ను డోసు రూ.2 వేలకు అందుబాటులోకి తెచ్చింది. ఇతర కంపెనీలవీ ఉన్నాయి. వ్యాక్సిన్ ధరలు తగ్గింపుపై కేంద్ర ప్రభుత్వం ఫార్మా కంపెనీలతో చర్చలు జరుపుతోంది.

### సెప్టెంబరులో వ్యాక్సినేషన్..

గర్భాశయ క్యాన్సర్ ప్రమాదాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. 9-14 ఏళ్ల బాలికలు దీని బారిన పడకుండా ఉండేందుకు వ్యాక్సినేషన్‌ను ప్రోత్సహిస్తామని నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. దీనికోసం సీరం సంస్థ ఆరు కోట్ల డోసులు కేంద్రానికి అందించనుందని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. అవి అందగానే సెప్టెంబరులో వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగా 9 నుంచి 14 ఏళ్ల వయసున్న బాలికలకు రెండు డోసులు టీకా ఉచితంగా ఇవ్వొచ్చని భావిస్తున్నారు. ఫార్మా కంపెనీలతో కేంద్రం చర్చలు ఫలించి ఈ వ్యాక్సిన్ విరివిగా అందుబాటులోకి వస్తే ఒక్కో డోసు ధర రూ.200 నుంచి రూ.250 వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

### తెలంగాణలో ఏటా 15 వేల సర్వైకల్ క్యాన్సర్లు?

తెలంగాణలో ఏటా కొత్తగా 15 వేల గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు నమోదవుతున్నట్లు ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఏటా నమోదవుతున్న కొత్త కేసుల్లో 13% సర్వైకల్ క్యాన్సర్‌వే ఉంటున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. ఒక్క ఎంఎన్‌జే ఆస్పత్రిలోనే రోజూ 300-400 మందికి సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు చేస్తుండగా 2-3 కేసులు బయటపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్‌లాగా తమవద్ద దీనికి ఉచితంగా వ్యాక్సిన్ వేస్తున్నట్లు ఎంఎన్‌జే క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ జయలత తెలిపారు.

### పట్టణ ప్రాంతాల్లో రొమ్ము, గ్రామీణ ప్రాంతాల్లో సర్వైకల్ క్యాన్సర్ కేసులెక్కువ

మన దేశంలో పట్టణ ప్రాంత మహిళల్లో రొమ్ము క్యాన్సర్, గ్రామీణ ప్రాంతాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. సర్వైకల్ క్యాన్సర్ కేసుల్ని పాప్‌స్మియర్ టెస్టు ద్వారా ముందే గుర్తించే అవకాశం ఉంది. తద్వారా మరణాలను కూడా గణనీయంగా తగ్గించవచ్చు. ఈముప్పును తప్పించుకోవాలంటే.. మన శరీరంపై అవగాహన ఉండాలి. ఏమాత్రం మార్పు కనిపించినా దాన్ని గుర్తించాలి. శరీరంలో నొప్పి లేని గడ్డలు ఏమి కనిపించినా నిర్లక్ష్యం చేయవద్దు. తక్షణం వైద్యుడి సంప్రదించాలి. జీవనశైలి మార్చుకోవాలి. మద్య, ధూమపానం మానుకోవాలి. నిత్యం వ్యాయామం చేయాలి.

డాక్టర్ గీతనాగశ్రీ నీరుకొండ, సీనియర్ సర్జికల్ అంకాలజిస్టు, కేర్ క్యాన్సర్‌సెంటర్, హైదరాబాద్

## పూనమ్ పాండే కన్నుమూత

» 32 ఏళ్లకే గర్భాశయ కేన్సర్‌తో మృతి

» ఇన్‌స్టా వేదికగా ఆమె మేనేజర్ వెల్లడి



ముంబై, ఫిబ్రవరి 2: ప్రముఖ నటి, మోడల్ పూనమ్ పాండే అకాల మరణం చెందారు. కొంతకాలంగా గర్భాశయ కేన్సర్‌తో బాధపడుతున్న 32 ఏళ్ల పూనమ్ గురువారం రాత్రి కన్నుమూశారు. ఈ విషయాన్ని ఆమె మేనేజర్ శుక్రవారం ఉదయం ధ్రువీకరించారు. 'ఈ రోజు చాలా బాధకర విషయాన్ని తెలియజేయాల్సి వచ్చినందుకు చింతిస్తున్నాము. మన ప్రియతమ నటి పూనమ్ పాండే గర్భాశయ కేన్సర్‌తో గురువారం రాత్రి కన్నుమూశారు. ఈ విషాద సమయంలో ఆమెను స్మరించుకుంటూ.. వారి కుటుంబ గోప్యతకు భగం కలిగించవద్దని కోరుతున్నాం' అని పేర్కొన్నారు. అయితే మరణానికి సంబంధించిన వివరాలు వెల్లడించడానికి ఆమె కుటుంబం అందుబాటులో లేదు.

### వివాదాస్పద వ్యాఖ్యలతో పాపులర్

పూనమ్ పాండే ప్రముఖ మోడల్. 2013లో తొలిసారిగా ఆమె నషా అనే హిందీ చిత్రంలో నటించారు. వివాదాస్పద వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలిచేవారు. 2011 వన్డే ప్రపంచకప్ సందర్భంగా టీమిండియా ఫైనల్లో గెలిస్తే నగ్నంగా కనిపిస్తానని ప్రకటించి అందరి దృష్టినీ ఆకర్షించారు. ఆమె చివరగా.. నటి కంగనారనౌత్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన 'లాక్ అప్' మొదటి సీజన్‌లో కనిపించారు. షోలో విజయం సాధించలేకపోయినప్పటికీ అభిమానుల సంఖ్యను పెంచుకున్నారు. 2020లో శామ్ బాంబేను వివాహం చేసుకున్న పూనమ్ అందర్నీ ఆశ్చర్యానికి గురిచేశారు. అయితే.. వారి వైవాహిక జీవితం ఎంతోకాలం కొనసాగలేదు. పెళ్లయిన కొద్దిరోజులకే శామ్‌పై ఆమె గృహహింస ఆరోపణలు చేశారు. తర్వాత విడిపోయారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శనివారం 3 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com

# నిట్ వరంగల్‌లో ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ



**వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ వరంగల్)- ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ)లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్‌లను కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేస్తోంది.**

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి 12 రోజులు. ప్రతి ప్రోగ్రామ్‌లో 100 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. ఐఐటీలు, ఐఐఐటీలు, నిట్ సంస్థల్లో పనిచేస్తున్న ఫ్యాకల్టీ మెంబర్లు సెషన్స్ నిర్వహిస్తారు. ఇంజనీరింగ్/ఎంసీఏ కాలేజీల ఫ్యాకల్టీలు, ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్, పీజీ చదువుతున్నవారు, పీహెచ్‌డీ అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఎంపికైనవారికి ఈ-మెయిల్ ద్వారా సమాచారమిస్తారు. నిబంధనల ప్రకారం కోర్సు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తారు.



**స్మార్ట్ కాంట్రాక్ట్ మాస్టరీ: పయనీరింగ్ ద ఫ్యూచర్ ఆఫ్ బ్లాక్ చెయిన్ అప్లికేషన్స్**

సంస్థ ఆధ్వర్యంలోని సీఎస్ఈ డిపార్ట్‌మెంట్, ఈ&ఐసీటీ అకాడమీలు ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తున్నాయి. ఇందులో బ్లాక్ చెయిన్-కరెంట్ అండ్ ఫ్యూచర్ అప్లికేషన్స్, ఇన్ఫర్మేషన్ అటెస్టేషన్ అండ్ మల్టీ ప్రొటోకాల్ స్టోరేజ్ ఫర్ వెబ్, బ్లాక్ చెయిన్-క్వెరీ లాంగ్వేజ్, బిజినెస్ నెట్‌వర్క్స్ అండ్ ప్రాసెస్ బేస్డ్ ఆన్ మోడలింగ్ అండ్ బ్లాక్ చెయిన్, ఓపెన్ అండ్ పర్మిషన్ లెస్ బ్లాక్ చెయిన్స్, హైబ్రిడ్ ఆర్కిటెక్చర్స్ ఫర్ బ్లాక్ చెయిన్స్ అండ్ క్లౌడ్ టెక్నికల్ ఆర్కిటెక్చర్స్, బ్లాక్ చెయిన్ అప్లికేషన్స్, స్మార్ట్ కాంట్రాక్ట్స్, ట్రెయినింగ్ ఆన్ సాలిడిటీ లాంగ్వేజ్, ఇంట్రడక్షన్ టు టెస్టింగ్, బౌండెడ్ మోడల్ చెకింగ్ అంశాలు వివరిస్తారు. టెస్టింగ్ టూల్స్‌కు సంబంధించి ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** మార్చి 25 నుంచి ఏప్రిల్ 5 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20
- **ఎంపికయిన అభ్యర్థులకు ఈ-మెయిల్ సమాచారం:** మార్చి 22న

**ఆప్టిమైజేషన్ టెక్నిక్ ఫర్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్**

ఈ ప్రోగ్రామ్‌ని సంస్థ ఆధ్వర్యంలోని ఈ&ఐసీటీ అకాడమీ నిర్వహిస్తోంది. ఇందులో డైరెక్ట్ సెర్చ్ మెథడ్స్, గ్రేడియంట్ బేస్డ్ మెథడ్స్, సింపుల్ మెథడ్ అండ్ లీనియర్ ప్రోగ్రామింగ్, జెనెటిక్ అల్గారిథమ్, పార్టికల్ ఆప్టిమైజేషన్, డిఫరెన్షియల్ ఎవల్యూషన్, కాలనీ ఆప్టిమైజేషన్ అల్గారిథమ్, సిమ్యులేటెడ్ ఎనీలింగ్ అల్గారిథమ్, టీచింగ్ లెర్నింగ్-ఆప్టిమైజేషన్ అల్గారిథమ్, ఆప్టిమైజేషన్ మెథడ్స్, డెసిషన్ మేకింగ్ మెథడ్స్, న్యూరల్ నెట్‌వర్క్స్-అప్లికేషన్స్, హైబ్రిడ్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ అంశాలు వివరిస్తారు. సాఫ్ట్ కంప్యూటింగ్, మెటా ఆప్టిమైజేషన్ అల్గారిథమ్‌లకు సంబంధించిన కేస్ స్టడీస్ ఉంటాయి.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** మార్చి 11 నుంచి 22 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 5
- **ఎంపికయిన అభ్యర్థులకు ఈ-మెయిల్ సమాచారం:** మార్చి 8న

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **వెబ్‌సైట్:** nitw.ac.in

# ఇండస్ బిజినెస్ అకాడమీలో పీజీడీఎం

**బెంగళూరులోని ఇండస్ బిజినెస్ అకాడమీ(ఐబీఏ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనికి ఏఐసీటీఈ, ఎన్‌బీఏ, ఐఏసీబీఈ-యూఎస్ఏ సంస్థల గుర్తింపు ఉంది. ఇది డ్యూయెల్ స్పెషలైజేషన్ కోర్సు. ఈ ప్రోగ్రామ్ ఎంబీఏ డిగ్రీకి సమానం. జాతీయ పరీక్ష స్కోర్, అకడమిక్ ప్రతిభ, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా స్కాలర్‌షిప్స్ ఇస్తారు. పురుషులకు, మహిళలకు విడివిడిగా వసతి సౌకర్యం ఉంది.**

**స్పెషలైజేషన్‌లు**

మార్కెటింగ్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఈ-బిజినెస్, రిటైల్, ఆపరేషన్స్, ఇంటర్నేషనల్ బిజినెస్, అంత్రప్రెన్యూర్‌షిప్ మేనేజ్‌మెంట్.

**ప్రోగ్రామ్ వివరాలు**

ఇందులో ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. రెండు, మూడు ట్రైమెస్టర్లలో స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. మూడో ట్రైమెస్టర్ అంటే మొదటి ఏడాది కోర్సు పూర్తికాగానే రెండు నెలల కార్పొరేట్ ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ అనాలిసిస్, ప్రజంటేషన్స్, గెస్ట్ లెక్చర్స్, సెమినార్స్, మాక్ ఇంటర్వ్యూ సెషన్స్, గ్రూప్ డిస్కషన్స్ ఉంటాయి.

**అర్హత**

- ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/ఎక్స్ఏటీ 2024/సీమ్యాట్ 2024/మ్యాట్(2023 సెప్టెంబరు/డిసెంబరు; 2024 ఫిబ్రవరి/మే)/ఏటీఎంఏ 2024/(జీమ్యాట్/జీఆర్ఈ)(2023 జూలై తరవాత)/ గేట్(2023/2024) అర్హత పొంది ఉండాలి.

**వెయిటేజీ**

జాతీయ పరీక్ష స్కోర్‌కు 20 మార్కులు, అకడమిక్ ప్రతిభకు 35 మార్కులు, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌కు 10 మార్కులు, గ్రూప్ డిస్కషన్-పర్సనల్ ఇంటర్వ్యూకు 35 మార్కుల వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**స్కాలర్‌షిప్**

- పదోతరగతి నుంచి డిగ్రీ వరకు 60 శాతానికి పైగా మార్కులు ఉంటే 'పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ స్కాలర్‌షిప్' కింద రూ.50,000; 70 శాతానికి పైగా మార్కులు ఉంటే 'సర్దార్ వల్లభ్‌భాయ్ జావేర్‌భాయ్ పటేల్ మెమోరియల్ స్కాలర్‌షిప్' కింద రూ.60,000; 80శాతానికి పైగా మార్కులు ఉంటే 'నేతాజీ సుభాష్ చంద్రబోస్ మెమోరియల్ స్కాలర్‌షిప్' కింద రూ.70,000 ఇస్తారు.
- 'అటల్ బిహారి వాజపేయి మెమోరియల్ స్కాలర్‌షిప్'నకు పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. క్యాట్/ ఎక్స్ఏటీ/జీమ్యాట్/జీఆర్ఈలో 85 శాతానికి పైగా, మ్యాట్/ఏటీఎంఏలో 750కి పైగా, సీమ్యాట్‌లో 95 శాతానికి పైగా స్కోర్ సాధించిన వారికి రూ.1,00,000 ఇస్తారు. వీటికంటే తక్కువ స్కోర్‌లు సాధించినవారికి అంచెలవారీగా స్కాలర్‌షిప్ మొత్తం తగ్గుతూ ఉంటుంది. మరిన్ని స్కాలర్‌షిప్‌లు, అవార్డుల వివరాలకోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- అభ్యర్థులు దరఖాస్తు ఫారంలోనే తమకు అనువైన స్కాలర్‌షిప్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 27
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు జీడీ, ఇంటర్వ్యూ సెంటర్:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.iba.ac.in

# ఎన్ఐపీహెచ్‌టీఆర్‌లో అకడమిక్ ప్రోగ్రామ్‌లు

**కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐపీహెచ్‌టీఆర్-ముంబై)- రెగ్యులర్ కోర్సులతోపాటు స్కిల్ బేస్డ్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. పీజీ డిప్లొమా, డిప్లొమా, స్కిల్ ట్రెయినింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ప్రోగ్రామ్‌ను అనుసరించి ఎంట్రెన్స్ టెస్ట్/ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.**

**పీజీ డిప్లొమా ఇన్ కమ్యూనిటీ హెల్త్ కేర్**

- ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో 30 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయుష్, అలైడ్ హెల్త్ సైన్సెస్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసినవారు; బీఎస్సీ(కమ్యూనిటీ హెల్త్) నర్సింగ్ జీఎన్ఎం ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 40 ఏళ్లు మించకూడదు. ఆయుష్ విభాగాల్లో పనిచేస్తున్నవారికి, స్టాఫ్ నర్సులకు, ఎల్‌హెచ్‌వీలకు, పీహెచ్ఎన్‌లకు ప్రాధాన్యం ఉంటుంది.



**డిప్లొమా ఇన్ హెల్త్ ప్రమోషన్ ఎడ్యుకేషన్**

- ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో కూడా 30 సీట్లు ఉన్నాయి.
- ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయుష్/అలైడ్ హెల్త్ సైన్సెస్/ఎడ్యుకేషన్/వెల్ఫేర్/నర్సింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది. అభ్యర్థుల వయసు 40 ఏళ్లు మించకూడదు.

**పీజీ డిప్లొమా ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్**

- ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. 30 సీట్లు ఉన్నాయి.
- ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు; మెడికల్ గ్రాడ్యుయేట్లు; నర్సింగ్ గ్రాడ్యుయేట్లు; జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ(జీఎన్ఎం) ఉత్తీర్ణతతోపాటు ఏడాది అనుభవం ఉన్నవారు; పారామెడికల్ గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

**ముఖ్య సమాచారం**

- రిజిస్టర్డ్ పోస్ట్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ: మార్చి 31
- వెబ్‌సైట్: www.fwtrc.gov.in; www.niphtr.mohfw. gov.in

**స్కిల్ బేస్డ్ కోర్సులు**

శానిటరీ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. హోం హెల్త్ ఎయిడ్ కోర్సు వ్యవధి నాలుగు నెలలు. ఇందులో 20 సీట్లు ఉన్నాయి. జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఇందులో 20 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులకు సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఫస్ట్ రెస్పాండర్ కోర్సు వ్యవధి నాలుగు రోజులు. ఇందులో 20 సీట్లు ఉన్నాయి. ఎనిమిదోతరగతి ఆపై చదివినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 18 ఏళ్లు నిండి ఉండాలి.

## టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
## ఇండియన్ జాగ్రఫీ

# సాంప్రదాయేతర శక్తి వనరులు

సాంప్రదాయేతర శక్తి వనరులు ఎల్లప్పుడూ లభ్యమవుతాయి. అందువల్ల వీటిని పునరుద్ధరణ(Renewable) శక్తి వనరులు అంటారు. వీటిని ప్రత్యామ్నాయ శక్తి వనరులు అని కూడా అంటారు. ప్రత్యామ్నాయ శక్తి వనరులకు ఉదాహరణలు..

- జల విద్యుత్ శక్తి(Hydro Electricity)
- సౌర శక్తి(Solar Energy)
- పవన శక్తి(Wind Energy)
- అలల శక్తి(Wave Energy)
- వేలాతరంగా శక్తి(Tidal Energy)
- భూతాప శక్తి(Geothermal Energy)
- బయోమాస్(Biomas)



- OTEC(Ocean Thermal Energy Convertion)

1981లో ప్రత్యామ్నాయ శక్తి వనరులను అభివృద్ధి చేసేందుకు భారత ప్రభుత్వం DNES (Departmen of Conventional Energy Sources) అనే సంస్థను ఏర్పాటు చేసింది.

**జల విద్యుత్:** 2019 నాటికి మన దేశంలో మొత్తం జల విద్యుత్ ఉత్పత్తి- 45,293 మెగావాట్లు. జలవిద్యుత్ ఉత్పత్తిలో పంజాబ్, కర్ణాటక అగ్ర స్థానాల్లో ఉన్నాయి. జల విద్యుత్ ఉత్పత్తికి 1975లో నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇందిరాసాగర్ దేశంలో అత్యధిక జల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టు. దేశంలో మొదటిసారిగా జల విద్యుత్‌ను జనరేటర్ల సహాయంతో 1889లో పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతంలో గల 'లోనాపల' వద్ద ఉత్పత్తి చేశారు. మొట్టమొదట జల విద్యుత్ కేంద్రాన్ని 1902లో కర్ణాటకలోని మైసూర్ వద్ద ఉన్న శివన్నసముద్రం వద్ద కావేరీ నదిపై నిర్మించారు. ఈ జల విద్యుత్ కేంద్రం కర్ణాటకలోని కోలార్ బంగారు గనికి విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. దేశంలో అత్యంత ఎత్తుగల జలవిద్యుత్ కేంద్రం - నాత్పా జాక్రీ(హిమాచల్ ప్రదేశ్). కేరళ 100 శాతం జల విద్యుత్ పైనే ఆధారపడ్డది. జల విద్యుత్‌ను తెల్ల బొగ్గు అని కూడా అంటారు. ప్రపంచ జల విద్యుత్ ఉత్పత్తిలో మనదేశం ఆరో స్థానంలో, చైనా మొదటి స్థానంలో ఉన్నాయి. ప్రపంచంలో అతిపెద్ద జల విద్యుత్ కేంద్రం త్రీ గార్జెస్. దీని ఉత్పత్తి సామర్థ్యం 22,500 మెగావాట్లు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద జల విద్యుత్ కేంద్రాన్ని బ్రెజిల్‌లోని ఇటైపు వద్ద నిర్మించారు. దీని సామర్థ్యం 14,000 మెగా వాట్లు.

**సౌర శక్తి:** 2019 నాటికి మొత్తం సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం 28,180.71 మెగా వాట్లు. సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం అధికంగా గల రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ. కొచ్చి(కేరళ) విమానాశ్రయం సౌర విద్యుత్‌తో నడుస్తోంది. 2020 జూన్‌లో ఆసియాలోనే అతిపెద్ద సోలార్ ప్లాంట్‌ను మధ్యప్రదేశ్‌లోని 'రివా'లో ప్రారంభించారు. దీనిని 500 హెక్టార్ల విస్తీర్ణంలో 700 మెగా వాట్ల సామర్థ్యంతో నిర్మించారు. ప్రపంచంలో అతిపెద్ద సోలార్ బాయిలర్‌ను 2009లో షిరిడీలో ఏర్పాటు చేశారు. దీనిని ఉపయోగించి ప్రతి రోజూ 50,000 మందికి ఆహారపదార్థాలు వండవచ్చు. తిరుమలలో 15000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది. దిల్‌షుక్‌నగర్(హైదరాబాద్)లోని సాయిబాబా గుడిలో 3000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది. సౌర శక్తి ఉత్పత్తిలో అమెరికా, జర్మనీ, చైనా, జపాన్ వరుస స్థానాల్లో ఉన్నాయి. భారత్ ఎనిమిదో స్థానంలో ఉంది. మొట్టమొదట సౌరశక్తి కేంద్రం జమ్మూ కశ్మీర్‌లోని చొగ్లాంసర్ వద్ద నిర్మించారు. ఆసియాలో నే అతిపెద్ద సౌర తటాకం(Solar Pond) గుజరాత్‌లోని భుజ్ వద్ద ఉంది.

**ప్రపంచంలో అతిపెద్ద సోలార్ బాయిలర్‌ను 2009లో షిరిడీలో ఏర్పాటు చేశారు. దీనిని ఉపయోగించి ప్రతి రోజూ 50,000 మందికి ఆహారపదార్థాలు వండవచ్చు. తిరుమలలో 15000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది. దిల్‌షుక్‌నగర్(హైదరాబాద్)లోని సాయి బాబా గుడిలో 3000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది.**

**పవన శక్తి:** దేశ పవన శక్తి ఉత్పత్తి సామర్థ్యం 35,625 మెగావాట్లు. ప్రపంచంలో పవన శక్తి ఉత్పత్తిలో చైనా మొదటి, భారత్ నాలుగో స్థానాల్లో ఉన్నాయి. దేశంలో పవన శక్తి ఉత్పత్తిలో తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర వరుస స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో పవన విద్యుత్‌ను ఎక్కువగా ఉపయోగించుకుంటున్న ప్రాంతం జోగిమట్టి(కర్ణాటక). దేశంలో మొట్టమొదటి పవన శక్తి కేంద్రాన్ని గుజరాత్‌లోని మాండవి వద్ద 1986లో నిర్మించారు. దేశంలో అతి పెద్ద శక్తి కేంద్రం తమిళనాడులోని ముప్పాండల్ వద్ద ఉంది.

**అలల శక్తి:** మొట్ట మొదటి అలల శక్తి కేంద్రాన్ని కేరళలోని తిరువనంతపురం వద్ద గల విజింజీం వద్ద నిర్మించారు.

**వేలాతరంగ శక్తి:** ఆసియాలోనే మొట్టమొదటి వేలాతరంగ విద్యుత్ కేంద్రం గుజరాత్‌లోని కాండ్లా వద్ద నిర్మించారు. వేలాతరంగ విద్యుత్ ఉత్పత్తికి అనుకూలమైన ప్రాంతాలు- గల్ఫ్ ఆఫ్ కచ్(1200 మెగా వాట్లు), గల్ఫ్ ఆఫ్ కంభట్(7000 మెగావాట్లు), సుందర్ బన్స్.

**భూతాప శక్తి:** భారతదేశంలో ఏకైక భూతాపశక్తి కేంద్రం హిమాచల్ ప్రదేశ్‌లోని 'మణికరణ్' వద్ద ఉంది. జమ్మూ కశ్మీర్‌లోని లడఖ్‌లో గల పూగా లోయ కూడా భూతాపశక్తి ఉత్పత్తికి అనుకూలమైంది. భారత్‌లో 45,000 మెగా వాట్లు జియోథర్మల్ ఉత్పత్తికి అవకాశం ఉంది.

**బయోమాస్:** దీనిని వ్యర్థ పదార్థాల నుంచి ఉత్పత్తి చేస్తారు. మొట్ట మొదటి బయోమాస్ విద్యుత్ కేంద్రం పంజాబ్‌లోని జలంధర్ వద్ద నిర్మించారు. బయోమాస్‌లో 60 శాతం మీథేన్, 40 శాతం కార్బన్ డై ఆక్సైడ్ ఉంటాయి.

**OTEC(Ocean Thermal Energy Convertion):** దీనిని సముద్రపు నీటి ఉష్ణోగ్రత వ్యత్యాసం ఆధారంగా ఉత్పత్తి చేస్తారు. ప్రపంచంలోనే మొట్టమొదటి OTEC కేంద్రం తమిళనాడులోని ట్యూటికోరిన్ వద్ద అమెరికా సహాయంతో నిర్మించారు. ప్రస్తుతం భారతదేశంలో ఐదు ప్రాంతీయ గ్రిడ్స్ ఉన్నాయి.

వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ.



లిటిల్స్




## మీకు తెలుసా?

- తెల్లగా, కంటి దగ్గర నీలం రంగులో ఉండే ఈ పక్షి ఇండోనేషియాలోని బాలి ప్రాంతంలో ఉంటుంది. దీన్ని బాలి స్టార్లింగ్ అని పిలుస్తారు. దీన్నే జలక్ బాలి, బాలి మైనా పేర్లతో కూడా పిలుస్తారు.
- బ్రిటీష్ బర్డ్ ఎక్స్‌పర్ట్ స్టార్లింగ్ 1911 సంవత్సరంలో ఈ పక్షి గురించి చెప్పాడు కాబట్టి అతని పేరు వచ్చింది.
- మగ పక్షులు పెద్దగా ఉంటాయి. ఆడపక్షులు చిన్నగా ఉంటాయి. అలా గుర్తించాలంతే. 25 సెం.మీ. పొడవు ఉంటాయివి. రెక్కల పొడవు 52 సెం.మీ. వీటి బరువు 150 గ్రాములు.
- గింజలు, పండ్లు, పురుగులను తినే ఈ పక్షులు గుంపులుగా ఉంటాయి.
- వీటి సంఖ్య తక్కువ. అందుకే బాలి జాతీయపార్కులో పెంచుతున్నారు.
- ఈ అడవి పక్షులను ఎక్కువగా మనుషులే పట్టుకుంటున్నారు. దీని ఫొటోతో ఇండోనేషియాలో నాణేలు కూడా విడుదల అయ్యాయి.
- ఇవి అందంగా ఉంటాయి. వీటి తోక అంచులు, మెడ దగ్గర మాత్రమే నల్లగా ఉంటుంది. ఇవి వర్షాకాలంలో మాత్రమే గుడ్లు పెడతాయి. నీలం, ఆకుపచ్చ రంగులో రెండు లేదా మూడు గుడ్లు మాత్రమే పెడతాయి. పదిహేను రోజుల పాటు పొదుగుతాయి.
- కేవలం వందపక్షులు మాత్రమే 2012 లెక్కల ప్రకారం కనపడటంతో వీటిమీద ఇండోనేషియా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది.
- వీటి జీవనకాలం కేవలం ఐదేళ్లు ఉంటుంది.
- చెట్ల తొర్రల్లో మాత్రమే నివసిస్తాయి. అది కూడా ఇతర పక్షులు వదిలేసిన పాతగూళ్లలో మాత్రమే నివాసం ఏర్పరచుకుంటాయి.
- ఇవి వేరే ప్రాంతాలకు వెళ్లటానికి ఇష్టపడవు. కేవలం బాలి ప్రాంతంలోనే ఈ పక్షులు కనపడతాయి.

## సరైన నీడ ఏది?



## 6 తేడాలను గుర్తించండి



## చుక్కలు కలిపి రంగులు వేయండి



## దారి కనుక్కోండి



## డైలీ సుడోకు - 220

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 4 | 3 | | | 5 | | |
| | 2 | | 7 | | | | | |
| 5 | | | | | | | | 2 |
| 4 | | | 8 | | | 1 | | |
| | 5 | | 4 | | 1 | | 3 | |
| | | 8 | | | 2 | | | 5 |
| 2 | | | | | | | | 8 |
| | | | | | 8 | | 6 | |
| | | 1 | | | 6 | 9 | | 4 |

**సుడోకు - 219 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 1 | 8 | 2 | 4 | 3 | 6 | 5 | 7 |
| 6 | 3 | 4 | 5 | 9 | 7 | 8 | 2 | 1 |
| 2 | 7 | 5 | 6 | 1 | 8 | 4 | 9 | 3 |
| 7 | 9 | 2 | 3 | 8 | 4 | 1 | 6 | 5 |
| 8 | 5 | 1 | 7 | 6 | 9 | 3 | 4 | 2 |
| 3 | 4 | 6 | 1 | 2 | 5 | 7 | 8 | 9 |
| 1 | 8 | 3 | 9 | 5 | 6 | 2 | 7 | 4 |
| 5 | 6 | 7 | 4 | 3 | 2 | 9 | 1 | 8 |
| 4 | 2 | 9 | 8 | 7 | 1 | 5 | 3 | 6 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.